# సుందర భారతము

కృతికర్త:

ప్రసన్నకవి

శంకరంబాడి సుందరాచారి

ప్రచురణ:

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1996

**SUNDARA BHARATAMU**

*By*

Sankarambadi Sundarachari

*Edited by:*

D. Nagasidda Reddi

T.T.D. Religious Publications Series No. 457

First Edition : 1996

Copies: 2000

*Published by:*

Sri N. Ramesh Kumar, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*Printed at:*

Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507.

# ముందుమాట

భారతీయ విజ్ఞాన సర్వస్వమని పేర్కొనదగిన గ్రంథాల్లో మొదటిది మహాభారతం. అది మానవుల భౌతిక మానసిక ఆధ్యాత్మిక జీవితానికి ప్రతిబింబం. ధర్మాధర్మాలకు జరిగిన సంఘర్షణే ఇతివృత్తంగా కలిగిన దీనికర్త వేదవ్యాసమహర్షి. దాయభాగ పరిష్కారం కుదరక జగడమాడి మరణించిన కురు పాండవు లిందులోని కథానాయకులు. ఈ వంశాలతో వ్యాసభగవానునికి సమీప సంబంధంవుంది. తనకండ్లముందే జరిగిన కురుపాండవ యుద్ధాన్ని ఆధారంగా గ్రహించి, మానవునికి స్వార్థంవల్ల సంభవించే అనర్థం ఎలాంటిదో వివరిస్తూ లోకకల్యాణార్థం ఉత్కృష్టమైన సందేశాన్నివ్వడమే ఆ మహర్షి సంకల్పం. అందువల్లనే వేదవేదాంత ధర్మ నీతిశాస్త్రాది విషయాలెన్నో ఇందులో చోటు చేసికొన్నాయి. ఈ గ్రంథప్రాశస్త్యం ఎలాంటిదో తెలిసికొనడానికి --

> "ధర్మేచార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ ।
> యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్ ॥

అనే శ్లోకం వొక్కటి చాలు.

విశ్వజనీనమూ, సార్వకాలికమూ, మానవజీవితానికి అత్యంత సన్నిహితమూ అయిన ఈ మహాభారతాన్ని సంగ్రహంగా, సరళసుందరంగా, ఆబాలవృద్ధానికీ అర్థమయ్యేటట్లు తేటగీతుల్లో ప్రసన్నకవి శ్రీ శంకరంబాడి సుందరాచారి మనకందించారు. తెలుగుతల్లిని మల్లెపూదండలతో అలంకరించిన ఈ కవి రచనలో తేటతెలుగు నుడికారపు వంపు సొంపులు విస్తృతంగా దర్శనమిస్తాయి. చిరకాలం చిత్తూరుజిల్లా వాస్తవ్యులైన వీరికి తిరుపతితో తిరుమలేశునితో సన్నిహితానుబంధం ఉంది. క్రీ.శ. 1962 వ సం॥లో కవిచేతనే ప్రచురింపబడిన ఈ సుందరభారతాన్ని తి.తి. దేవస్థానములు తెలుగు చదువరుల సౌకర్యార్థం దేవస్థానప్రచురణగా పునర్ముద్రించింది. "తింటే గారెలు తినాలి. వింటే భారతం వినాలి". అనే సామెత తను సార్థకంచేస్తూవున్న ఈగ్రంథాన్ని కవితాప్రియులూ; సాహితీవేత్తలూ, ఆధ్యాత్మికవిదులూ ఆదరిస్తారని నమ్ముతున్నాను.

ఎన్. రమేష్‌కుమార్,
కార్యనిర్వహణాధికారి,
తి.తి. దేవస్థానములు, తిరుపతి.

# మంగళాది

సుందర భారతము సుందరతరముగా ఒక సంపుటమై, ఏక సామ్రాజ్యమైన భరత ఖండమువలె, కంటికి తనువుగా, చేతి కణకువగా, ఇప్పుడు వెలువడుచున్నది. తేజస్విగా తెలుగు దేశమున వెలయగలదు.

శ్రీ సుందరాచార్యులది సిద్ధసంకల్పము. దానికి తోడైనది సిద్ధహస్తము. తన రచనకు తెలుగు పద్యము తేటగీతియే చాలునను వినయము చేత, గట్టిపట్టుదలచేత, ఆయన చేతిలో ఆ ఛందస్సునకొక మెఱుగు వచ్చినది. ఒక ధార యేర్పడినది. ఆయన 'ప్రసన్నకవి' యని యెవరో ప్రణయవాక్కు పలికినారు. అది 'బిరుదు'గాక సత్యమై ఆయన తేటగీతి కవితలలో విభుత్వము నెరపుచున్నది. ఈ భారతము వ్యాసుని హృదయమునకు, అద్దములోని కొండవలె, చిన్న ప్రతిబింబముగా తీర్మానము నందుకొన్నది. తెలుగు కవిత్రయము జాడలలో అడుగులు పెట్టి నడచినది.

'రసము, శిల్పము, తత్త్వసారమును నిందు
రసికులకు నందకున్న వారాటపడను;
రమ్యమై కుంటుపడని ధోరణిని నంది
సాగినది యన్నఁ జాలును సంతసింతు'.

అని మంగళాంతపు మాటలలో ఈకవి వినయముతో చేసిన యాశంస. రసికులు తప్పక ఆ మాట అనగలరు. రసశిల్పములును వారి నాకర్షింపక పోజాలవు. ఇక తత్త్వసారమా! దానిని మూలగ్రంథములకే వదలిపెట్టి సుందరకవి మంచిపని చేసినారు. మహామహులు కవిత్రయము వారే దానిజోలి కెక్కువగా పోలేదుగదా! మరి రసశిల్పములకు భిన్నమైన తత్త్వసారమెట్టిదో మనకు సుగ్రహముగాదు. కవికి నా ఆశీస్సు.

తిరుపతి, 18-2-'62,
ప్లవ, మాఘ శుక్ల ౧౪.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

# సుందర భారతము

## ఆది పర్వము

శ్రీకరమ్మును, దివ్య ధర్మైక పథము,
సకల వేదార్థ సంపూర్ణ సారమయము,
భారతమ్మును, సుందర భారతమన
సరళ మధురాంధ్రవృత్తిని సంగ్రహింతు. 1

వ్యాసునికి, నన్నయకుఁ, దిక్కనార్యునకును
నెఱ్ఱనకు మ్రొక్కి, యేమియు నెఱుఁగనట్టి
యజ్ఞునకు నాకుఁ దగు శక్తి నమరఁ జేయ
వలయునంచును బ్రార్థించి వ్రాయువాఁడ. 2

చంద్ర వంశీయ శూరులు, శాంతపరులు,
సత్య మార్గానువర్తులు, సచ్చరితులు
ధరణిపతు లెందఱెందఱో ధర్మబద్ధు
లగుచుఁ బాలించి చనిరి సద్యశమునంది. 3

అందు నొక్కఁడు ఘనుఁడు దుష్యంతుఁడనెడు
కువలయేశుఁడు, వలచి శకుంతలయను
తరుణిఁ బెండ్లాడి, నిరుపమ దర్పవంతు
సుగుణఖని భరతుండను సూనుఁ బడసె. 4

ప్రబల బలశాలి, సద్ధర్మవర్తి యతఁడు
ప్రజల మన్నన కెక్కిన పాలకుఁడయి
పేరుఁగనెఁ, గాన, తరువాయి వారు భరత
వంశ సంజాతులన ధరఁ బరఁగినారు. 5

వారిలో శంతనుండను వాఁడు, పుణ్య
వతిని గంగను వరియించి సుతు నొకనిని
గాంచె; నాతఁడు విజ్ఞుల కడను సకల
శాస్త్రముల నేర్చి, పెరిగె విశాలుఁడగుచు 6

ధర్మనిరతుఁడు, విజ్ఞానధనుఁడు, సాధు
వర్తనుఁడు, సత్యబద్ధుఁడు, స్వార్థరహిత
మూర్తి, నిష్పక్షపాతి, యమూల్యుఁ, డతని
సాటియనఁగల్గువారు విశ్వాన నరుదు. 7

సత్యవతియను దాశరాజన్యు సుతను
జనకునకు భార్యగాఁ జేయ, సాహసించి
బ్రహ్మచర్యంబుఁగొని, రాజ్యభాగ్యమువిడి
వెలసె నాతఁడు భీష్ముఁడై పేరుఁగాంచి. 8

తండ్రి స్వర్గస్థుఁడయ్యును ధర్మమెంచి
సత్యవతి కన్నకొడుకుల సరసనుండి
పెంచి పెద్దలఁ జేసెను, వివిధ విద్య
లందు శిక్షితులను జేసి యాదరించి. 9

దొడ్డవాఁడందుఁ, జిత్రాంగదుండు రాజ్య
రమను బాలించి కొన్నాళ్లు, రణమునందుఁ
జిక్కి మరణించెఁ దమ్ము విచిత్రవీర్యు
పాలనిడి రాజ్యమును, బత్నిఁ బడయకుండ. 10

వంశమును నిల్ప మిగిలిన వాఁడొకఁడె వి
చిత్రవీర్యుఁడు; భీష్ముఁడు చేయివిడక
చెంతనేయుండి వానిని జెక్కు చెదర
నట్లు కాపాడెఁ బ్రాణమ్మెయంచు నెంచి, 11

సాటి రాజన్యులనుగెల్చి సంగరమున,
సుందరులఁ గాశిరాజన్యు నందనలను
దెచ్చి ముప్వురి వానికినిచ్చి పెండ్లిఁ
జేయ నుంకింప, వారిలో జ్యేష్ఠయైన 12

యంబ యనువామె, సాళ్వుఁడటన్నవాని
వలచితి నటంచు వెడలెను వానికడకు;
కన్య యంబిక, యంబాలికయు విచిత్ర
వీర్యుఁ జేఁబట్టివారు వివేకినులయి. 13

ప్రణయలీలల సతతమ్ము వాఁడు భోగ
లాలసుండయి కృశియించి చాలక్షయము
తగిలి మరణించెఁబడయక తనయు నొకని
వంశవృద్ధికిఁ బరమ దౌర్భాగ్యుఁడగుచు. 14

సత్యవతి లోనఁగ్రుంగెను; శంతను కుల
మట్లు నశియింపనున్న యన్యాయమునకుఁ
దానె కారకురాలని తలఁచి భీష్ము
దండకును బిల్చి పలికె సంతాపపడుచు. 15

స్వార్థమునువీడి, శ్రమకోర్చి సాఁకి, చక్ర
వర్తులను జేసితివి భేదభావమెఱుఁగ
నట్లు నీ తమ్ములను; వంశమంతరించు
మార్గమునుబట్టి వారును మడిసినారు. 16

విధి విధానముఁ దప్పింప వీలుకాదు;
విజ్ఞునికి నీకుఁ దెలియని విధము లేదు;
వినుము నామాట---వంశమ్ము వృద్ధిఁగాంచ
వలయు నెటులైన; నీవె తోడ్పడఁగవలయు. 17

గరుడ గంధర్వ యక్ష కింపురుష సిద్ధ
సాధ్య కిన్నరోరగ సురజాతికెల్ల
సార్వభౌముండవై యుండఁజాలు నిన్నుఁ
గన్నకుల మంతరించెడు కర్మమేమి! 18

ప్రతినఁ బాలించుకొంటివి; పడసి నన్ను
మడిసె నీ తండ్రి: నేఁగన్న కొడుకులకును
రాజ్య మిప్పించితివి; వారి ప్రాఁతకొలఁది
వారు వర్తించి చావును గోరిచనిరి. 19

నన్ను శంతనుసతిఁ జేయుమున్న నిన్నుఁ
గాదటంచును బేరాసఁగలిగి నాదు
కొడుకులకె రాజ్య మందీయఁగోరి కొంపఁ
గూల్చె నా తండ్రి కుమతియై కోపపడకు. 20

త్యాగివైనావు వాఁడు నీ తండ్రికయ్యు.
వేఁడు నీ పినతల్లి విన్వేఁడుఁ - బెద్ద
మనసుఁ జేయుము - పెండ్లాడి తనయులఁ గను.
మన్న! యంచును బ్రతిమాలి యడిగె నతని. 21

అమ్మ! నీ మాటఁ బాటింపననను గాని
యాడి బొంకంగనొల్ల; నే నసువులూడు
వఱకుఁ బెండ్లాడనంటిని; వలతువేని
మార్గ మన్యమ్ము గలదు, సన్మార్గమద్ది. 22

తొల్లి క్షత్రియ కులజుల నెల్లఁ బరశు
రాముఁడనువాఁడు హతమార్ప, రాజపత్ను
లనదలై సంతతినిబొంద నవనిసురుల
నాశ్రయించిన న్యాయమ్ము ననుసరించి, 23

మహితు, నిష్కాము, నొక్కని మాన్యునెంచి
మనసు వెలిఁబుచ్చి ప్రార్థించి మలినపడక
మనుమలను బొందనగునంచు, వినయమునను
బలికి తల్లిని ఒప్పించె వాఁడు కడకు. 24

సత్యవతి కన్యగాఁ బరాశరునిగూడి
పొందియుండిన వ్యాసుని డెందమందు
కార్యసిద్ధిని గలిగింపఁ గలఁడటంచుఁ
దలఁచె భాగీరథీపుత్రు పలుకుల విని. 25

సత్వరమె మౌనివరుఁడు ప్రసన్నుడగుచుఁ
దల్లి పాదమ్ములంటి వందన మొనర్చి,
యంబికను దాని సోదరి నండఁబిలచి
ధ్యానపరవశుఁడై పుత్రదాన మొసఁగె. 26

గడ్డమును దాను నా ఋషి కవియవచ్చు
కరణిఁ గాంచిన యంబిక కనులుమూసె
నౌట, నంధుని ధృతరాష్ట్రుఁడన్నవానిఁ
గనెను మనసుమబట్టి మాంగల్యమనఁగ.

క్రమ్మ చెమ్మట, కాయమ్ము గంపమందఁ,
జల్లపడి మోము చందమ్ము దెల్లపడఁగఁ,
గలిపి తపసిని యంబాలికయును గనెను
బాండు వనువాని నొక్కనిఁ బాండువర్ణు. 28

మంచిదే; యందు నొక్కఁడు మచ్చలేని
మాడ్కి జన్మింపకుండిన మనసులోన
మథనపడె సత్యవతి; కొఱమాపవచ్చి
మరల నంబికపై మౌని మనసు నిలిపె. 29

మందమతి యామె మౌని నేమమ్ముఁగనక
కరములోఁబడ్డ ఫలమును గాలఁదన్ని
దాసి నొకదానిఁ దనరూపుఁ దగ నమర్చి
తనకు మారుగఁ బంపెను దపసికడకు. 30

సర్వమంగళరూపుని, సత్పురుషుని,
నీతులకునెల్ల నెలవైన నిర్మలాత్ము,
విపుల విజ్ఞానరాశిని విదురుఁడన్న
తనయుఁ గననోచె నద్దాసి ధన్యురాలు. 31

పూర్ణ పుత్రోత్సవమ్మున పొంగు జనకు
భంగి భీష్ముఁడు తన బహిఃప్రాణమనఁగఁ
బంచనిడికొని పెంచి యబ్బాలకులను
జతురులను జేసె క్షాత్ర సంస్కారమిచ్చి. 32

కౌరవాధీశు ధృతరాష్ట్రుఁ గరముఁబట్టి
కొలిచె గాంధార సుందరి; కుంతిభోజు
కూతురును మద్రరాజన్య కూర్మి సుతయుఁ
బాండునిం బెండ్లియాడిరి ప్రాయమొదవ. 33

ధర్మనిరతుఁడు బాండువు దండనుండ,
సాయపడుచుండ విదురుఁడు సరసనుండి,
యన్నిటికిఁ దోడుగా భీష్ముఁ డాదరింప
రాజ్యభారమ్ముఁగొనె ధృతరాష్ట్రవిభుఁడు. 34

వసుధనే చూడనేరనివాఁడు, జ్యేష్ఠుఁ
డగుట సింహాసనమ్మున నమరెఁ గాని,
ప్రజల బాగోఁగు లరయుచు బాండురాజె
ప్రబలె రాజన, నుతులంది రాణకెక్కి. 35

శాంతి భద్రత లమరి రాజ్యమ్ములోని
వారు నిశ్చింతులైయుండ, వాఁడు వేట
లాడ నాశించి పత్నులు ననుసరింప
నగ్రజుని సమ్మతినిగొని యడవి కేఁగె. 36

హరిణియును హరిణమ్ముగా నాటలాడు
చున్న [1]మునిదంపతులఁ జక్కఁజూడలేక
హరిణిఁ నేసెను వాఁడొక్క శరముఁ దఱిమి
విధిని వేటాడి వధియింప వీలుపడక. 37

కాంత యటుకూల మౌని యాగ్రహముఁ జెంది
వాని శపియించెఁ గ్రూరుఁడై, పత్ని నంటి
నంతఁ జత్తువుపో! యని - యసువులూడి
నట్టు లాతఁడు మూర్ఛిల్లి యవనిఁ బడఁగ. 38

మఱిపోలేక హస్తినాపురమునకును
నటనె జీవిత శేషమ్ము నరుగఁబుచ్చ
వలచి యాతఁడు, భటులనుబంపి దుఃఖ
వార్త నందించె నన్నకు, బందుగులకు. 39

ఆండ్రతోఁగూడి, ప్రణయ సౌఖ్యమ్మునందు
వ్రాఁతకును దప్పినాఁడని వగవఁడతఁడు;
బ్రతికినందాకఁ బుత్రులఁ బడయ లేని
చింత వానిని నిలువునఁ జీల్పదొడఁగె. 40

పరిణయముకాని తఱిని దూర్వాసుఁ గొలిచి
తలఁప నే దివ్యునైనను దనకు నట్టి
తనయుఁ దుదయించుమనియెడు ఘనవరమ్ము
నందియుండిన కుంతి, యెట్లైన మగని. 41

---

1 ముని పేరు కిందముడు.

తాపమునునార్పి, పెలవంది, ధ్యానచిత్త
యగుచు మంత్రము జపియించి, యాత్మలోన
నెంచె ధర్ముని, వాయువు, నింద్రు - వారు
మెచ్చి తముఁబోలు పుత్రుల నిచ్చినారు. 42

ధర్మజుని నిచ్చె ధర్ముఁడు; దర్పవంతు
భీము నొసఁగెను వాయువు; వీరవర్యు
నర్జునుని వాసవుండిచ్చె - నాయువంది
నట్లు పాండువు మోదాబ్ధి యందుఁదేల. 43

మాద్రియును నంత నాథు సమ్మతిని బడసి
మంత్రమును గుంతికడ నేర్చి, మానసమున
నశ్వినీ దేవతలనెంచి, యమడల నకు
ల సహదేవులఁ గనెను విలాసిసముల. 44

పాపభావమ్ము కోరినఁ బట్టుపడని
పట్టులోఁ బాండుసూనులు పరమఋషుల
పర్ణశాలల చెంగటఁ బ్రకృతిమాత
పెంచి లాలింప బాలురై పెరిగినారు. 45

గర్భమది యెంత గొప్పదో! కలుగనున్న
ఘనుల జాతక మెట్టిదో! కాని యచట
గర్భవతియైన గాంధారి కదుపునిండి
కూడఁ గనలేక చాల తాపాడుచుండె. 46

పాండుసతి కుంతి ధర్మజుఁ బడసెనన్న
మాటవిని యీసుపైఁగొన మనసు విఱిగి,
కదుపుపై గ్రుద్దుకొనె ఖండ ఖండములయి
ప్రిదిలి పిండమ్ము గర్భము వెడలిజాఱి. 47

కాని, యా వ్రయ్యలన్నియు మౌనివర్యు
వ్యాసు దయచేతఁ, జైతన్యభావమంది
రూపులనుగొని యొక నూఱు పాపలగుచు
విశ్వమోపని బరువుగ వృద్ధిఁగాంచె. 48

సంతసముపొంగు నవ్య వసంత వేళ
ప్రణయ భావమ్ము చిగురింపఁ, బాండువిచట
వలదు వలదన్న మానక పట్టుపట్టి
మాద్రితోడను రమియించి మరణమందె. 49

తన్నుఁ గలిసిన దోషమ్ము దగిలె యట్లు
ప్రాణనాథుఁడు మరణింపఁ, బల్నిమాద్రి
సుతులఁ గుంతికి నర్పించి చితిని దూఁకి
ధరణిపై నుండనొల్లక దగ్ధమయ్యె. 50

అట్లు తనయులతోఁ గుంతి యనదయైన
వార్త వినినంత వృద్ధులు వర్తమాన
మంపి రావించిరామెను హస్తినాపు
రమునుఁ జేరగ శోకభారమునఁ గ్రుంగి. 51

తాత భీష్ముని యదుపులోఁ దారతమ్య
భావ మెఱుఁగని పగిదిగఁ బంచపాండ
వులును, కురుపుత్రులును గూడి పలువిధముల
నాడ బాల్యము గడచి ప్రాయమ్ముదరిసె. 52

తమ్ములను గూడి యాడుచు ధర్మపుత్రు
డదనుఁ గనిపెట్టి విజ్ఞుల యండఁజేరి
ధర్మసూత్రమ్ములను, వేదమర్మములను
బరవశుండయి వినుచుండెఁ దఱచు తనిపి. 53

బండలనునెత్తి చెండాడి, కొండలపయి
నుండి గుట్టలపైదూఁకి దండనున్న,
యనుజులను రెండు చంకల నదిమిపట్టి
గంగ కెదురీదుచుండెను గాలిపట్టి. 54

పచ్చిరెమ్మల ధనువుగవంచి కట్టి,
పుల్లలను గోలలుగ, బూన్చి, పూనివిసరి,
యెట్టి లక్ష్యమ్ము నైనను గొట్టఁగల్గు
దక్షుఁడైయుండె నింద్రనందనుఁడు మించి. 55

కౌరవాగ్రజుఁడై చాల ఘనత కెక్కి
నట్టి దుర్యోధనుఁడు గట్టి దిట్టయయ్యుఁ
బవన తనయునితోఁ దూఁగ వలనుగాకఁ
గుంటుపడుచుండె నీర్ష్య పైఁగొనుచునుండ. 56

అది పునాదిగ వానిలో నంకురించి
ద్వేషబీజమ్ము వృక్షమై పెరుగ, వాఁడు
దుష్టుఁడై చెడిపోయెను తోడఁబుట్టు
వులను సైతము జెడుమార్గములను ద్రిప్పి. 57

శక్తి సామర్థ్యములకును, సత్యవర్త
నకును, గుణశీలములకు, వినయ విశాల
భావములకును నిలయులై పాండుసుతులు
మెప్పులందుట వానికి నొప్పకుండె 58

సుంత వానికిఁ దగ్గని సోదరుండు
పేర దుశ్శాసనుండను పేరువాడు
ప్రక్కబలమౌచుఁ దోడ్పడ, వాఁడు భీముఁ
బట్టి చంపఁగ యత్నించెఁ బలువిధముల. 59

అన్న వారించుచుండఁగ నతని యాన
వమ్ముగాఁజేయు దుష్ట గుణమ్ము లేమి,
వాయుసూనుండు గదలక వాని దౌష్ట్య
మును సహించు చునుండెను గినుకమాని. 60

తండ్రి బోధించెఁ; దాతయుఁ దగదటంచుఁ
దెలిపెఁ బలుమార్లు; బుద్ధిని దిద్దనెంచి
విసిఁగె విదురుఁడు; ఫలమేమి! విధము మార
నట్లు తనదారిఁ దనదిగ నరిగె ఖలుఁడు. 61

స్వార్థమును నీర్ష్యతోఁ గల్పి, పగయటన్న
జోటిలో నూఱి, బువ్వగ నోటఁబెట్టఁ
గడుపు నిండార మువ్వూటఁ గుడిచి యెదిగి
నట్టి పెనుకాయ మాతనిదగుట నిజము. 62

క్రుద్ది జేఁనికి, నీర్ష్యపైఁగొన్న పతికి,
ప్రేటుపడినట్టి గర్భాన వెడలినట్టి
వికృత జన్మము వానిది; వెఱ్ఱికాని--
చక్కఁబడు నెట్టులాతఁడు చచ్చువఱకు! 63

శాంతనవు కోర్కెపైఁ గృపాచార్యు చెంత
నర్భకులు శస్త్రవిద్యల నందుచుండ,
బాల్యమిత్రుఁడు ద్రుపదుఁడు పరిభవించి
పంప, ద్రోణుఁడు పనిఁబూని వచ్చెనటకు. 64

ద్రోహి ద్రుపదుని, సమరానఁ ద్రొక్కి తెచ్చి
తనదు పాదాలఁ బడవైచు ధన్వినొకనిఁ
బడసి శిష్యుండుగా, తన భంగపాటు
మాపుకొన వచ్చెనట్టులా మానవుండు. 65

వాని చాతుర్య మెఱిఁగినవాఁడు కాన
జాహ్నవీనందనుఁడు కృపాచార్యు చిత్త
మడిగి, మనుమలనెల్లను విడిచె వాని
పంచఁ, బైఁబయివిద్యలఁ బడయుటకును. 66

పాటిలేనట్టి ధన్వి యాచార్యుఁడతఁడు
ఖడ్గ కార్ముక విద్యల, గదనుబట్టు
భంగిమమ్ముల, రథగజాశ్వములనుండి
సమర మొనరించు గతుల సాంతముగ నేర్పె. 67

దండిమల్లురుగా, గదాధరులుగాఁగ
భీమ దుర్యోధనులు మించి వెలిఁగినారు;
అర్జునుఁడు మేటిధన్వియై యనుపమానుఁ
డయ్యె దేశికు మదికిఁ బ్రియమ్ముఁ గూర్చి. 68

అంత శుభలగ్నమును జూచి యాప్తులలర
నమరపతి సుతుఁడెట్టి వాఁడయ్యెనంచుఁ
బదుగురకుఁ జూపఁ గ్రీడోత్సవమ్ము నొకటి
ద్రోణుఁ డేర్పడఁజేసె నేత్రోత్సవముగ. 69

కురుకులేశుఁడు, గాంధారి, కుంతి, భీష్మ
విదురులును ద్రోణ కృపులును వేనవేలు
పౌరులునుజూడఁ జని యాటపట్టు నడుమఁ
గఁడగి రొక్కొక్కరే తమ ఘనతఁజూట. 70

భీమ దుర్యోధనులు దొల్తఁ బెనఁచి యొడలు
క్రీడకై పోర మొదలిడి, క్రిందు మీఁదు
లగుచుఁ బగ పెంచుచుండ నేమౌనోయంచు
బెదరి వారించి రప్పుడు పెద్దలెల్ల. 71

అర్జునుండంత రంగమధ్యమ్ముఁజేరి,
యుంపపాదిఁదాఁకి యమ్ముల నంది యుంది
చిత్రగతి వేయుచుండఁగఁ జిత్తరువుల
పగిదిఁ గదలక చూచిరి ప్రజలు, మెచ్చి. 72

జయజయ ధ్వానములు మించెఁ; జదలు చీల
సురలు కనుపండువుగఁ జూచి విరులుపల్లి
వారు; దుర్యోధనాదులు నోరుఁదెఱచి
ఫుల్లగిల్లిన మోముల నల్లఁగనిరి. 73

కర్మ చెడి, కౌరవ జ్యేష్ఠకడను జేరి
కర్ణుఁడనుపేరఁ బరఁగెడు ఘనుఁడొకండు
వానిలోవచ్చి క్రీడోత్సవమును జూచు
చుండె మబ్బులలోని మార్తాండుఁడనఁగ. 74

వాఁడు సామాన్యుఁడా కాడు! వరమహిమను
గన్యయగు కుంతి కని భీతి గంగపాలు
చేయగా సూతుచేతను జిక్కి కర్ణు
డనఁగఁ బెరిగిన సూర్యనందనుఁడె చూడ. 75

పరశురామునికడ విప్రవరుని పగిది
వరలి శిష్యుండుగా వాఁడు పెరలకందు
పడని శస్త్రాస్త్రవిద్యలఁ బడసి, చతురుఁ
డౌచు వృద్ధినిగాంచిన యులఘుబలుఁడు. 76

ఓర్పునా చూచి యన్యునట్లొరులు గొప్పఁ
జేసి పొగడఁగ ? నాతఁడు సెలఁగి చిత్త
వృత్తి పురికొల్పి తఱిమగ వెడలి రంగ
భూమిపై నిల్చె వీరముప్పొంగి పొర. 77

అర్జునునిచేఁత లవియెంత యనెడు భంగి
విరసనముఁజూపు తీవితో నిలిచి యతఁడు,
సహజకుండలదీప్తులు, స్వర్ణకవచ
రోచులునుబర్వఁ జేతి కార్ముకము మెఱయ, 78

మించి, పెద్దల సెలవంది, మెచ్చునటులు
సూచి యర్జును నొకసారి, చూపుఁద్రిప్పి
చూచి ద్రోణార్యునలఁతిగ, జూచుచున్న
చూపరులఁజూచి నిజశక్తిఁ జూపఁదొడఁగె. 79

కార్ముకంబును, గుణమును, గరముపట్టి
తఱిమి నొక్కొక్క శరమును, శిరమువంచి
వాని కనుసన్నలంది భావమ్ము లెఱిఁగి
వశ్యమైయాడెఁ ద్రిప్పినభంగిఁ దిరిగి. 80

బాగుబాగనె భీష్ముఁడు; పరవశుఁడయి
చూచె ద్రోణుఁడు; విజయుఁడు దాఁచికొనెను
లోనబుట్టిన ఈర్ష్యను; మానసమున
వెతలు చెఱలాడఁ గుంతి నిర్విణ్ణయయ్యె. 81

విజయ గర్వము గనుఁగప్ప విఱ్ఱవీగి
భానుసూనుఁడు విజయుని ద్వంద్వ యుద్ధ
మునకుఁ జీరెను గాంధారితనయులొకట
రెచ్చగొట్టుచునుండఁ బ్రేరేపణంది. 82

సంతసముపొంగు నా శుభసమయమందుఁ
బంతముల పోరు నణఁచు సద్భావమునను
గృపుఁడు నిరసించెఁ గర్ణునిఁ గ్రిందుచేసి
యర్జునునితోడఁ బోర ననర్హుఁడంచు. 83

మంచు బొట్టులు పడఁ బైన మస్తకమును
వంచుఁ బద్మమ్ము వలెఁ గర్ణు డించుకంత
[1]శిరము వాలిచి యుస్త్రాద్రి మఱుఁగనున్న
భానుదెసఁ జూచె వేదియుఁ బాలుపోక. 84

సహజ కుండల కవచుని సౌకఁజేసి
పలుక నే నొప్ప; వీనిని బ్రజలముందు
నంగరాజును జేసితినంచు వాని
గౌరవించెను గౌరవాగ్రజుఁడు గనలి. 85

వాటినుండియు న్యాయ మన్యాయములను
బాటిచేయక కర్ణుఁడు పరువునిలిపి
యాదరించినవాని నత్యంత ప్రియుని
గాఁదలంచుచుఁ బ్రాణమై కాచుచుండె. 86

అయ్యు, నీర్ష్యాళువున కెట్టి యాత్మశాంతి
కలుగు ? దుర్యోధనుని వంత వెలియులేదు
పాండుసూనులు దిన దిన వర్ధమాను
లగుచునుండఁగఁ బ్రజల నెయ్యమ్ము నంది. 87

శత్రువొక భీముఁడేకాఁడు, క్షాత్రరూపుఁ
డర్జునుండును బగవాఁడెయౌచుఁ గలఁచె
వానిఁ గ్రీడోత్సవమునుండి, పదుగురతనిఁ
బెద్దగాఁజేసి పొగడిన విధము వలన 88

తాను, దన తమ్ములును దాఁకి తన్నులు తిని,
పట్టనేరక వదలిన ప్రబల బలుని
ద్రుపదు నోడించి, కొనివచ్చి ద్రోణుకాళ్ళ
పైచె నర్జునుఁడే వీరవరులు మెచ్చ. 89

వయసులో, బుద్ధిలో, సౌమ్యవర్తనమున,
వరగుణమ్ముల ధర్మజు వంటి వారు
లేరటంచును ధృతరాష్ట్రుఁడేరి, యుతనిఁ
జేసె యువరాజుగాఁ జిచ్చుఁ జిమ్మినట్లు. 90

---

1 వ్యాసుడు భారతానికి వ్యతిరేకం

ముగిసె నన్నియు నేదియు మిగుల లేదు;
కాలరాచిరి తన్నొక గండుచీమ
కరణి నంచును గౌరవాగ్రజుఁడు శిరము
పగుల యోచింపఁదొడఁగెను భావిగతుల. 91

తండ్రి మరణింపఁ బాండునందనులు రాజ్య
రమను జేఁబట్టి తన్ను బైరాగిఁజేయు,
వారి మోచేతి క్రిందుగా బ్రతుకవలయు
వ్రాఁత తప్పదటంచును బాధపడెను. 92

మాతతోఁబోరె; జనకుని మతిఁగలంచెఁ;
దమ్ములకుఁ జెప్పి శోకించెఁ; దన్నుఁ గావు
మనియెఁ గర్ణునిఁ; బ్రబల మాయావి శకుని
మామకడఁజేరి యోచించె మనసువిప్పి. 93

పాండుసూనులఁ గనుజెప్పు పాటులోనఁ
బట్టి నీ కాళ్లఁ బడవైతు వగపుమాని
సమర శంఖమ్ము నూదుము చాలునంచుఁ
గర్ణుఁ డుత్సాహమును జూపెఁ గయ్యమునకు. 94

గోటితోఁదెగు పనికిని గొడ్డలిఁగొన
నేల, నెత్తుటి బొట్టొందు రాలనట్లు
వారి వంచించి చంపఁగావచ్చు నంచుఁ
జల్లగాఁబల్కె శకుని మేనల్లుఁజూచి. 95

వారణావత పురమున భవన మొకటి
లక్కతోఁ జెక్కలనుగూర్చి చక్కఁగట్టి,
వారి నందుండఁ గల్పించి వ్యాజమొందుఁ
గాల్చి చంపుట సుళువైన కార్యమనెను. 96

మామ మాటలు తీయఁగా మదినిఁ దడుప
క్షణములో లక్కయింటివి గట్టియుంచి,
కుంతితోఁ బాండవుల నందుఁ గొంతకాల
ముండఁ బంపించె దుర్యోధనుండు, జనకు 97

గాళ్ళపైఁబడి, కన్నీటి కాల్వలందుఁ
గడిగి, పడియేడ్చి, బ్రతిమాలి యడిగి యడిగి,
కాదటన్నను దప్పక గరళముఁగొని
చత్తునని చెప్పి యొప్పించి చక్కఁదిద్ది. 98

అగ్ని భయమును గరళ భయమ్ము కలదు
తెలిసి వర్తింపుఁడట నంచుఁ దెలియఁజెప్పి
పంప విదురుఁడు, జనకుని పలుకుఁ దలను
దాల్చి, తనవారితోఁ జనె ధర్మజుఁడు. 99

వాసమందఁగ వారణావతమునకును
వచ్చు పాండవులకు ఘనస్వాగతమిడి
పౌరులెదు రేగఁ, బురిఁజొచ్చి వారు, వసతిఁ
గొనిరి లాక్షాగృహమ్మునఁ, గుంతితోడ. 100

భవనమునువిడి వెలిఁబడ వాటముగను
దీర్చి భూమార్గమును, దీరుఁ దెలియజెప్పి
రమ్ము భీమునకని సత్వరమ్మె యటకుఁ
బనిచె విదురుఁడు ఖనకు నొక్కనిని బిలిచి. 101

వాఁడు నట్టులెకావించి వచ్చెఁ; బవన
నందనుఁడు కాలమునువేచి, యరులుచిచ్చుఁ
బెట్టుటకుమున్నె గుట్టును బట్టుఁజెడక
తానె చిచ్చిడె నర్ధరాత్రమ్మునందు. 102

అగ్గిపాలైరి పాండవులట నటంచు
వారణావతవాసులు వగచుచుండ,
వార్తవిని ధార్తరాష్ట్రులు వగపుమాని
విందుఁ గుడిచిరి మిత్రులఁ బిలిచి యలరి. 103

భవనమటు కాల భూతల ద్వారమంటి
చల్లగాఁ బాండుసూనులు దల్లితోడ
వాయుపుత్రుని సాహాయ్య బలమువలనఁ
గావనమ్మునఁబడి ముందు కదలినారు. 104

ఆఁగ నొకచోట నట హిడింబాసురుఁడను
వాఁడు పైఁబడె; భీముఁడు వానిఁబట్టి
త్రిప్పి గిరగిర నేలను దీసికొట్ట
మడిసె నాతడు వెంటనే నడుము విఱుఁగ. 105

దనుజ సోదరియా హిడింబిని వరించె
వలచి వేడఁగనది వాఁడు ప్రక్కనున్న
కుంతి మన్నించి తోడ్పడఁ; గొంతకాల
మైన ఘనుఁడొక్కఁ డుదయించె నలఘుబలుఁడు. 106

తల్లి గర్భమ్మువిడి ఘటోత్కచుఁడు వాని
తనువు బ్రహ్మాండముగఁ బెంచి తండ్రిముందు
నిలిచి వందనమిడి, యెంచి పిలచినంత
వత్తునని తల్లితోఁ గనపడకపోయె. 107

అంత నొకనాఁడు తాపసి వ్యాసుఁ డటకు
వచ్చి బాగోఁగులరసి, యాపైని వారు
మెలఁగవలసిన రీతులఁ దెలిపి, యింక
నేకచక్రపురమ్మున కేఁగుఁడనెను. 108

వల్లెయని వార లతనికి వందనమిడి
చెప్పి సెలవంది, రూపులనొప్ప విప్రు
లనఁగ మారిచి, పయనమై యచటికేగి
విడిసిరొక పేదబాఁపని విడిదిలోన. 109

వసుధనేలఁగఁ బుట్టినవారు, దుష్ట
విధివశమ్మున నింటింట బిచ్చమెత్తి
బ్రతుకుచుండిరి, పురములో బ్రాహ్మణులకు
మనసు కెక్కిన వారలై మాన్యులగుచు. 110

రెండు కారెనుఁబోతులు, బండెఁడన్న
మును నొకండును, బకుఁడను దనుజునకును
వారమున కొక్కపరి యింటివరుసఁ దప్ప
కుండ విధిలేక పంపుచునుండ, నచటి 111

పౌరులాచారముగ; గాలిపట్టి, తమకుఁ
బ్రాపుఁ జూపిన బాఁపని వంతుఁదీర్ప
బండెఁడన్నపు శకటాన వానికడకు
వరిగి పైఁబడి మర్దించి యతనిఁ జంపె. 112

ద్రోణుఁ గృపచేత విడిపడి, ద్రుపద పతియు
దన్ను వోడింపఁగల్గిన ధన్వి నర్జు
మని వరింపఁగఁజాలిన తనయ, ద్రోణు
పట్టి వధియించు సుతుని వెబ్బంగినైనఁ 113

బడయ యాగమ్ము నొనరించి పడసి, పెంచి
సంతసించుచునుండెడు నంతలోనె,
పాండవులు దగ్ధులైరను వార్తను విని
వగచియును నమ్మఁజాలక, దిగులుమాని 114

బ్రతికియే యుందురని యెంచి, ప్రాయమంది
నట్టి యాత్మజ నెటులైన నర్జునునికె
భార్యగాఁజేయ నాశించి, వానిజాడ
లరయఁబూనెను దగిన ప్రయత్నమునకు. 115

అవని పైఁబైన గిరగిరమంచుఁ దిరుగు
మత్స్యయంత్రముఁ గట్టించి, మాన్యుఁడెవఁడు
దానిఁ గ్రిందున్న నీరమ్ములోనఁ జూచి
యైదు శరముల వేయునో యతనికిఁ దన

యమఁగుసుత నిత్తుఁ బత్నిగనంచుఁ జాట
నతడు శుభలేఖలనుబంపి, యర్జునునకె
కాని యన్యుల కా ఘనకార్యసిద్ధి
కలుగదంచును నెడదలో దలఁచి, కాచె. 117

వారణావతవాసు లాహ్వానమంది
పయనమగుచుండఁ, గుంతియుఁ బాండవులును
బయలుదేరిరి పాంచాలు పట్టణమును
జేర, నొరులకుఁ దమతీరు చిక్కనట్లు. 118

కుంభకారుని యింటిలోఁ గుంతినివిడి,
పౌరులును, బ్రాహ్మణులు, వీరవరులు నమరి
యున్న ద్రుపదుని సభఁజొచ్చి యుర్విసురుల
మధ్య నాసీనులైరి సామాన్యులటుల. 119

ధన్వి లొక్కొక్కరే ప్రయత్నములుచేసి
మత్స్యమును గొట్టనేరక మరలినారు
కర్ణునంతటివాఁడును కార్ముకమ్ము
నంది విడిచియు విఫలుఁడై యరిగెఁవాడు. 120

అందఱునుజూచి తమ నవ్వ, నంత ధనువు
నంది బాఁపనివలెఁదోఁచు నర్జునుండు
తూఁపునెక్కిడి గుఱిపెట్టి చూపునిలిపి
మత్స్యమునుగొట్టి పడవైచె మహిని మరల. 121

చప్పటలుకొట్టి బాఁపలు చంక లెగుర
వైచినారు సంతోషముఁ బట్టలేక;
దిక్కులను జూఁడదొడఁగిరి తికమకలయి
రాజరాజాధిరాజులు రంగుమాయ. 122

అట్టి పనులకు బాఁప లనర్హులంచు
నతనిపైఁబడి దుర్యోధనాది ఖలులు
భంగపడి వెన్నుఁజూపిరి; పడతినంది
యన్నదమ్ములతో వాఁడు నరిగె నంత. 123

మాతకడకేఁగి యాతఁడు మంచిఫలముఁ
బడసి తెచ్చితినన నామె పంచుకొనుఁడు
ఐదుగురు మీరటంచుఁ బ్రియమ్ముఁ బలికె
నాత్మజుని పల్కులో మర్మమరయలేక. 124

ఫలము ఫలమైనఁ బదుచైనఁ బ్రాణమైనఁ
బంచుకొనవలె జనని శాసించినట్టు:
లర్జునుఁడు ద్రౌపదిని జూచె, యామె యతని
జూచె, వచ్చిన ద్రుపదుఁడు జూచి నిలిచె. 125

పూర్వజన్మానఁ దపమంది పొందినట్టి
వరఫలమ్మునఁ బాంచాలి పడయవలయుఁ
బంచనాథుల; నిందు శంకింపఁదగిన
పనియె లేదని వ్యాసుఁడు వచ్చి పలికె. 126

అగ్ని సాన్నిధ్యమున శుభలగ్నమందు
ధరణి సురులెల్ల మంత్రాక్షతలనుజల్లఁ
బరిణయంబయ్యె ద్రౌపది పంచపాండ
వులను వేదోక్తముగ మేను బులకరింప. 127

హస్తినాపురవాసుల కందిపోయెఁ
బాండవులు క్షేమముగనున్న వార్త; వారు
పాపి దుర్యోధనుని నీచవర్తనమును
దిట్టిపోయఁ దొడంగిరి తెరువులందు. 128

ఆలపించినఁ బురజను లాగరంచు
బెదరి కురుపతి వెంటనే విదురుఁ బంపి
వారిఁ బిలిపించి చనవు తోపంగఁ బలికి
యర్ధరాజ్యమ్మునిచ్చి న్యాయమ్ము నిలిపె. 129

అందినదె చాలునని తృప్తినంది, జనకు
పదములకు మ్రొక్కి, భీష్ముని విదురుఁజూచి
వినతులై దీవవలనంది, విడువలేని
ప్రజల నోదార్చి హస్తిపురమ్ము విడిచి, 130

కుంతి, నల్గురు తమ్ములు గూడి కదల
ఖాండవప్రస్థమును ధర్మజుండు చేరె,
దారిపొడుగునఁ బ్రజలను ధర్మబుద్ధి
వెలయఁ బాలించురీతులఁ దలఁచి, తలఁచి. 131

రాజధానిగ నిందురప్రస్థమనెడు
పురవరమ్మును సురరాజ పురముఁ బోల్పఁ
జిత్రముగఁదీర్చ నొక దేవశిల్పి, యందు
నిలిచి యేలెను నీతికి నిలయుఁడతఁడు. 132

తనిపి వగమాని శాంతిభద్రతలనంది
వస్తుపాటుల నెఱుఁగని పగిది, భోగ
భాగ్యములనంది యాతని పాలనమును
మెచ్చి సుఖముండఁ బ్రజలెల్ల, వచ్చియటకు, 133

ఐదుగురి కొక్కభార్య, యైక్యమ్ము పెడును
దాన; నేడున కొక్కరై దారతోడఁ
గాపురముఁ జేయఁ దగునంచుఁ గడఁగి మంచిఁ
బలుక ముని నారదుఁడు, వారు వల్లె యనిరి. 134

అట్టులుండగ నొకనాడు అర్జునుండు
ఆర్తునొక్కని గాపాడు నవసరమున
శస్త్రశాలకు నేఁగుచు సతినిగూడి
యున్న ధర్మజుఁ జూచిన ఖిన్నుడగుచుఁ, 135

గారకుండొట నియమ భంగంబునకును
దాను, మన్నింపుమనివేడి ధర్మజువిడి
పుణ్యతీర్థాల సేవింపఁబోయినాఁడు
పాప పరిహారమునకయి బాటఁబట్టి. 136

భారత క్షేత్రములగల భవ్యమైన,
గంగలందెన్నిటనో మున్గి, కాంచి వలచి
నట్టి నాగాంగన నులూచి యున్న కన్య
నంది, పత్నిగఁ బుత్రుని బొంది యరిగి, 137

మణిపురాధీశుఁ జిత్రవాహనుని ప్రాగ
తమును మన్నించి, చిత్రాంగదను వరించి,
బభ్రువాహనుఁడను సూనుఁబడసి, కదలి
ద్వారకనుజేరి, నందనందనుని గలిసి, 138

కమ్మగను కాలమును గొంతఁగడపి, చూచి
వలచి ఆతనిచెల్లి సుభద్రను వరి
యించి తోఁగొని, పెలవంది యేఁగి వచ్చె
నిందురప్రస్థ పురికి నానందముగను. 139

వస్తువాహనముల మాత్న వస్త్రములను
బసిఁడి వగలను గొంచు సుభద్ర కరణ
భాగ్యముగనీయ గోపికా వల్లభుండు
బంధుమిత్రాది గణముతో వచ్చెనంత. 140

ఇందురప్రస్థ పురమది యింద్రనగర
మనఁగ రంజిల్లెఁ; బురజను లాడిపాడఁ
దొడఁగి రుత్సాహులై; యెల్లకడలఁ బర్వెఁ
బరిణయోత్సవ శోభలు పట్టణమున. 141

ప్రణయ సుఖమునఁదేలి సుభద్రకనెను
ఘనువి, నభిమన్యు మంగళాకారు; ద్రుపదు
పట్టి ద్రౌపదియును నుపపాండవులను
నైదుగురిఁగనె శుభలక్షణాంచితులను. 142

భీష్మ గ్రీష్మాతపమ్మునఁ బెల్లుడుకుచు
పైచఁగా లేక శైత్యోపచారమందఁ
గదలి ఖాండవ వనిఁజేరి కలిపి మెలపి
మెలఁగ దొడఁగిరి కృష్ణార్జునులు ముదాన. 143

చిక్కి స్రుక్కుచునుంటి నజీర్తిచేత
ఖాండవమ్మును గాల్చినఁగాని మనను;
శత్రువైయుండె నింద్రుఁడు శరణమీయ
లెండు, రండని యగ్ని దేవుండు వేఁడె. 144

అతఁడిచ్చిన గాండీవ మందికొనుచు
నభయము నొసంగ నర్జునుం, డగ్ని చెలఁగి
చదలవంటఁగ భీకరజ్వాల లెగయఁ
గాల్పఁదొడఁగెను మఱి మఱిఁ గావనెల్ల. 145

అమరనాథుఁడు చూచి యన్యాయమణఁచి
యుంచి, యెటులైన ఘనిని దక్కించుకొనఁగ
భయద కృష్ణాంబుదమ్ములఁ బరవనిచ్చి
కుంభవర్షముఁ గురిపించెఁ గుపితుఁడగుచు. 146

పట్టి ధనువును శరపరంపరలఁ బైకి
విసరి యొక చిన్కు రాలని విధముగాగ
పందిరినివల్లెఁ గోలల, వాసవుండు
అవనికిని దిగి పోరఁగ, నర్జునుండు. 147

కావి, కృష్ణార్జునులముందు వాని బలము
పలుచనై పోయె దనపుత్రుఁ బ్రజ్ఞ కతఁడు
అలరి, యోటమినందియు నతని దరిసి
కౌగిటను జేర్చి దీవించి కదలిపోయె. 148

కాల్చి కపితీర కానను, గదుపులోని
మంట చల్లార నటనుండి మఱలిపోయె
నగ్నిదేవుఁడు తోడ్పడినట్టి యర్జు
నునకు కృష్ణునికిని మ్రొక్కి వినతుఁడగుచు. 149

సమాప్తము.

# సభాపర్వము

ఖాండవము నగ్నిదేవుఁడు గాల్చుచుండ,
దాఁగి యందున్న మయుఁడను దానవుండు
తప్పిచనఁగల్గె నర్జునుదయను కృష్ణుఁ
డద్భుతగిలియు నభయభాగ్యమ్మునంది. 1

ప్రాణదానము చేసినవాని మేలు
మఱవఁగా లేని మయుఁడు నమస్కరించి,
కడఁగి తాఁజేయు ప్రత్యుపకార కార్య
మున్నఁ గొనుమని వానికి విన్నవించె. 2

భావినూహించి ముమ్ముందె పనులఁ జక్క
పఱుపఁగల్గిన కృష్ణుఁడా తరుణమరపి,
చిత్ర మణిమయదీప్తులఁ జెలఁగునొక్క
సభను నిర్మించి యిచ్చినఁ జాలుననెను. 3

చిత్తమని చెప్పి, దానవశిల్పి, బిందు
సర సరస్సున దాఁచిన సకల రత్న
సంచయముఁగొని తీర్చెను సభను, శిల్ప
జీవసారమ్మునంతయుఁ జిదిమిపోసి. 4

నవ్యమై రమ్యమై యది దివ్యసభల
ప్రాభవమ్మును కడుఁ జుల్క పఱచి, సప్త
భువనముల నెందు నట్టిది పుట్టలేద
టంచు నందఱుఁ గొనియాడ నతిశయించె! 5

జలములున్నట్టి పట్టులు జలవిహీన
ములుగఁ, బల్లాలు మిట్టలై, మూసియున్న
ద్వారములు తీసియున్నట్లు, భ్రమలుగొలుపు
చుండె నాసభ చోద్యమై చూపరులకు. 6

అనుజులును దాను ధర్మజుఁ డందులోని
కరుగు శుభలగ్నమున, విప్రవరులు నృపులు
మునులు నరుదెంచి, సన్మానములను బొంది
మంగళాశీస్సులిడి చక్కమఱలినారు. 7

ధర్మజుని ధర్మసామ్రాజ్య భర్మదీప్తి
బహుముఖమ్ముల వెలిఁగె నా భవ్య నవ్య
దివ్య మణిమయ సభచేత, దిశలనంటి
ప్రాఁక నద్దాని యనుపమ రాగరుచులు. 8

నిండె సరసులు, ముక్కారుపండె, వృక్ష
వితతి ఫల పుష్ప పూర్ణమై వెలసె, పసులు
పాడిఁ బుష్కలముగ నిచ్చెఁ, బ్రజలు దనిపి
పరమ సంతోషవంతులై బ్రతికినారు. 9

అమరముని నారదుండట కరుగుదెంచి
పాటిలేదనఁ గొండాడి సభను, పాండ
వాగ్రజునిజూచి, రాజసూయమ్ము సలుపఁ
దగునటంచును బలికె సద్భావమొప్ప. 10

కులగురువు ధౌమ్యుఁడును ధర్మకోవిదులును
బంధుమిత్రులు ననుజులుఁ బ్రజలుఁ గలిపి
యతి వచించిన యాగమ్ము నాచరింప
మంచిదని ధర్మజునిఁ బ్రోత్సహించినారు. 11

శిష్టజన రక్షకుఁడు, దుష్ట శిక్షకుండు
విశ్వజన బాంధవుండు గోవిందుఁడట్టి
తఱిని బాఁగోగులను బాఁగ తఱచి చెప్ప
వలచి హితవాక్యముల నిట్లు పలుకఁదొడఁగె. 12

ధన్యుఁడవు ధర్మజా నీవు; ధర్మబద్ధు
లైన నరపతు లీ విశ్వమందు నరుదు;
రాజసూయమ్ము నీవంటి రాజులకును
సలుపఁదగినట్టి క్రతువు సంశయమువలదు. 13

జన్నమది నీదు ప్రజలకు సౌఖ్యమిచ్చు,
క్షామములురావు, కురియు వర్షమ్ము తఱిని,
పితరులకు నింద్రపథమిచ్చుఁ, గ్రతువులెన్ని
యైన దానికి సాటికాదంద్రు బుధులు. 14

తపసి పల్కిన పల్కులు తథ్యమయిన
దాని నిర్విఘ్నముగ పల్బఁదగును వైరు
లున్నఁ దెగటార్చి; ఖలుఁడొక్కఁడున్నవాఁడు
వాఁడు దుర్మార్గుఁ డరయ దుర్వారబలుఁడు. 15

చండకౌశికుఁడిచ్చిన సత్ఫలమును
దార లిర్వురికివి బృహద్రథుఁడు చెరిస
గమ్ము నిచ్చినఁ, దిని వారు గర్భమంది
ఖండకాయమ్ములను గనఁగల్గినారు. 16

జరయనెడు రాక్షసాంగన చక్కవాని
నతికియుంచినఁ బూర్ణకాయమ్ము నొడమి
ప్రాణములనంది పెరిగె నపార వీర్య
వంతు డొక్కఁడు నిర్జేయభయదమూర్తి. 17

రాజకులవైరి, భైరవ పూజకొఱకు
క్షత్రియులనెల్లఁ జెఱనిడి చంపుచుండు
వారమున కొక్కనిని, జంపవలనుకాదు
వాని శస్త్రాస్త్రముల నెట్టివానికైన. 18

కంసు నేఁ జంపినావను గారణమునఁ
బచ్చిపగఁ బెంచి, నన్నేచి భంగపఱచి
తఱిమెఁ బలుమార్లు; ద్వారకాపురినిఁజేరి
దాఁగితిని వాని ధాటికి నాఁగలేక. 19

వాని యావాసమౌ గిరివ్రజపురమ్ము
దుర్గమంబగు నిర్భేద్య దుర్గమగును;
బాపియయ్యును బ్రాహ్మణ భక్తుఁడగుట
వాఁడు, దానిని జొరగల్గువారు, వారె. 20

అవని సురులుగమారి భీమార్జునులును
నేను నేగిన, వంచించి వాని పొగర
డంచి చంపంగవచ్చునటంచుఁబల్కు
చుండఁ గృష్ణుఁడు, గనలి యుద్ధండుఁ డగుచు 21

గదను బైకెత్తె భీముఁడు; గార్ముకమును
బట్టెఁ బార్థుఁడు; క్షణములోఁపలనె వారు
బాఁపలై తీరి చని గిరివ్రజములోని
కరిగి నిజరూపముల బయల్పఱచినారు. 22

బొమలు ముడివడ, నిప్పులువుట్టఁ గనుల,
గాయమెల్లను గంపింపఁ గండరములు
గదల, వంచింపఁబడిన యా ఖలుఁడు గాలిఁ
పట్టి పైఁబడె, క్రోధ సంభరితుఁడగుచు. 23

మత్తగజములు మార్కొన్నమాడ్కి, మలలు
రెండు ఢీకొనినట్టు లఖండులగుచు
గ్రుద్ది, గ్రుద్దులుగొని, కూల్చి కూలి మల్ల
వరులు వారిర్వురును బోరి పొరలినారు. 24

దద్దరిల్లెను ధారుణి; బ్రద్దలయ్యె
దిక్తటమ్ములు, నీతి నతిక్రమించి
కడలి పొంగెను; విఱిగి పైఁబడెడునట్లు
చదలు గడగడలాడె నా సమయమందు. 25

పడలదాపోరు, సుంతయు బడలిపడల;
రంతుఁదేల్చరు, తగ్గరావంతకూడ;
పగలు రాతిరి వెన్నంటి పరుగుఁదీయు
బదియు నాలుగు దివములపాటు గడచె. 26

అసురుఁ డుస్సురుమనె; నది యదనటంచు
గడ్డిపోఁచను చీలిచి కన్నుగీటె
కంసవిధ్వంసి; వెంటనే గాలిపట్టి
చీల్చి పడవైచెఁ బగతు విచిత్రముగను. 27

చచ్చిపడ వేల నటు జరాసంధుఁడపుడు
బంధముక్తులయిన రాజవర్యులెల్ల
అంజలిఘటించి భీమ కృష్ణార్జునులకుఁ
దరలిపోయిరి, తమతమ తావులకును. 28

చిక్కుపడనట్టి రక్కసుఁజీల్చి మఱలి
వచ్చు భీముని, జయజయధ్వానములను
స్వాగతంబిడి యెదు రేగి పౌరులెల్ల
సత్కరించిరి తగురీతి స్వాంతమలర. 29

అడ్డుతొలఁగినదిఁకఁ బాండవాగ్రజుండు
నార్యులకుమ్రొక్కి భక్తితో యాగకార్య
మునకుఁ దలఁపడెఁ; దమ్ముల మూలకొకని
దిగ్విజయయాత్ర కనిపెను దీవనలిడి. 30

దిక్కునకు నొక్కరై వారు తేరులెక్కి
చనిరి చతురంగబలముతో, సకలరాజ
చంద్రులను గెల్చి మఱల విస్తారమైన
వస్తువాహననిచయ సంపదలతోడ. 31

సంతసించిన రాజులు సత్కరించి
పంప, మదమెత్తి పోరఁగవచ్చినట్టి
వారి లోఁగొని వెలఁగట్ట వలనుగాని
సంపదలవారు తెచ్చిరి సంతసమున. 32

యాగశాలయు, స్వాగతమందినట్టి
వారికెల్లను తగినట్టి వసతినివ్వఁ
గలుగు విడుదులు క్షణములోపలనె సిద్ధ
మయ్యె సహదేవుఁడాపని నందినదుప. 33

యాగవిధులకు వస్తువ్యయమ్ముసేయఁ
బూనె విదురుఁడు, దెచ్చిన కానుకలను
గొనఁగ దుర్యోధనుఁడు పూనుకొనెను, గృపుఁడు
అతిథిసత్కార కార్యమ్మునందు మునిఁగె. 34

యజ్ఞశుభలగ్న మరుదెంచె; యతులు బ్రాహ్మ
ణులును బంధువు లాప్తజనులును రాజ
రాజులును ధార్తరాష్ట్రులు బ్రఁజలు నచటఁ
జేరి యుచితాసనముల నాసీనులైరి. 35

పరమ నిష్ఠాగరిష్ఠుఁడై పరము నెంచి
దేవతలనెల్ల ధ్యానించి, ద్విజుల పాద
మంటి, భీష్మాది వృద్ధుల యనుమతిఁగొని,
వివిధ దేశాధినాథులు వినతులగుచు 36

మస్తకము పైని మకుటాల మహినివంచి
భక్తిఁ బ్రకటింప, మంగళ వాద్య ఘోష
ప్రబలఁ, బౌరుల జయజయధ్వానమెసఁగ
భేరిమ్రోయఁగఁ, జెలఁగఁ దూర్యారవాలు, 37

యజ్ఞకంకణమంది ధర్మాత్మజుండు
హోతధౌమ్యునితోఁగొని, హోమగుండ
మునకు ముందేగి యమరి యాసనమునందు
ముందుఃపనులను వేదోక్తముగ ముగించి, 38

యాగపూరుషు నర్చింప నర్హుఁడైన
వాని నియమించి తోడ్పడవలయునంచు
వేఁడ భీష్ముని, నతడును వితరణియయి
పలికె సూచించె యాదవాన్వయుని గృష్ణు. 39

వృద్ధభీష్ముని వాక్యము వేదవాక్య
మనఁగఁ దలఁదాల్చి, నందనందనుని, పాద
కమలముల మంచి పన్నీటఁగడిగి, యున్న
తాపనమ్మునఁ జక్కగా నమరఁజేసి, 40

గంధలేపన మొనరించి, కంఠమందుఁ
బూలదండనువైచి, తాంబూలమిచ్చి
వస్త్ర, ఫల పుష్పములతోడ, వందనమిడి
ధ్యానపరవశుఁడౌచు ధర్మాత్మజుండు 41

దనిపి పూజించె; విప్రసత్తములు బుధులు
బాగుబాగని తలలూఁచి ప్రస్తుతించి
చల్ల మంత్రాక్షతలను విస్తారకీర్తి
కాంతులెల్లెడఁ బర్వెదుఁగాతమంచు. 42

వాసుదేవునిచే ముక్తిఁ బడయువలయు
కర్మపండినచెవఁటి, యధర్మవర్తి,
చేదిపతి శిశుపాలుఁడు చిచ్చు లుమిసి
ప్రేలె నోటికివచ్చిన విధములెల్ల. 43

ధర్మజునివీట కలుగ దధర్మమంచు
ధారుణీశ్వరులంద అధ్వరముఁ జూచి
మఱల వచ్చిరి తమకున్న పిరులగొంచుఁ
గాన్కలుగ, రారు మానభంగమ్మునంద. 44

చాల పొరపడితివి, బుద్ధిచాలనట్టి
మూఢవృద్ధుని మాటల రూఢిపఱచి
ధర్మజా నేడు - నీ మహాధ్వరఫలమ్ము
పాపభూయిష్ఠమై పాడువడెను వినుము. 45

ఇందు ఘనులెందఱెందఱో వందనీయు
లెందుఁ జూచిన నందుండ, మందమతిని
పందనొక్కనిఁ బశువుల మందమేపు
వానిఁ బూజింపవలయు దౌర్భాగ్యమేమి. 46

వెన్నముద్దల వంచించి తిన్న దొంగ,
యబల నొకదానిఁగూల్చిన యులఘుబలుఁడు,
గొల్లపిల్లలతోఁ బూలవిల్లుకాని
కదనరంగాన పోరాడు ఘనుఁడితండు, 47

తపసియూ కాఁడు, విప్రసత్తముఁడు కాఁడు,
కాఁడు వృద్ధుఁడు, గురుఁడును కాఁడు, కాఁడు
ప్రాజ్ఞుఁడును, మేటి ధారుణీశ్వరుఁడు కాఁడు
వీఁడు కడవారిలో కడవాఁడు సూడ, 48

వంచు హద్దులుమీఱి దూషించువాని
మాఱుతప్పులు మన్నించి, శౌరి చేతి
చక్రమునుద్రిప్పి విడిచి మస్తకముఁద్రుంచె
రాజమండలమెల్ల నౌరా! యనంగ. 49

పాపి శిశుపాలుఁడటు కూలిపడిన, శేష
యజ్ఞకార్యమ్ము నిర్విఘ్నమౌచు ముగియ,
నతిథి సత్కారములనంది యరిగినారు
వారు వీరును వచ్చినవారు మఱలి. 50

శకుని మామయ్యతో మయసభను జూడ
నాసఁజేసిన దుర్యోధనాదులంతఁ
జుట్టి చూచుచు, దాని లోగుట్టుఁ గనక
భ్రమలలోఁ జిక్కి పలుమార్లు భంగపడిరి. 51

తదువ గుడ్డలు గోతులఁ బడుచుఁ, దలలు
దలుపులకు మోది, ముందేగ వలనుపడక
తారులాడుచునున్నట్టి వారినిగని
ఫక్కుమని నవ్వెఁ, బాండవ పట్టమహిషి. 52

ఆమె నవ్విన నవ్వులో నంకుశములు
వాడమి యెడలెల్ల తూట్లుగాఁ బొడిచినట్లు
పొక్కి దుర్యోధనుఁడు హస్తిపురమునకును
దలను బైకెత్తనేరక తరలిపోయె. 53

అబల యొక్కతె తన్నటు లవమతింపఁ
గలిగెనేయను కలఁతలు గలయఁబర్వి
కలఁచుచుండగ వాతఁడు గనులుమూయ
కుండఁ జింతించుచుండె వేతొందువిడిచి. 54

యజ్ఞవైభవమును; బాండవాగ్రజుపయి
ప్రజల భక్తియుఁ, దమ్ముల ప్రక్కబలము,
వాసుదేవుని మిత్రభావమును చాల
దిగులు పుట్టింప నిట్లు చింతించె వాఁడు. 55

వగచి సాధించునదిలేదు; వసుధలోన
బ్రతుకనేలేను పాండవపంచకమ్ము
బ్రతికియున్నంతవఱకు, నా పరువుదొరలి
పలుచఁబడిపోకతప్పదు వారిముందు. 56

ధర్మజునిఁబోలు గుణిలేఁడు ధరణిలోన,
నర్జునునిమించు ధన్విలేఁ డవనిపైన,
భీమునకు సాటియెవ్వఁ డీ విశ్వమందు
లేఁడు, నేనును నావార లేఁడ యింక! 57

ఎట్టిదారాజసూయ! మదెట్టిఘనత!
ఎంతటెంతటి సిరులు! బెంపెంత! యెంద
ఱెన్నివిధములఁ గ్రతువుల నెన్నియేని
జేయఁజూచితిఁగాని పైచేయిఁగొనవు. 58

సార్వభౌములు తలవంచి శక్తిలేక
సాటిభూపాలు చేదిరాజన్యు శిరము
జక్రి చక్రానఁ దెగిపడఁ జలన ముడిఁగి
కనిరి నిర్వీర్యులై చేతఁగాని పగిది. 59

అసురపతియౌ జరాసంధు నట్టిఘనుఁడ
జేయుఁడయ్యును గూలెను వాయుసూను
ముష్టిఘాతమ్ములకు మూల్గి, మూర్తిఁగొన్న
క్షాత్రవులఁ బాండవుల గెల్వఁగా దరంబె. 60

శకునిమామయ్య యెత్తులు సాగలేదు;
కర్ణుఁడున్నాఁడు ఫలమేమి ? కయ్యమందు
నర్జునునిముందు నిల్చునా ? యది పొసఁగదు,
మత్స్యయంత్రమ్ము నేసిన మాన్యుఁడతఁడు. 61

మేటివిలుకాఁడు భీష్ముఁడు, సాటిలేని
ధన్వి ద్రోణుఁడు మాయింటఁ దనువులుంచు
వారలేకాని, పాండవపక్షపాతు
లనుట విదితము, స్వాధీనులగుదు రేమి ? 62

యనుచు నీర్ష్యాంధకారమ్ము నందు మఱఁగి
ప్రభలు పొలినతెల్వి దీపమ్ము వాని
మతిని దిద్దుచునుండ, దుర్మార్గులతని
దండమూఁగిరి దుష్టపథాలకీడ్వ. 63

భయము నీ కేమి, నేను నీ ప్రక్కనుండ
మాయజూదాన వారిని మాపగలను
క్షణములో, కారణంబొండు గలుగఁజేసి
పల్లెతోఁ బాండవులఁ బిల్వఁ బంపుచాలు 64

నంచుఁ బురికొల్ప శకునిమామయ్య, కర్ణుఁ
డర్జునుని జంపుపని నాదటంచుఁ బలికె;
ధైర్యమును వీడవద్దని తమ్ములనిరి;
సన్నగిల్లిన శక్తుల సానఁబెట్టి. 65

నిండుసభఁగూర్చి దుర్యోధనుండు జనకు
మనసు నొప్పించి యొప్పించి, మామ చెప్పి
నట్లు పాండుతనూజుల నటకు ద్రుపద
తనయతోఁ బిల్వఁబంపి జూదాన దింప. 66

శకునిమామయు, కర్ణ దుశ్శాసనులును,
భీష్మ విదురాది వృద్ధులు, విప్రులుఁ బుర
జనులు గూడిన సభలోన సాహసించి
ఖలుఁడు దుర్యోధనుఁడు లేచి పలికెనిట్లు. 67

దేవతలు, మౌనివర్యులు ద్విజులు, నృపులు
దేవకీనందనుఁడు నుండ, దేవసములు
బాండవులు పెంపుఁగనుచున్న పగిది మనకు
శ్రేయమిడఁబోదు తప్పక చేటుఁదెచ్చు. 68

నేడు కాకున్న రేపైన నిశ్చయముగ
నెత్తివత్తురు మనపైకి, హెచ్చరికను
గొంచు విషబీజమును నంకురించుముందె
నలిపివేయుట యుక్తమౌ న్యాయమగును. 69

యజ్ఞమునుజూడ నాఁడు నే నచటికేగి
మయుఁడు నిర్మించి యిచ్చిన మండపమున
నంత తడఁబడి నడువఁగాఁ జూచి భీము
పంచ నిలుచుండి పాంచాలి బరిహసించె. 70

ఘనుల నెందఱినో కడగాలరాచి
పనికిరానట్టి గొల్లని పాదములను
బట్టి పూజించె, ధర్మజు భావమేమొ
తెలియఁగారాదు, గుట్టు గుర్తింపలేము. 71

తడయనేరాదు వారి పెత్తనమడంచి
పట్టుతో నెట్టులైనఁ జేఁబట్టవలయు
నంచు విశ్వమ్ము నెల్ల శంకించియతఁడు
పలుకుచుండఁగఁ, గర్ణుఁడు ప్రక్కనుండి 72

వహ్నికిని వాయువనొప్పి పాండవులను
బట్టి, సంగ్రామరంగానఁ బ్రాణమూడ్చ
వలె నటంచును బ్రోత్సాహపఱచె, బార్థు
పైనఁ దనకున్న కసిని దీర్చంగఁదలఁచి. 73

సావధానమ్ముగా విన్న శకుని యంతఁ
దిన్నగా నవ్వి, యనుభవ మున్నవార
లాడు పల్కులుకావు మీవనుచుఁ దనదు
హృదయభావమ్ముఁ దెల్పె నెమ్మదిగ నిట్లు. 74

వినుము రాధేయ! నీవంటి వీరులొక్క
కోటికినిమించు వారలుగూడి పట్టు
తోడ పోరాడినా, వెనుకాడఁబోరు
పాండుసూనులు గర్వించి పలుకఁబోకు. 75

వారి వంచించియే గెల్వవలెను, వేఱు
మార్గమేలేదు---కాన నా మాటలు విని
మయునిసభ కీడుగా నొక్క మందిరమును
వడిగ నిర్మించి, వారిని వచ్చిచూడ 76

వార్తఁబంపుఁడు, జూదరి పాండవాగ్ర
జుండు గావున వలదు వేఱొండు బలము
వాని లోఁగొనఁ, జేనున్న పాచికలివి
చాలు, నంతయు నిముసానఁ జక్కఁబడును. 77

శకుని యటులాడుచుండ నుత్సాహియగుచు,
సంకటంపడి విదురుఁడు సజ్జనులగు
పాండుపుత్రులఁ జెడక కాపాడఁదలఁచి,
వలదు జూదమ్ము వలదు, భూపాలురకును 78

దగని పనియది, వారు మీపగతులైన
జనకునకుఁజెప్పి వనికిఁ బొమ్మనుఁడు మాఱు
వల్కనే పోరు పోదురు, చుల్కఁజేయ
లేరు ధృతరాష్ట్ర నాజ్ఞను వారు గుణుల 79

టంచు వారించెఁ, గాని యీర్ష్యాళువయిన
దుష్ట దుర్యోధనుఁడు దాని కిష్టపడక
కుడుచుచున్నట్టి కొంపనే కూల్పనెంచు
గుణము నీదని విదురునిఁ గుంటుపఱచి 80

పలికిఁ, మామయ్య చెప్పినభంగి నొక్క
భవనమునుఁ జక్క గట్టించి, పాండవులను
బిలువఁబంపెను విదురునే; పెద్దతండ్రి
వార్త మన్నించి వచ్చిరి, వారు నంత. 81

వచ్చి తండ్రికిఁ దల్లికి వందనమిడి,
ధార్తరాష్ట్రులఁ జనవుతో దండఁజేర్చి
మంచిచెడుఁగులఁ దెలియ భాషించి, విందుఁ
గుడిచి, క్రొత్తగ నటఁ గట్టఁబడినయట్టి 82

మండపముఁజొచ్చి, దుర్యోధనుండు చెంత
నుండి చూపఁగఁ జూచి, కూర్చుండఁదగిన
వసతి కల్పింపఁబడియున్న పట్టులోన
నలఁతవాయంగ నాసీనులైరి వారు. 83

పాచికల నీవు చేఁబట్టి పాఱవిడిచి
యాడఁ గనుఁగొని బహుకాలమయ్యె, శకుని
తోడ నాడఁగ వేడ్కయ్యె నేడు చూడ
నాసగొంటిని మనసిచ్చి యాడుమన్న. 84

పందెములకగు సిరులను బ్రక్కనుండి
మామకై యొడ్డెదను నేను, మాఱుపలుక
రాదు తలఁపడుమంచు ధర్మజునివేడె
విషము నూరుచు గాంధారి పెద్దకొడుకు. 85

పిలువఁబోయిన విదురుఁడు ఖలుల దుష్ట
చింతనమ్ముల వివరించి చెప్పియుంటఁ,
దనకుఁ బ్రియమయ్యు జూదమ్ము ధర్మనంద
నుండు వెనుకాడె భీమసేనుండు నలిగె. 86

ధరణిపతి పాటి నృపుని జూదమ్మునాడ
రమ్మటంచును బిలువ ధర్మమ్ముకాదు
కాదనఁగ నన్న యొక్క వాక్యమ్మువుట్టె
నంతలోననె; పని చెడునంచు శకుని, 87

శ్రమలకోర్చి యర్ధరాజ్యమ్ము నెట్లొ
పడసి సుఖియించుచుండె పాపమ్మితండు;
రానురాననఁ బలుమార్లు రమ్మురమ్మ
టంచు బలవంతపెట్టి బాధించనేల? 88

ఆడి యోడిన నేమగునన్న పెనుభ
యమ్ము పెప్పకయే మోమునందు నద్ద
మందుఁ గన్పడునట్టుల నచ్చముగను
గానఁబడుచుండె పోనిండు, వానినంచు 89

నెత్తిపొడిచెను, కడు వాఁడి కత్తిఁదీసి
కుత్తుకను గోసినటు; లూరకున్న నింక
పరువు చేటగునని చేతఁబట్టి పాచి
కలను దొర్లించె పాండవాగ్రజుఁడు తెగిఁచి. 90

భీష్ముఁడును, ద్రోణకృపులును, విదురుఁడును, కు
మారశేఖరు కాదన నేరనట్టి
ఱేఁడు ధృతరాష్ట్రుఁడును, విని చూడవచ్చి
నట్టి పురజనులును, సూడ నాడఁదొడఁగె 91

నతఁడు మాయావి శకునితోఁ; నభము శుభము
నరయఁగాలేని కదు నిర్మలాత్ముఁడగుట
వస్తువాహనములనొడ్డి, వరుసనొక్క
దాని వెనువెంట మరియొకదాని నోడె. 92

వశ్యమై వంచకునిచేతి పాచికలవి
వలచినట్టుల దొరలుచు వసుధపైన,
ధర్మజుని సర్వసంపదల్ తలఁగ దోఁచి
దుఃఖమున ముంచె లోలోన దుష్టులలర. 93

పందెమిడి యాడ మిగిలిన వస్తువొకటి
చేత లేకుండ పోయినఁ జెంతనున్న
తమ్ములను నల్గురినికూడ ధారపోసి
తన్ను నోడెను ధర్మనందనుఁడు గడకు. 94

సానుభూతియె లేని కసాయి శకుని
చల్లగాఁబల్కి, నీవు విచారపడకు,
పత్ని ద్రౌపదినిడి యాడి పడయవచ్చు
మరల కోల్పోయినట్టి సంపదలనెల్ల 95

నంచుఁబురిఁగొల్ప, బుద్ధి నశించినట్టి
వాఁడు భ్రమలోనఁజిక్కి యబ్బంగి నాలి
నాటవస్తువుగా నాడి యోటువడియె
పాడువిధి చేతఁబడిన దౌర్భాగ్యుఁడనఁగ. 96

తన్ను మయసభలో నాఁడు చిన్నపుచ్చి
పరిహసించిన పాంచాలి పతులతోడ
పట్టువడిపోవఁ గలలెల్లఁ బండినట్లు
భ్రమపి కనుఁగప్ప విజయగర్వమ్ము తోడ 97

శకుని నొకమారు కౌగిటఁ జక్కనదిమి
పట్టి తెగనూఁచి విడిచి, విశ్వమ్మె తనకుఁ
వశ్యమైనట్టు తలఁచి, చప్పట్లు చఱచి,
మదము తలకెక్కుచుండ నున్మాదియగుచు 98

ఫక్కుమని నవ్వి, పటపటఁ బండ్లుగొఱికి,
కపిని నుమియుచుఁ గన్నులఁగనలిమండు,
కాలకూటాగ్ని కంఠభాగమునఁ బుట్టి
వదన గహ్వరమునుజొచ్చి బయటఁబడిన 99

పగిదిఁ బరుషోక్తులనుగ్రక్కి, పాండుపత్నిఁ
బట్టి తెమ్మిప్డు నీకేల భయము వలద
టంచుఁ బంపెను, పాపపుణ్యముల నింత
కనక దుర్యోధనుఁడు బ్రాతికామి యన్న 100

వాని విదురుఁడు కాదన: వాఁడు నేగి
తన్ను మున్నోడి యోడెనా నన్ను, నన్ను
నోడి తా నోడెనా పతి, యాడుమన్న
యామె పల్కులఁ గొనివచ్చె నటకుఁ దిరిగి. 101

నాతిఁ దాకంగ వెఱచి యాప్రాతికామి
నీతులను మోపికొనివచ్చెఁ, జేతకాని
వాఁడు-దుశ్శాసనా! దానిఁబట్టి తెమ్మ
టన్న నాతఁడు నరిగె నన్నయ్య పంప. 102

అయ్యొ, కుయ్యో యటంచు నన్యాయమంచు
అంటఁగూడదు నన్నంచు, నబల యేడ్చు
చుండియును గుండె కరుగని బండయతఁడు
పరుల పెండ్లామటన్న భావమ్ముఁ దుడిచి 103

పట్టువిడకుండ ముట్టి, నిర్బంధపెట్టి,
బాహువులఁజాచి, సిగ నందిపట్టి యీడ్చి
తెచ్చి, పదుగురిముంగల దిక్కులేని
దాసియున నిల్పె, వృద్ధుల తలలు ద్రుళ్ళ. 104

ప్రళయ భైరవమూర్తులు వదన రంగ
మధ్యమునఁ దాండవంబాడ, మందుచున్న
రెండుకన్నులు చిచ్చుల చెండులనఁగ
మండ, విలువెల్లఁ జెమటలు నిండఁగ్రమ్మ, 105

విడిగి పాయలుగా వ్రేలు వేణి నల్ల
త్రాఁచులన నూగ నిటునటు, రౌద్రయగుచు
నురము నుబ్బించి పడలించి యూర్పులోని
కరిగి వెలిఁబారుచుండ, సత్యాగ్రహమ్ము 106

బయలుపడునట్లు నిజనాథ పంచకమును
బాగపరికించి, ప్రాజ్ఞులవంకఁ జూపుఁ
ద్రిప్పి తిలకించి, చాల క్రోధించి, చండ
శక్తియై తీరి ద్రౌపదిసాధ్వసమున 107

విజ్ఞులును, ధర్మమూర్తులు, వృద్ధులున్న
నిండు సభలోన నొక్కఁడు నీతిచెప్ప
వాఁడె లేకుంట కదువింత! పరమసాధ్వి
మానభంగమ్ము నోర్తురా మాన్యులైన? 108

వంచకులగుంపు సద్ధర్మవర్తి నొకనిఁ
దగదు వలదన్న మాయజూఁదమున కీడ్చి,
యన్నిటిని దోచుచుండ నన్యాయమంచు
నడ్డుపడఁబోకఁ జూచెదరయ్య మీరు. 109

వస్తువాహనములను సంపదలనొడ్డి
యాడఁజూచితి మిందును నందు, నొకని
నొకఁడు పందెమ్మునిడుచుఁ బాచికలనాడఁ
జూచియెఱుఁగము చోద్యానఁ జోద్యమిద్ది. 110

తన్నుతానాడి యోడిన ధర్మజునికిఁ
దనది యన్నదియేలేదు; దానికతన
ధర్మమొప్పదు నన్నోడఁ! దలలు కలిపి
తలఁచి చూడుఁడు - నే వీరిదానఁగాను. 111

ఇంటికిని దూరమని యంటి, నంటరాద
టంచు నంటిని, దయఁజూడుమన్న యంటి
గంటఁదడిపెట్టి; వినక దుష్కార్యమునకుఁ
బాలుపడి వీఁడు నన్నిట్లు పట్టితెచ్చె! 112

పాండుపత్నిని నసుఁ బతివ్రతను బరిభ
వించి, చావక యితఁడు సుఖించబోదు
సత్యమిదియంచు దూఱి, దుశ్శాసనుగని
బాధపడకుండ దుష్ట దుర్యోధనుండు, 113

పడవు తెగి యుట్లు పిల్లిశాపమ్ములకును,
నొక్కరా యిద్దరా! నాల్గునొక్క పతుల
పత్ని యీ సతి, బహు పతివ్రత యటన్నఁ
బలుకులకునేమి? వేలకుఁ బలుకవచ్చు- 114

కొప్పఁగొని దీని సభకీడ్చి క్రుంగఁదీయఁ,
గోరితిమికాని చాలదాకుంటుపాటు;
కొంగుఁ గొనఁబట్టి సుంత సంకోచపడక
కోఁకనూడ్చుము, చప్పనఁ గ్రొవ్వడంగు 115

నంచు నిరసించి, దూషించి, యాగ్రహించి
పెంచి శాసించె- దిశలు గంపింపఁ, బ్రజలు
గర్ణములుమోపి కరములఁ గనుఁలుమూసి
హరి హరీ! యన గుండియ లదురఁ జెదరి. 116

అన్న కనుసన్నలంది వాతాత్మజుఁడు మ
హోగ్రహోగ్నిని దిగమ్రింగె; నర్జునుండు
వేదనలవేఁగి లోఁలోన విధిని దూఱి
వేడినిట్టూర్పు గాడ్పుల వెడలఁగ్రక్కె. 117

వంశనాశనమేయగు వలదు, సతిని
బరిభవింపఁగ వలదని దురిత మాపఁ
దలఁచి పలికెను భీష్ముఁడు; కలఁగి యలిగి,
కనులు కనలేవు; యిటు నీదు కర్ణములును 118

గాలి వినలేకపోయిన కారణమ్మ
దేమి, ధృతరాష్ట్ర! నీ పట్టి యెట్టిపనికిఁ
బూనుకొనుచుండెనో విని, మానుమంచుఁ
జెప్పనేరవుగా యని చెవులుసీలఁ 119

జెప్పె విదురుఁడు, వినియును జెవిటివాని
పగిది నాతండు మౌనియై పలుకకుండె
దనయుపైనున్న వ్యామోహమును ద్యజించి
న్యాయమును బల్కఁగలుగు ధైర్యమ్ములేక. 120

అంధభూపాలు స్వర్ణసింహాసనమ్ము
తోడ సభయెల్ల గడగడలాడ, ద్రుపద
తనయ మెయిచీర నూడ్చునధర్మమునకు
సాహసించెను ఖలుఁడు దుశ్శాసనుండు. 121

ఒక్కచీరను నూడ్వ మఱొక్కచీర
చక్కఁగాఁ గప్పుచుండ నా సాధ్వి మెయిని
వెక్కిరించుచు వానిని, వేలకు నవి
కుప్పకూలినయవి పెను గొండపగిది. 122

ఈడ్చి యీడిచి, చెమటల నూడ్చి యూడ్చి
పోసి, నిట్టూర్చి, బడలికపుట్టి చేఁతి
పట్టుసడలిన వడవడ వడఁకి వాఁడు
పండఁబాపమ్ము మూర్ఛిల్లి పడెను గడకు. 123

శకుని మ్రుక్కున వ్రేలిడె; సంతసించి
నారు పెద్దలు; కర్ణుఁడు నోరుతెఱచె!
పాలుపోవక యొక శిలాప్రతిమ యట్లు
భ్రమసి దుర్యోధనుఁడు నిల్చెఁ, బ్రజలముందు. 124

అబల ద్రౌపది వస్త్రాపహరణ ఘోర
కార్యభంగము కలిగిన కరణి చెవులఁ
బడినఁ గన్నులు దెఱచినపగిదిఁ గౌర
వాధిపతి మేలుకొనెను భయమ్ముపుట్టి. 125

కోపపడకమ్మ కోడలా! కుమతులఁగని
గోడుపడుచుంటి నిట్టుల-గ్రుడ్డిజేని
గుణము గొప్పది కాదనుకొనకు, విధి వి
ధాన మట్లుండె, దాఁట నా తరముకాదు. 126

వినఁడు నేనెంత చెప్పిన, వీఁడు పెద్ద
కొడుకు మూర్ఖుఁడు, దుష్టులఁగూడి చెడుఁగు
పనులనే చేయుచుండు నీ ప్రతిభ నరయు
లేఁడు, గాకున్న నిన్నేల భంగపఱచు. 127

అల్లులను నల్లుఁడునుగూడ నాచరింప
నట్టి దుష్కార్యమొనరించె, నయ్యు నొక్క
పాశ మీడ్చెడు నను బుత్రపాశమద్ది
యతిబలీయము, బాగోఁగు లరయఁబోదు. 128

నిర్మలాత్మవు, నిరుపమ నియమబద్ధ
వర్తినివి, గుణమణీ, పతివ్రతవు నీవు
అలిఁగి యణఁగారకున్న నేమౌనా ! పెద్ద
మనసుఁ జేయుము గతమెల్ల మఱచిపొమ్ము. 129

ఆత్మనాథులతో, జూదమందునోడి
నట్టివానిని మరలఁ జేఁబట్టి మఱలి
సౌఖ్యమున నుండుమని, యుపశాంతి యొసఁగఁ
బల్కెఁ బాంచాలితోఁ గురువల్లభుండు. 130

మామకును మ్రొక్కి, విదురు నమస్కరించి,
హస్తములమోడ్చి భీష్మున కంజలించి,
యత్త గాంధారికినిజెప్పి, హస్తిపురము
వదలి భర్తలతోడ ద్రౌపదియువేగె. 131

భాగ్యములతోడఁ బత్నితోఁ బాండవులను
వశ్యమొనరించుకొనియు నబ్బంగి విడిచి
పుచ్చినాఁడని జనకుని పొంతకరిగి
బాధతోపంగ వగచె దుర్యోధనుండు. 132

కడఁగి చతురంగబలముతోఁ గదనరంగ
మందుఁ బోరాడినా గెల్వ నలవికాని
ప్రబలులను బాచికలతోడఁ బట్టి కాళ్ళు
కడను బడవెచె శకుని నా కలఁత మాప. 133

చేఁతికందిన ఫలమును జెదరఁగొట్టి
చిచ్చు ముట్టించితివి నాదు చిత్తమందు
చిత్తగించిన నేనిదే సిద్ధపడెదఁ
గుత్తుకనుగోసి చంప నాయత్తపడుము. 134

శత్రువుల చేతఁబడి చచ్చు చావుకన్న
జనకుచేఁబడి చచ్చెడు చావు మేలు
చాల, వాయుతనూజుఁడు చలమువట్టి
యుండ, నుందును నే చావకుండనెట్లు? 135

కాన నాపనిఁ జేయుము; కాదటన్న
వారి నుపజాదమునకు రాఁగోరి వార్తఁ
బంపుమిప్పుడె, యని బలవంతపఱచి
వాఁడు లోఁగొనెఁ దండ్రిని వంచి, వంచి. 136

ఆడి యోడిన నీసారి, యడవులందుఁ
గడపి రెండును బదియేండ్లు, గంటఁబడక
వత్సరంబుండి రావలె! పాదుజూద
మద్ది మొదలిడె మరల నన్యాయముగను- 137

విధి విధించిన విధమేమొ విజయలక్ష్మి
వియ్యమునునంది శకునితో, విముఖయౌచు
ధర్మజుని నొల్లకుండె నీతడవకూడ
వంచకుల పాలిదే విశ్వమంచుఁ దెల్పి. 138

వంతలోఁబడి వీడ్కోలు కుంతిని విడి
విదురునింటను, దీవించి భీష్ముఁడంప,
వదనమును వస్త్రమునఁగప్పి పయనమయ్యె
ధర్మజుఁడు ధర్మబద్ధుఁడై; దారిఁబట్టి 139

బాహువులుసాఁచి భీముఁడు; పార్థుఁడరిగె
యిసుము వెదఁజల్లుచును; దుమ్ము లెగసి మేనఁ
గ్రమ్మ నకులుఁడు నరిగె, శిరమ్ము వంచి
చనెను సహదేవుఁ; డంతఁబాంచాలి విరియ 140

బోసికొని వెంద్రుకల వెంటఁబోయె; సామ
మాలపించుచు ధౌమ్యుఁడననుగమించె
వారితోనేగ వనులకుఁ; బ్రజలు గంటఁ
దడిని బెట్టుచుఁ గన పరితాపపడుచు. 141

పట్టపగలున నఱచుచుఁ బఱచెఁ బురముఁ
జొచ్చి నక్కలు; పడెఁ దోఁకచుక్క; లంబు
దమ్ము లేలేని గగనతలమ్మునందు
మెఱసె మెఱుపులు; పట్టెను పర్వదినము 142

రాకయుండియు సూర్యుని రాహుముఖము;
వసుధ కంపించె నూరక; పాండుపుత్ర
పంచకంబటు పత్నితో వనినిజేర
నరుగుచుండగ, జూదమ్మునందు నోడి. 143

సమాప్తము.

చేసినదిచేసి, యేల చేసితినటంచు
సిగ్గులేకుండఁ జింతించు చీఁకు జేని
చిత్తమల్లాడెఁ బుత్రు శిక్షించి బుద్ధి
చెప్పి దిద్దంగ లేనట్టి చెడుగువలన. 1

పాపమెఱుఁగని సద్ధర్మవర్తనులను
బాండుసుతులను గానకుఁ బంపితినని
వగచె లోఁలోన; మగువ ద్రౌపది పరాభ
వమును దలపోసె నొడలు గంపమ్మునొంద. 2

మంచిఁ జెప్పిన విదురుని మందలించి
పంచి పనులకు, మరలఁ బిల్పించి పలికె;
ధర్మచింతన యొకవంక, తనయుమీఁది
పాశమొకవంక వానిని బట్టి యీడ్చె. 3

పాండవులమీఁది శత్రుభావమును వదలి
బాగుపడుమంచు వ్యాసుఁడే వచ్చి తెలుపఁ,
దలను బంకించియును వాఁడు ధర్మమార్గ
మందుఁ బడలేని మందుఁడై కుందుచుండె. 4

వలదు మమ్మిటు దుష్టులపాల వదల
వలదు; మేమును మీతోడ వత్తుమంచు
వేఁడి వెన్నాడు ప్రజల నిర్వేదముడుఁగఁ
బలికి వారించి; పట్టును వదలకున్న 5

బ్రాహ్మణుల వెంటఁగొని లోకబాంధవుఁడగు
భానుమూర్తిని దలఁచి తపమ్మునంది
పడసి యక్షయపాత్రను వారి పోష
ణకును; జీనాంశుకమ్ముల నగల విడిచి 6

వల్కలమ్ముల ధరియించి; పదము గంద
కఠిన పాషాణపథములఁ గాలుమోపి
పయనమైచని, కామ్యకవనమునందు
వాసమునునంది మనుచున్న పాండవులను 7

గాంచి కుశలమ్మునడిగి దీవించి మౌని
వరుఁడు మైత్రేయుఁడనువాఁడు, కురుకులాధి
పతిని దర్శించి ధర్మతత్త్వమును దెలిపి
మఱల నేతెంచె హస్తినాపురమునకును. 8

వ్యాసమౌనీంద్రుఁ గృపను సద్వంశమందుఁ
బ్రభవమందినవాఁడవు; ప్రజలనేలు
పాలకుఁడవీవు, ధృతరాష్ట్ర! పామరువలె
ధర్మమునుఁదప్పి వర్తింపఁదగునె చెపుమ!

ప్రాణసముఁడని నిన్ను సద్భక్తితోడ
ప్రాణమున్నంతదనుకను బాండురాజు
పట్టుతోఁగొల్చె; నయ్యును వాని సుతులఁ
గాన కంపించితివి సుంత కరుణలేక. 10

ఏడులోకాల నొక్కటు నేలఁజాలు
నేర్పరులు పాండుసూనులు నేఁడు వనుల
నిండుపేర్మిని దిగ్రమింగి నీకునయ్యొ
బాధపడుచుండ నేఁజూచివచ్చినాను. 11

పరిభవమ్మును బాండవ పట్టమహిషి
మఱచిపోలేదు; భీముని మానసమున
మంట మండుచునేయుండె; వింటినెక్కు
పెట్టియుంచెను విజయుఁడు, విడువలేదు. 12

పరుగుఁదీయుఁగ బదుమూఁడు వత్సరములు
వారు పైఁబడి, నిన్ను నీవారితోడఁ
బట్టి వధియించి, విజయమ్ముఁబడసి రాజ్య
రమును జేఁబట్టుదురు ప్రజారంజకముగ. 13

బవర మొనగాడునని తొలిబలిని గొన్న
కరణిఁ గాననుజొచ్చియుఁ జొఱకమున్నె
ఘనుని గిమ్మీరదైత్యుని గాలిపట్టి
పటి మరించెననివింటి వారు చెప్ప! 14

చేటుదప్పదు కార్యము పెడకమున్నె
చెలిమిఁ గోరుము వారిని జేరఁదీసి,
యనుచు హితమునుగఱపు నాతనిని బరిహ
సించె దుర్యోధనుఁడు సాహసించి, తొడలు 15

చఱచి నవ్వుచు; మౌనియు శాంతిఁదప్పి,
నవ్వి చఱచిన తొడలను నలుగఁగొట్టి
చంపు నిను భీమసేనుఁడు సమరమందు
నంచు క్రోధించి మించి శపించిపోయె. 16

సహనమే తోడునీడగా శ్రమలకోర్చి,
కందమూలమ్ములను దిని కామ్యక వన
మందు ద్రౌపదియును బాండునందనులును
గుందుచుండఁగ డెందమ్ముగ్రుంగ, వారి 17

దుష్ట దుర్యోధనాదులు ద్యూతమందు
వంచితులఁజేసి, వనుల కంపించిరంచు
విన్న యాదవ పాంచాల వృష్ణి భోజ
వీరు లరుదెంచిరటకుఁ గెంపూరఁ గనుల. 18

కారణములేక యటుల నిష్కల్మషులగు
క్షాత్రతేజులు గానలోఁ గష్టపడుచు
నుండఁ గని యోర్వఁజాలక మండిపడుచు
క్రోధమును గ్రుమ్మరించిరి గుణముఁదప్పి. 19

ధూర్తు దుర్యోధనుని జంపి, దుస్ససేను
గరములను గాల్చి, కర్ణుని శిరము నఱికి,
చిత్రవధచేసి శకునిని జీల్చివత్తు,
నంచు ద్రుపదునిపట్టి గర్జించి పలికె. 20

కొండయంతటి గోడును గుక్షిలోన
గుప్తగతి దాఁచియుంచిన కోమలాంగి
ద్రౌపదీదేవి నందనందనుని గృష్ణు
గాంచినంతన గుండియకరుఁగ నేడ్చె. 21

ఏమి చెప్పదు! గొంతుకయెండి పలుకు
పెగులకున్నది - విశ్వమ్ము వినని కనని
విధము నన్నేఁచినది; వినవలతువేని
వినుము విన్వింతు, మాధవా! వీనులిచ్చి. 22

మామ కడనుండె; భీష్మాది మాన్యులెల్ల
నూరకుండిరి; ననుగొన్న వీరవరులు
వంచియుంచిరి శిరముల; పాపియొకఁడు
పూని సిగఁబట్టి నలుగురిలోన సభకు 23

నీడ్చి చీరలనూడ్చె; నీ యిలను నింకఁ
జచ్చియును జావకున్నాను సాధ్వి మాన
భంగకారకుఁ జంపించి పగను దీర్చు
కొనెదు పేరాసతో నిటు వనులఁజేరి. 24

గదయు గాండీవమును నిటఁ గనులుమూసి
కలలు గాంచుచునున్నవి కానలోనఁ
జెట్టునీడల శయనించి, చిత్తమిచ్చి
ధర్మజుఁడు దట్టి జోకొట్ట దండనుండి. 25

దిక్కులేనట్టిదానను, దీన, మాన
దాన మొసఁగుము నందనందనయటంచుఁ
గాళ్ళఁబడి, వేడికన్నీళ్ల కాల్వకట్ట
వేఁడె నాసాధ్వి నీరుగా విపినమెల్ల. 26

పాపఫలములు నిండారఁ బండకుండఁ
బట్టుపెడి నేలపై రాలిపడవు, కానఁ,
బక్వమగుదాఁకఁ గాలముఁ, బట్టియుంచ
వలయు నీ మానసమ్మును బలుకు వినుము. 27

చండమార్తండ తేజులఁ బాండవులను
మాటుపఱచిన యీ నల్లమబ్బులివ్లె
మాయకుండవు తొలఁగు, దుర్మార్గులెల్ల
మండి సమరాన బూదికాకుండలేరు. 28

కదనమున్నది ముంగల, ఖండతుండ
ములయి కుప్పలుగాఁ గూలఁగలవు ఖలుల
కాయములు; గాచియుండుము గలతఁమాని
యంచు నామెను శాంతించునట్లుచేసి, 29

వాయునందను దగభద్రపఱచి, పార్థు
భావవేగము నరికట్టి, భావినెఱిఁగి
పలుకకున్నట్టి కవల సద్భావమునకు
మురిసి లోఁలోనఁ, బోయి నే మఱలివత్తుఁ 30

బుత్తువాయని పాండుపోత్తముని సెలవుఁ
బడసి, తనతోడ వచ్చినవారినెల్లఁ
బంపి పోఁజూచి, యరదమ్ము పైన నెక్కి
ద్వారకనుజేర వసుదేవతనయుఁడేగె. 31

కడుపులోనున్న కలఁతల బరువులెల్లఁ
గరఁగి శ్రీకృష్ణదర్శన కారణమునఁ
బలుచపడి పాలినట్టు దాపమ్ములార
ద్వైతవనమున కరిగిరి పాండవులును. 32

క్రమజలపూర్ణ సరసులు, కల్పకముల
కరణి శోభిల్లు తరువులు, కలిసి పెనఁగి
ప్రాకుఁబూదీవియలు, నవ్యరాగములను
దీయుకోయిలపిండులుఁ, దెమ్మెరలును 33

గలిగి, యా వనగర్భభాగమ్ము ప్రకృతి
రాజ్యచక్రమ్మునకు నెల్లరాజధాని
యనఁగ రమ్యాతిరమ్యమై యతిశయించు
చుండె, ఋతువునకొక క్రొత్త సొబగునంది. 34

ఆర్పనెంచియు నారని యాగ్రహాగ్ని
యడఁగి హృదయాననుండక యతిశయించు
చుండఁ, గనులెఱ్ఱఁజేయుచునుండు భీముఁ
బట్టియదుపుననుంచుచుఁ, బలువిధముల 35

పత్ని పాంచాలి, తన భంగపాటుఁదలఁచి
పరితపింపఁగ నోదార్చి, తఱచు తనదు
పంచకరుదెంచి ప్రాజ్ఞులు పరమ ధర్మ
మర్మములనెన్నొ వివరించి మఱలుచుండ, 36

మదిని మథియించి సహనసంపదను బడసి,
యోడిజూదాన వనినుండ నొప్పివచ్చి
నట్టి నియమితకాలము నెట్టులైన
సత్యభంగమ్ముగానట్లు సక్కఁబఱచి 37

పొఁగఁగడపెదు దీక్షతో సత్పురుషుఁడు
ధర్మజుండందు నిశ్చల ధర్మచిత్తుఁ
డగుచు మనుచుండఁ, గార్యార్థియౌచు నటకు
నరుగుదెంచిన ముని, పరాశరసుతుండు, 38

కుడిచి కూర్చుండి యడవిలోఁ గడపియెట్లొ
పదియు మూడేండ్ల కాలముఁ, బడయవచ్చు
మరల రాజ్యమ్మునంచును మందులగుచు
నూరకుండినఁ బనులు సేకూరఁబోవు. 39

ధర్మబద్ధుల కేనీతి; దాని విడిచి
తాము దీర్చినదే తగు దారియంచుఁ
దలఁచి వర్తించు దుష్టచిత్తముల కద్ది
లేదు; నీపని సుకరమ్ముగాదు వినుము. 40

మాటఁదప్పక వనినుండి మరలినాము.
మాకు మా రాజ్యమిండన, మంచిదంచు
మకుటమునుదెచ్చి నీకు నమస్కరించి
మస్తకమ్మున నిడదు దుర్మార్గగణము. 41

సమర మొనరించియే వారిఁ జక్కఁదిద్దఁ
గలవు; దానికి ననువైన బలముఁ బడయ
వలయు సత్కాలమిద్ది; పో వదలినంత
యేఁటిపాలయిపోవు నీ పాటులన్ని. 42

కర్ణు నోడించవచ్చును; కాలరాయ
వచ్చు దుర్యోధనాదుల; వలనుకాదు
ధన్వులను ద్రోణభీష్ములఁదాఁకి గెలువఁ
బరమదివ్యాస్త్రసహితులు వారు ఘనులు. 43

కాన నో ధర్మజా! యట్టి ఘనులఁ దాఁకఁ
గలుగు వరశక్తినందఁగఁ గాలకంఠుఁ
గానఁ బంపుము పార్థు, నద్దాన నిష్ట
సిద్ధి యగునంచు వివరించి చెప్పిపోయె. 44

ఆ క్షణమ్మననే వ్యాసు నాజ్ఞ నతఁడు
పార్థునకు నందియీయఁగ వాఁడు, కురుల
మట్టిపాలను జటలుగా మలఁచి, తలకు
మధ్యఁ గూరిచి ముడిఁచి, భస్మము నలంది, 45

కాయమును వ్యాఘ్రచర్మానఁగప్పి, మెడను
దాల్చి రుద్రాక్షమాలల, ధనువు నంది
హస్తమున, విప్రులకు మ్రొక్కి, యుండనున్న
భీమునికిఁ జెప్పి, ద్రౌపది వీడుకొల్ప 46

సంతసమునిండ, నిశ్చల స్వాంతుఁడగుచు
సాఁగిపోయెను, ఘన హిమాచల గభీర
సానుతటములలోఁబడి సాంబశివుని
సన్నిధిని జేరి తపమంది చక్క మఱల. 47

అమల జలపూర్ణ కుముద కల్హారకమల
హంససంకులమౌ పంకజాకరములు,
పార్థు సెలయేళ్లు, ఫల పుష్ప భూరుహములు,
నిండి మెరసెడుఁ బెనుమంచు కొండనెత్త 48

మందు నెలకొని, నిర్మలానంద చిత్త
సత్వమునునంది, యూర్పులఁ జక్కనదిమి
పట్టి, యొక కాలి బొటవ్రేలిపైన నిలిపి
కాయమును, నూర్ధ్వబాహుఁడై, కప్పి కన్ను 49

గవల జెప్పల, నింద్రియ గర్వమడఁచి,
పస్తుపడి, నిర్జలుండయి, పరిసరముల
మఱచి, యేకైకనిష్ఠతో, మానసమును
నీశ్వరార్పిత మొనరించి, యెట్టులైన 50

వాని మెప్పించి, ప్రత్యక్షపఱచుకొని ప
దములపై వ్రాలి, ప్రణుతించి, దయనుగొనుమ
టంచుఁ బ్రతిమాలి, పడసి దివ్యాస్త్రబలము
మఱలఁ, దపమందె, సిద్ధ సుస్థిర మనస్వి. 51

మాఱురూపాన వాని సామర్థ్యమెంత
మాత్రమో, కని యావల మఱుఁగువిడిచి
యిష్టసిద్ధిని గావింపనెంచి, పతిని
బోయతగమార్చి, తానొక బోయఁడగుచు, 52

నడవిపందినిజేసి మూకాసురుఁడను
వాని, యర్జునుముంగలఁ బరుగువారఁ
దఱిమె, వెన్నంటి దానిని, ధనువునంది
శరమునెక్కిడి పార్వతీశ్వరుఁడుపూని. 53

ధ్యాననిష్ఠను గలఁచిన దానిఁ గనులు
విచ్చిచూచిన పార్థుఁడు నొచ్చి, యొక్క
వాడితూఁపును సంధించివదలె, నపుడె
బోయఁడును గోలనెక్కిడి, పోవిడిచెను. 54

అమ్ము లవిరెండు నేకకాలమ్మునందె
యిరుకడలఁ దాఁకఁబందిని గిరగిరమని
తిరిగి యది నేలఁబడి పూర్వదేహమంది
పోయెఁ బరమేశ్వరుని బనిఁ బూర్తిచేసి. 55

నేను గొట్టినదానిని నీవుఁగొట్ట
న్యాయమా? యనె బోయఁడు; న్యాయమౌన
నేను గొట్టినదానిని నీవుఁగొట్ట
వనియెఁ బార్థుడు - పరుషవాక్యములు మించె. 56

చలము గ్రమ్మెను: సింహగర్జనలు పెలఁగె;
కురిసె శరవృష్టి; గ్రుద్దుపై గ్రుద్దువడెను
బిడుఁగువడినట్లు; దడదడ పుడమి వడఁక
వారు పోరాడఁదొడఁగిరి ఘోరముగను. 57

నరుని బలమెట్టిదైనను బరమశివుని
బట్టి బంధింపఁగల్గునా? దిట్టయయ్యు
నర్జునుఁడు శక్తినంతయు నతనిపైన
మోపి, మూర్ఛిల్లిపడె నిఁకఁ నోపలేక. 58

అతని యసమాన ధైర్యసాహస విశేష
శక్తిసామర్థ్యములకు, నాశ్చర్యపడుచు
ఫాలనేత్రుఁడు, వానిపై జాలినిగొని
తాఁకి మూర్ఛనుమాపి ప్రత్యక్షమగుచు, 59

కలనుగని మేలుగాంచినకరణి, విరియు
కమలములయట్లు నేత్రపద్మములవిచ్చి,
తన్ను, హిమశైలరాజనందనను జూచి
తన్మయుండయి తలవాల్చి దండమిడెడు 60

వానిఁ, బాండవకులసింహుఁ బల్కరించి
పాశుపతమిచ్చి, సకల శుభమ్ము లొదవు
గాతమని చక్కదీవించి కనుల కందు
పడక మఱగెను గడనున్న పత్నితోడ. 61

కాయమెల్లను గన్నులు గలుగవలయు
కారణము నాఁడె పండిన కరణి సుతుని
గాంచ నుత్సాహపడిన యాఖండలుండు,
యమ వరుణ కుబేరులతోడ నరుగుదెంచె. 62

వచ్చి పుత్రుని గౌగిటఁగ్రుచ్చి, మనసు
విచ్చి వాక్రుచ్చి, చనవిచ్చి మెచ్చి, యంది
యిచ్చెఁ బిలుపునుఁ దనతోడవచ్చి యమర
పురికి నొక దేవకార్యమ్ముఁ బూర్తిచేయ. 63

యముఁడొసంగిన ప్రబలదండమును వరుణ
దత్తమగు పాశబలమును, ధనదుఁడొసఁగి
నట్టి దివ్యాస్త్రమును భక్తినందికొని వి
జయుఁడు స్వర్గమ్ముఁజేరెఁ బుష్పకమునెక్కి. 64

అచటఁ బేరోలగమున సింహాసనమున,
నమరపతితోడ నాతఁడర్థాసనమున,
నమరియుండఁగ నూర్వశి యనెడు ప్రముఖ
దేవతాంగన మట్టెలందియలు మ్రోయ 65

మందహాసము చిందఁగ మందగతుల
మధురిమలు సిల్కుచును రంగమధ్యమందు
రమ్యముగనిల్చి మత్తమరాళమనఁగ,
మస్తకమువంచి సభకు నమస్కరించి, 66

మరుని సరువెంత యునిపించు నరుని దివ్య
మంగళాకారమునుగాంచి, మఱచి యొడలు
మరులలోఁబడి, మైకాన మధువుఁగొన్న
మాడ్కిఁ జెమరింపఁ విలువెల్ల, మదనుజేఁతి 67

కుసుమ కోదండమన మేనుఁ గోమలముగ
వంచి, వ్రాల్జడ నారిగావించి, కొసరి
కొసరి కొనచూపు దూఁపుల విసరి విసరి,
కాలికదలింపులోఁ, దాళగతులలోన, 68

హావభావాల, హస్తవిన్యాసములను,
బాటలో మాటలోఁ గన్నుగీఁటులందు
వ్యంగ్యముగ లోని వలపులు బయటఁబడెదు
నట్టు దగనాడి మఱఁగెఁ నొయ్యారియగుచు? 69

ఆమె, భూలోకమన్మథు నతని నెట్టు
లైన గన లోని దాపమ్ము నరయఁజెప్పఁ
గాఁచి, పూఁదోటలోన నేకాంతముగను
వాఁడు విహరింపవచ్చినపట్టుఁ జూచి 70

నిలువు బులకింపఁ, గనులు వెన్నెలలు సిలుక,
మాట తఁడబడ, మేనఁగంపమ్మువుట్ట,
వలపు తలఁపులు గుండెలోఁపలనె యణఁగి
వెలికిఁ బ్రాకంగఁదలఁచియు వెడలలేకఁ 71

దలలు బైకెత్తి దించుచుఁ, దారులాడు
చుండ, యత్నించి యత్నించి దండఁజేరి,
పలుకు వలుకునఁ దేనియలొలుకుచుండఁ
బలికె నిట్టుల భావమ్ము బయలువడఁగ. 72

విన్నుఁ గనుఁగొన్నదాది నే నెన్నడెఱుఁగ
వట్టి తలఁపులు నాలోన నంకురించి,
పూచి, పరిమళములఁజల్లి, యూఁచి మేన
మత్తుఁగలిగించి మించి నెమ్మదిని జెఱచు. 73

నరుల నినుబోలు సుందర పురుషులున్న
మర్మమెఱుఁగని కతన నిమ్మాడ్కి నిందు
మఱఁగి యుంటిని; కాకున్న ధరణికి దిగి
వచ్చియుందును వలచినవానిఁ గొనఁగ. 74

స్వర్గలోకమ్ములోనున్న సౌఖ్యమేమి
చావకుండుటయేకదా? చాలునొక్క
నాటి సుఖజీవనము - చలనమ్ములేని
శాశ్వతత్త్వమ్ములోన నశాంతి కలదు. 75

వలచి పొందంగఁ దలఁచినవాని పొందు
భాగ్యమది లేదు మాకు, నెవ్వాఁడుగాని
పంచఁబిలిచినఁ బోవలె స్వర్గవాసుఁ
డైనఁ జాలును; మా ధర్మ మట్టిదిచట. 76

మాదు కౌఁగిళ్ళలోఁబడ మహినినున్న
వారు దపమంది వత్తురు; వలచి నిన్ను
వచ్చితిని నేను - పుణ్యమ్ముపండె, నన్ను
వాడుకొనుమింక నీ విష్టపడినయట్లు. 77

కాంతగా నన్ను బడయ వాంఛింతువేని
భువికి దిగివత్తు నిప్పుడే దివినివిడిచి
పెట్టి యమరత్వమునుమాని, వేయికనుల
వాఁడు, దేవేంద్రుఁడే యడ్డువడినఁగాని 78

యనినఁ, బార్థుఁడు, నాతండ్రి యండనుండు
దానవగుటను నీవు నా తల్లివౌదు;
వావివరుసలఁ బాటించువారు మీరు
కారు, మాబోఁటులకు నది మీఱరాదు. 79

వలదు మన్నించి నన్నిక వదలుమంచు
వందనంబిడ, విసిఁగి, కోపమ్మునంది,
పొమ్ము భువికిని మఱలి నపుంసకుఁడవు
గమ్మటంచును నామె శాపమ్మునిడెను. 80

వార్తవిని వాసవుఁడు వాని వగపుఁదీర్ప
వచ్చి యా శాపఫలము, దా వలచినపుడె
కలిగి యొక వత్సరంబుండి తొలఁగునంచుఁ
జెప్పి యోదార్చె; నట వనసీమలోనఁ 81

దపమునందఁగఁ దమ్ముఁడు దరలిపోయి
కడచె నేడేండ్ల కాలము, గాని వాఁడు
మఱలిరానట్టి కారణభరమదేమొ
యంచు, ధర్మజుఁడును బవనాత్మజుండు 82

వగచుచుండఁగ, వాసవుఁ బనుపునంది
యటకు వచ్చిన రోమశుండన్న మౌని,
వాని వృత్తాంతమును దెల్పి, వచ్చు దేవ
కార్యమొక్కటిఁ దీర్చి మీకడకు వాఁడు 83

సుంతకాలమ్ములో, మనమంతలోనె
పుణ్యతీర్థాల సేవింపఁబోయి మఱల
వచ్చునంచును నుత్సాహవాక్యములను
బలికి తోఁగొని వారితో పయనమయ్యె. 84

అందునిందును మార్గమధ్యమ్మునందు
నందువడినట్టి తీర్థములందు మునిఁగి
క్షేత్రములఁ గొన్ని దర్శించి, క్రిందుమీఁదు
లగుచు, హిమశైలమున దారులరసి నడచి 85

కట్టికరపాశముల వృక్షకాండములకు
కాయములఁ బట్టువీడనికరణి, గాలి
వానలకునాఁగి, చనిచని పైకినేగి,
వారు బదరీవనమ్మును జేరినారు. 86

అక్కడను నూఱురెక్కల చక్కనైన
పసిఁడితామర యొక్కటి పరిమళములఁ
బరవనెల్లెడఁ జల్లుచు వాతగతికి
వచ్చిపడెఁ జిత్రమనఁగ ద్రౌపదికి ముందు. 87

దానిఁగొని యామె పలుమార్లు తాఁకి, పాణి
పద్మములఁజొన్పి, మఱిమఱి పరిమళముల
నాని యరగంటిమోడ్పుల ననుభవించి,
దళములెంచుచుఁ, గడనున్న ధవుని భీమ 88

సేను వలఁజూచి నేనెందు దీనిఁబోలు
దామరనుజూడ, దీని యందమ్ము సాల
తఱిగియుండును దుమ్ములో దొరలి గాలి
తాఁకునకు దూలి; పూచెడుతలము వెదకి 89

కోసికొనిరమ్ము గ్రొంగ్రొత్త కుసుమములను
గొన్నిటిని నందఁగోరెదఁ, గోపగించు
కొనకుమంచును బుత్తెంచ, చనెనతండు
దివ్యసుమమద్ది వచ్చిన దిక్కునంటి. 90

బాటకడ్డుగఁ దోఁకను బ్రాఁకవిడిచి
వృద్ధమర్కట మొక్కటి వెడలనీకఁ
బండియుండిన, వాలముఁ బట్టిదాని
నవలికీడ్వఁగ వాఁడు ప్రయత్నపడెను. 91

'పట్టుబైఁబట్టు; యొద్దు పైఁబైనియొద్దు--
వాయునందను బలమెల్లఁ బలుచఁబడెను
గాని, యా తోఁక కదలదు!' ఘనుఁడితండు,
కాఁడు మర్కటమాత్రుఁడు వీఁడటంచు 92

దలఁచి ప్రార్థించెనాతని దారివిడిచి
పంపుమాయని; దయఁగొని వానరుండు
వావులించుచు లేచి బ్రహ్మాండమైన
కాయరూపమ్మునంది సాక్షాత్కరించె. 93

మారుతీనందనుఁడ, హనుమంతుఁడంద్రు
నన్ను; నీ యగ్రజుఁడ నేను; కన్ను తెఱచి
కనుము గంపమ్మునందకు; కార్యసిద్ధి
కలుగునంచును గరమునఁ గట్టి యతని 94

గాయమును గాయమునఁజేర్చి కౌఁగిలించి,
'ఘనుని వానిని ఘనతముగాఁనొనర్చి,
కదనకాలాన విజయు నరదముపైని
గదలు టెక్కెమ్ములో నేను కాయమంది 95

కాచుచుందును బొమ్మంచుఁ గానఁబడక
పోవ వాయుసుతుండును, బొంగిలోన
నంతటంతటి యగ్రజునట్లు గనిన
భాగ్యమునకుమ, నటుపైని పదము మోఁపి 96

నడచి, చరచరఁ జనిచని కడకుఁ, గనక
పద్మములు పూచియున్నట్టి పట్టునుగని
యాఁగి, గంధర్వరక్షితమైన కొలనుఁ
జొచ్చి, పిడికిటిపోఁటులఁ గ్రుచ్చి గ్రుచ్చి 97

వలదు వలదని పైఁబడి వచ్చినట్టి
ప్రబల వీరులఁ బడఁగొట్టి, ప్రసవములను
గాండములతోడఁ బెకలించి, కాంతకడకు
మఱలె, సుంతైన బడలని మానవుఁడయి. 98

రాజ్యమునువిడి యటుల నరణ్యమునకు
వచ్చియును తీరుబడిలేని పనులు భీమ
సేనునకుఁ; గానిచో వాని చిత్తవృత్తి
కౌరవుల పైనిఁబడి కసిఁగ్రక్కియుండు. 99

పాండవులఁజేర విప్రరూపమున వచ్చి
యదను గనిపెట్టి ఖలుఁడు జటాసురుండు
వారినే మ్రింగఁ దలఁపడ, వానిపైన
పడి వధించెను; శాపతాపమునఁ జిక్కి. 100

సర్పమైయున్న నహుషుఁడు చలముఁబెంచి
పట్టి కాయమ్ముఁ జుట్టినఁ బట్టుసడలఁ
గొట్టుటకు నూర్పుబిగఁబట్టి నెట్టి నెట్టి
వాఁ డు విడువక పోరాడినాఁడు వొరలి. 101

అమరపురివీడి పయనమై యర్జునుండు
ఘనుల నిర్జేయ వీర్య విక్రముల దేవ
వైరులను కాలకేయ నివాతకవచు
లన్నవారిని వధియించి యనుపమాన 102

దివ్యతేజస్స్వరూపుఁడై దేవరథము
నడుమఁ గూర్చుండి మాతలి నడుప నెలమి
భువికి దిగివచ్చి యటనున్న భూసురులకు
ప్రణతులిడితొల్త, మ్రొక్కె ధర్మజుని జూచి. 103

తాను తనయునికై నీతి మాని వనికి
పంపఁ, బాండవు లిడుమలఁబడియు నందు
దివ్యమౌ శక్తులనుబొంది దినదినాభి
వృద్ధిఁగాంచుచు నున్నట్టి వివరములను 104

విప్రుఁడొక్కఁడు చెప్పఁగా విని, విచార
పడుచు, కురుకులపతి యింక వంశనాశ
నమ్ము దప్పదటంచును నమ్మి జ్యేష్ఠ
తనయుఁగడఁబిల్చి చనవుతో ధర్మబుద్ధి 105

గఱుప యత్నించి విఫల సంకల్పుఁడైన--
వాని హితబోధలను వినలేని ధూర్తు
డంతటనుబోక, గడునీచమైన దుష్ట
గణముతోఁగూడి యోచించి, కానలందు 106

గాసిఁబడు పాండవుల నింకఁ గష్టపెట్ట
వలచి, పశువుల మేఁపెడువాని బిలిచి,
బాతమును జక్కగా నేర్పి ద్వైతవనిని
వన్యమృగములు పశువులపైఁ బడెనని 107

జనకునికి ముందుఁజెప్పించి యనుమతిఁగొని,
యాత్మలోఁబొంగి, తగ ఘోషయాత్రకయ్యు
శకునిమామయుఁ గర్ణ దుశ్శాసనాది
స్వార్థపరులును, రథహయసామజభట 108

బలములును, బరిజనములు, వారకామి
నులును, కవిగాయకులు వాద్యములును తోడఁ
గదల వైభవమొప్పార, ముదముమీఱ
వెడలె వనిఁజేర ముందున్న విధినెఱుఁగక. 109

అడవిలోఁబడి మధుపానమంది యిష్ట
పడినయట్టుల విహరించి విడిదినిగొనెఁ
బాండుసుతులకుఁ గడుసమీపమున నొక్క
ఘన సరోవరతీర భాగమునుజూచి. 110

సంచలింపఁగ జలచరజాల, మమల
సలిలములు పంకభూయిష్ఠములయి కలఁగ,
ఖలులు గుంపులుగూడి యా కొలనిలోని
కుటికి, తెగనీది చెఱచిరి మఱచి యొడలు. 111

అంతయును జూచుచున్న యుద్దండులైన
ఘనులు గంధర్వవీరులు గినిసి చాల,
వారి వారింప శరపరంపరలఁ దొడిఁగి
విడిచియును సత్తుచాలని విధము దోఁచి. 112

ప్రబల కౌరవవాహినీ బలవిశేష
భారమున కోర్వఁజాలక, పట్టుపెదరి
పరుఁగులిడి చని గంధర్వపాలకుఁడగుఁ
జిత్రసేనునికడకేగి చెప్పినారు. 113

వాఁడుఁ జతురంగబలములతోడ వచ్చి
ప్రళయరుద్రునిభంగి యాగ్రహమహాగ్ని
కణములురలఁగఁ గన్నులఁ, గత్తిఁబట్టి
కంఠములఁ ద్రుంచఁదొడఁగెను గరుణగొనక. 114

రథము ముక్కలుగాఁగ, సారథియుఁగూల
రంగమధ్యాన నిలిచి పోరాడి భంగ
పడెను గర్ణుఁడు; పరుగులు వట్టినారు
భటులు భయమంది; చాల సంకటమునంది 115

నెత్తురులుగ్రక్క నిలువులు నిలువలేక
యవలి కరిగిరి దుశ్శాసనాది ఘనులు--
ఒక్కఁడై చిక్కువడెను దుర్యోధనుండు
చిత్రసేనుని జేతిలోఁ, జిన్నపోయి. 116

రయముఁగొని సైనికులు ధర్మరాజుకడకు
నరిగి తమ్ముని రక్షింపనౌనటంచు
జరిగినదిచెప్పి ప్రార్థింపఁ జాలవగచి
యతడు భీమార్జునులఁ బంపె నతనిగావ. 117

తాము దలఁచిన పనిని గంధర్వులెయటు
గష్టమేలేక ముగియింపఁ, గడఁగి తామె
దుష్టు రక్షించుటకునేగ నిష్టపడని
వారెయయ్యును, వారు మార్పలుకలేక 118

యగ్రజుని శాసనంబంది యస్త్ర శస్త్ర
సహితులై చని పోరాడి జయమునంది
ధార్తరాష్ట్రుని విడిపించి ధర్మజుకడఁ
దెచ్చి నిలిపిరి సుంతయు మెచ్చునట్లు. 119

కావిపనులకుఁ బూని భంగమ్ము నంది
కలఁతపడనేల? వలదిట్టి కార్యములికఁ
బొమ్మనుచుఁ బంపె నాతని బుణ్యమూర్తి
యార్తజన బాంధవుఁడు పాండవాగ్రజుండు. 120

శిరముఁ బైకెత్తి పెలవంది మఱలిపోవ
తగని దుర్మార్గుఁడగు నరాధముఁడు ధార్త
రాష్ట్రుఁ డాచోటువిడిచి పరాభవాగ్ని
మండి గుండియు కాలుచునుండఁ-పరులఁ 121

బరిభవింపఁగ నేఁగి నేఁబరిభవపడి
వచ్చితిని చచ్చిచావని పగిది, మెచ్చి
బ్రతుకునిక పుత్తునేమందు! ప్రజలముందుఁ
బరువునిల్పెడు తెఱఁగేది! ప్రాజ్ఞులైన 122

భీష్మ విదురుల నెటుసూతు! వివరమడిగి
నంతఁ దండ్రికినేఁ జెప్పనైన దేది!
ప్రాణమును మానమునువిడి కానలోన,
మఱలఁ గల్గుదు హస్తినాపురికి నెట్లు! 123

కానఁ బ్రాయోపవేశ దీక్షాపరుండ
నై త్యజింతును బొందినటంచు దర్భ
పఱచి కూర్చుండ; కురుకుల భావిభాగ్య
భానుఁడా లెమ్ము! నీవలెఁ బరిభవమును 124

బడిన పాండవులున్నారు ప్రాణములను
బాయకయె, వారు చావరు; పదియుమూడు
వత్సరములేగ రాజ్యముఁ బడయువచ్చు
నన్న దృఢనమ్మకమున - కార్యార్థులెపుడుఁ 125

బట్టువిడఁబోరు; పడిలేచి పాటులువడి
పడయుదురు సిద్ధి; యరుల గెల్వంగ లేక
భంగపడి యాత్మహత్యకుఁ బాలుపడెను
గౌరవాగ్రజుఁడనెడు పెన్పేరునిలుచు; 126

తారుమారులు గాకుము, ధైర్యముఁగొని
తరలిపోదమురమ్మ, మా దండనుండ
భయము నీకేమి? యజ్ఞాత వత్సరమునఁ
బట్టువడితీరుదురు పంచపాండవులుమ 127

వారిపత్నియు, నిస్వేచరారు; పూర్ణ
రాజ్యరమ నీదె; లేరు వారసులటంచు,
నారిపోయిన పెమ్మెలో నాముదమ్ము
నింపి వత్తిని వెలిగించి నిలుపునట్లు, 128

వాని దైన్యముమాపి జీవమ్ముఁబోసి,
పట్టుతోలేఁపి యెట్టులో పయనపఱచి,
కర్ణ దుశ్శాసనాదులా కాన విడిచి
మఱలఁ గల్గిరి హస్తినాపురమునకును. 129

వనిని బొందిన పరిభవపాటు మఱచి
యుండ దుర్యోధనుఁడు, వాని యండఁజేరి
బాగ నుబ్బించి, దుష్టులు వైష్ణవమను
జన్నమును జేయఁజేసి రత్యున్నతుఁడన. 130

ధర్మజుండిట మౌనులు ధర్మసూక్ష్మ
ములను వివరించి చెప్పఁగ వలరి, పుణ్య
కథల నెన్నిఁటినో విని కలఁతమాని
శాంతిగనుచుండె నిశ్చల స్వాంతుడగుచు. 131

అంత నొకనాడు 'దుర్గమారణ్యమందు
వేఁటలాఁడగఁ బత్నిని విడిచి పంచ
పాండవులు సనఁ- జతురంగబలముతోడ
సైంధవుండను సాహసి సాల్వుఁగూతు 132

బరిణయంబాడ మార్గమ్ముఁబట్టి చనుచు
ద్రౌపదినిజూచి మోహించి దరిసి యామె
వశ్యపడకున్న చాల నిర్బంధపఱచి
పైనఁబడి పట్టుకొనిపోవఁ బాపమనక- 133

కావ రేయంచు తాపసాంగన యొకర్తె
జూయ గొంతుక యఱువఁ, గర్ణములఁబడిన
పాండుపుత్రులు పరుగునవచ్చి యటకు
వానిఁ దాఁకిరి యత్యుగ్రభంగి నలిఁగి. 134

వెడల విశిఖాలు వేలకు విజయుచేఁతి
కార్ముకమునుండి, భీముని గదయుఁ గదలి
తాండవం బాడుచును దాఁకి తలలు మోదు
చుండఁ గొండలు గూలుచునుండె నఁనగ 135

కూల వేదండవితతి, గుఱ్ఱాలు మడిసి
పడ, రథమ్ములనుగ్గగ భటులు పెదరి
పాఱ, నసహాయశూరుఁడై పోరి కడకుఁ
బట్టువడె సైంధవుఁడు గాలిపట్టిచేఁత. 136

అలిఁగి యెఱుఁగని ధర్మజునంతవాఁడు
పంచనుండగ భయమేమి? వాఁడు ముక్తుఁ
డగుచు వచ్చినయటు వోయె ననిలతనయు
నాగ్రహంబగ్రజునిచేత నడఁచబడఁగ. 137

కడనుగనుచుండె వనవాస కాలనియతి;
యింక నజ్ఞాతవాసమే; యేగునదియు-
కయ్యమొనగూడు తప్పదు కర్ణుచేతఁ
జిక్కుపడనట్లు పుత్రు రక్షింపవలయు 138

నంచు నింద్రుఁడు, బాఁపలా సించినట్టి
దాని నెద్దానినైనను దడయకిచ్చు
ధర్మగుణమునుదప్పని దాఁత కర్ణు
గడకు విప్రుండుగానేగి, కవచకుండ 139

లముల నడిగికొని ప్రతిఫలమ్ముగాగ
స్వీయశక్తి బలంబును జేఁతికిచ్చి,
యొక్కపరి వాఁడనగునని యొప్పఁజెప్పి
కదలిపోయెను సిద్ధసంకల్పుఁడగుచు. 140

ఇంతలో దుప్పియొక్కటి యెఱుఁగనట్లు
విప్రునరణిని హరియించి వేగముగను
బరుఁగుఁదీసెను; దానిని బట్టియీయ
దలఁచి వెంటనె పరుగిడె ధర్మజుఁడును 141

దమ్ములనుగూడి; చేఁతికందకయె యదియుఁ
దూరమున కేగి మఱఁగెను: వారు డప్పి
దప్పిఁగొని స్రుక్కి చక్కని తరువునీడఁ
గూరుచుండిరి బడలికతీర కొంత. 142

నకులుఁడేగెను నీరమునకును; వాఁడు
రాఁడు; సహదేవుఁడునుజనె; వాడు రాఁడు,
విజయుఁడునుబోయె; తిరుగఁడు; భీముఁడేగి
మఱలిరాఁబోడు - కడకు ధర్మజుఁడు నేగి 143

చేరువనె యొక్క కాసారతీరమందుఁ
జచ్చినట్లున్న తమ్ముల చాఁయఁజూచి
హతవిధీ! యని యెల్గుఁజాపాడ నేడ్చెఁ
బట్లు తెగిపోయి గుండియ పగిలినట్లు. 144

అంతరిక్షములోనుండి యక్షవాణి
యంతయును జక్కఁబడును, నిరాసపడకు;
వలదు క్రోలంగ నిది విషజలమటన్న
వినక మరణించినారిటు వీరుసూడ. 145

నిన్నునేఁ బ్రశ్నలడిగెదఁ గొన్ని, తగిన
యుత్తరములిచ్చి పడయుము, మిత్తివాఁతఁ
బడిన భీమాదులందరు బ్రతుకుదురని
సాదరమ్మున వాని కుత్సాహమిచ్చె. 146

చిత్తమని యట్టులేచేసి యుత్తరములఁ
జక్కఁగాఁబల్కి తమ్ములఁ జక్కఁబఱచి
తనియ నాతఁడు, యెదుట ప్రత్యక్షమైన
ధర్ముఁడతనిని గాంచి నా తనయుఁడీవు, 147

ధర్ముఁడను వేను, నిను జూడఁదలఁచి యిట్లు
పేసితిని; సంతసించితిఁ; జిక్కులన్ని
చీలి వాదర్శనంబున మేలుకలిగి
సౌఖ్యమొనగూడు, నింక నజ్ఞాతవాస 148

కాలమునుబుచ్చఁదగుఁ, బుచ్చఁగలరు మీరు
వలయు రూపమ్ములనునంది; పగతులకును
గంటఁబడలేరు, నే మిమ్ముఁ గాఁచియుందు
నంచుఁ గనరాకపోయె దీవించి సంచి. 149

సమాప్తము

# విరాటపర్వము

శ్రీలకును మాపియును సుంత చింతలేని
పగిదిఁబాండు తనూజులు పత్నితోడ
వనులఁబుచ్చిరి పండ్రెండు వత్సరములు
ప్రతిభ పెంపొంద దివ్యాస్త్ర బలమువడసి. 1

అంత నజ్ఞాతవాసమ్ము నంద వారు
చెంతనుండిన విప్రు లాశీర్వదించి
పంప ముందేగి, చీఁకటిపడిన నొక్క
కడను నారాత్రిఁ గడిపి మేల్కాంచినారు. 2

ఐదుగురితోడ నొకతన్వి యంటితిరుగు
చుండ నేరీతి మెలఁగినఁ జూపరులకుఁ
బట్టుపడకుందుమా యను భయముతోఁచి
తమ్ములనుగూడి చింతించె ధర్మజుండు. 3

వట్టిశంకలలోఁ బడవలదు; మనకు
నెందు నెట్లున్నఁ గడచునీయేఁడు; నాఁడు
ధర్ముఁడిచ్చిన వరమేల తప్పునంచు
నర్జునుఁడుపల్కి యన్న భయమ్ము మాపె. 4

మత్స్యదేశము సస్యసంపన్నమైన
పట్టు; దానిని బాలించువాఁడు ధర్మ
వర్తి విరటుఁడు; మాఱురూపమ్ములంది
వానిఁగొలుచుట తగునని, వారుగలిసి 5

చక్కయోచించి, అస్త్రశస్త్రముల విడిచి,
పదిలముగఁజుట్టి మృతకళేబరమునట్లు,
చీఁకటులుజిమ్ము పెనుజువ్విచెట్టుపైని
వ్రేలఁగట్టిరి పరులంట వీలుపడక. 6

దప్పిఁగొని, డప్పి, నెత్తురు చిప్పిలంగ,
పొక్కవ్రేళుల పుటములు, పక్కనొక్క
యడుగునిడలేక, యప్పుర మచ్చటిచ్చ
టనెడునాసలఁబుచ్చు నొయ్యారి ద్రుపద 7

తనయుఁగనుఁగొని ధర్మనందనుడు, దీని
మోపితెండన, నగ్రజు ముదలనంది
యర్జునుం డల్లెచేయఁగ, నరిగివారు
విరటు నగరమ్ము చేరువ విడిపి, యవల 8

జేయఁదగినట్టి పనులను జింతచేసి,
మార్చి తనువుల ననువుగ, మత్స్యరాజ
సౌధమునుఁజేరి కొలువంద, సాఁగినారు
ఒక్కరొక్కరె వేర్వేఱు దిక్కులంటి.

గద్దియనుదిగి, యెదురేగి, కరముమోడ్చి,
యర్ఘ్యపాద్యాదులొసఁగి యాహ్వానమిచ్చి,
యాసనమ్మును సవరించి యమరఁజూచి
యాదరమ్మునఁ గైగొన్న యధిపుకడను 10

సచివుఁడై స్థానమందఁగఁజాలినాఁడు
గంకుడనుబేరఁ బాండవాగ్రజుఁడు, కావిఁ
గట్టి, రుద్రాక్షములుదాల్చి, కక్షమందు
దండమును, హస్తమందు కమండలంబు 11

నంది, మెయినిండ భస్మమ్మునలఁది, యచటి
వారికెల్లను బంధువై, వగలమాపి
శాంతిఁజేకూర్చు పరసుఁడై, సకలధర్మ
శాస్త్రబోధకుఁడై, సత్యసాధకుఁడయి. 12

గదను జేఁబట్టుచేతనే గరిటఁబట్టి,
తలకు మొలకును మలినవస్త్రములుసుట్టి,
వలలుఁడను బేర వంటలవాఁడుగాఁగఁ
బాకశాలనుజొచ్చెను వాయుసుతుఁడు. 13

వంటపనిలేనివేళలవాఁడు, మల్ల
వర్యులను గ్రుద్దిగెల్చును; పైకినుటికి
మత్తగజముల మర్దించు, మనుజపాలు
మనసురంజిల్ల, బహుమానధనములంది. 14

ఆఁడుదానినివలెనుండి యబలకాక,
పుంసభావమ్ముతోఁచియుఁ బూరుషుండు
గాక, యూర్వశిశాపానఁ గలిగినట్టి
నవ్యరూపంబుతో, బృహన్నలయనంగ, 15

సభనుగలయట్టివార లాశ్చర్యపడుచుఁ
జూపులనునిల్పి తనవంకఁ జూచుచుండఁ,
'గాలియందెలురవళింపఁ, గనులువిరియ,
హంసగమనమ్ముతో నల్లనల్లనడచి, 16

యధిపుముంగలనిల్చి. విన్యాసమొప్ప
వంచితనువును జాపమ్ముపగిఁది, మృదుల
పాణిపద్మంబులను దలపైకినెత్తి
మోడ్చి, చిఱునవ్వు పెదవులమురిసియాడ, 17

తరుణులకు నేను నృత్యంబుఁ గఱపనేర్తు
నంచుఁ దీయఁగఁబల్కిన 'నర్జునుండు,'
ధరణిపతిమెచ్చి, పుత్రి యుత్తరను వాని
పంచవదలెను శిక్షనుబడయుటకును. 18

నకులుడంతట నశ్వపాలకులకెల్ల
నధికుఁడై పెత్తనమునందెనచట, గొల్ల
వానివలె సహదేవుఁడు మేనుమార్చి
చక్కనమరెను విరటుగోశాలలోన 19

ఒంటిపాటున కోర్వనియువిద; కీడు
వడుట కొప్పనిపడఁతి; యేపనికినైనఁ
దగని సున్నితగాత్ర, యుదాత్త, ముద్ద
రాలు, గారాబుబిడ్డ, పాంచాలియింక, 20

స్వాభిమానంబువోనాడి సహజరూప
సంపదకుమాపి, చని పరిచారికయయి,
పనినియాచించికొని కొల్వవలయునొక్క
సన్నుతాంగిని మనసులేకున్నఁగాని. 21

కొప్పువిడఁదీసి, కుడివైపుఁ ద్రిప్పిముడిచి,
జరఠవస్త్రమ్ము చేఁగప్పి చన్నుఁగవను,
మాసిపోయిన చీరను దీసికట్టి
తనువుఁ గన్పడకుండగదాఁచి, రూపు 22

మార్చి సైరంధ్రియై, యెట్లొ మనసునొక్క
మాడ్కి సరిచేసికొనఁగల్గి, మత్స్యరాజ
సతి సుదేష్ణనుగొల్చెదు గతినెఱింగి
కదలె నాసాధ్వి రాజమార్గమ్ము నంటి. 23

మఱుఁగి మబ్బులమెలఁగు చందురునికరణి,
మంచులోఁదోగుచున్న పద్మమ్ము పగిది,
దుమ్ము గప్పినలతపోలె, దుష్టధూమ
కలుషితంబైన, వరదీపకళికయనఁగ 24

నడచిపోవుచునున్న యా నాతినిగని
యప్సరోంగనయో కాక యవనిఁజూడ
నరుగుదెంచిన గంధర్వతరుణియొక్కొ
యంచు సౌధాగ్రమున విహరించు రాణి 25

భ్రమసి, దాసినొకదానిఁ బంపి బిలువ
నామెకడకును, దోడ్తోన నదియు వెడలి
వినయమునఁ బిల్చునందించి తనదువెంటఁ
దోడుకొనిపోయెఁ గుదురుగ మేడపైకి. 26

రాజపత్నియుఁ దగినమర్యాదతోడఁ
బజ్జకును బిల్చి, పరిపక్వఫలములిచ్చి,
దాని వృత్తాంతమంతయుఁ దనకుఁదెలుప
వలయునంచును జనవు తోపంగఁబలికె. 27

సమయభంగముగారాదు; సత్యమింత
సన్నఁగిలరాదు; పరువునుసడలరాదు;
చందమేర్పడవేరాదు--చతరయౌచుఁ
బలుకులనుదూఁచి పాంచాలి పలికెనిట్లు. 28

మాత! సైరంధ్రిజాతిసంభూతఁ; బంచ
వాథులకుఁబత్ని; మాలినీనామధేయ
నౌదు; నమ్ముఁడానెయుంచును నాదరించి
గారవించిన పాంచాలికడను ద్రొల్లి 29

పనులు సేయుచునుంటిని, బతులముందుఁ
బరిభవించినఁ బగతులు పారఁద్రోల
వదలివచ్చితి వనవాస వ్రతముఁబూని;
యదియునింకొక్క వత్సరమైన ముగియు. 30

ధర్మవర్తినివనవిని, దాని నీదు
కడను గడుపంగవచ్చితి; కలపములను
గూర్తు; తిలకమ్ములనుదీర్తు, నేర్తుపలుర
కములజడలల్ల; ముడికొక్క కరణివిరులఁ 31

గట్టిముదువంగఁజాలుదుఁ, గష్టమైన
కార్యములకును, గడునీచకార్యములకుఁ
జాల; చనవిచ్చి నన్నేలఁజాలుదేని
చిత్తమున కెక్కినట్టుల సేవసేతు. 32

మధురముగ నట్లువల్కిన మగువమనసు
మంచిదరయుంగఁజాలియు మత్స్యమహిషి
మౌనమునుదాల్చి, తనదు సమ్మతినిఁదెలుపఁ
జాలకుండెను లోఁలోనశంకయొదవి. 33

మగువ యుపమానసుందరి; మగనిమనసు
మార్చి లోఁగొనఁగల్గిన, మార్గమేది?
యనెడి యనుమానమును నామెయణఁచలేక
బయటఁబెట్టెను హృదయభావమ్ము విచ్చి. 34

తులువలకునెల్ల లోఁబడు కులముమాది
కాదు; గంధర్వులేవురు కడనెయుండి
కాఁచియుందురు; కుమతులు కంటఁబడిన
ఖండఖండములుగఁజీల్చి గ్రద్దలకును 35

బారవైతురు, నీకేటిభయమటంచుఁ
బల్కుమాలిని, యొకభంగిఁ బట్టువడిన
ప్రాణియైరాణి, దాపిగా దానినంద
సాహసించెను - కొంతకాలమ్ముగడచె. 36

దండనాథుండెయయ్యును, ధాత్రినెల్లఁ
దనదిగానెంచి దర్పించి తాండవించు
చుండెనొక్కఁడు, సింహబలుండు కీచ
కాగ్రజుఁడు - వానిధాటికి నడ్డులేదు. 37

రాణికిని సోదరుఁడు, మత్స్యరాజు మఱఁది,
యమిత కామాంధమూర్తి, రూపాభిమాని;
యతఁడు భూషిత తేజుఁడై యంతిపురినిఁ
జొచ్చె నప్పకుమ్రొక్కఁగ నిచ్ఛగించి. 38

అచట నామెకుఁజేరువ ననుపమాన
యైన లావణ్యవతి చక్కనమరియున్నఁ
గాంచి, నిశ్చేష్టుఁడైనిల్చె ఖలుఁడతండు
గలనుగాంచెదునట్లు లోకమ్ము మఱచి. 39

కనులె కాయమ్ముగాఁ దను గాంచుచున్న
కాముకునిజూపు వెలిఁగ్రక్కు కల్మషమును
గాంచఁగల్గినమాలిని, క్రమ్ముఁజెమట,
ఏడ్కఁ నొడలెల్ల దడదడ, జడిసి, తెల్ల 40

పాఱ వదనమ్ము, నివ్వెఱపాటుదోఁపఁ
బతులఁ జిత్తమ్ములో నిల్పి, పరమునెంచి
ప్రార్థనముఁజేసి, యేమియుఁ బాలుపోక
విధిని బలుమరు దూఱుచు వేదనపడె. 41

అట్టి యాంగికభావమ్ములన్ని యామె
మనసుతన్నందఁ దపియించు మదనవికృత
భావమేయంచు భ్రమయుచు, వలపుపొంగి
పైకి జారుచునుండ దుర్వారుఁడతఁడు 42

ఆమె చరితమ్మునంతయు నరసి, యెట్టు
లైనఁజేఁబట్టి సుఖియింప నాతురపడి,
యడిగి తెలియఁగవలసిన యంశములను
అప్పవలఁజూచి జడియక యడుగఁ దొడఁగె. 43

అక్క! తమ్ముని నిట్లు నిరాదరించు
కారణంబేమి? కంతుని కాళ్ళకడను
గట్టిపడవేయఁ గల్గిన కల్కియిద్ది
కడనెయుండియుఁ దెల్పవే! కఠినవగుచు. 44

సుందరాంగులు నా యందచందములకు
సొక్కి, పాదాలఁబడి, దయసూడుమంచు
మ్రొక్కి వేడుచునుండియుఁ జిక్కువడని
వాఁడ, నేఁదగ నేమి? యీవనితనంద. 45

కనులపండువుగా నేడుఁ గాంచఁగలిగెఁ
గాంచఁదగినట్టి రూపును గఱవుదీర
కనులునాయవి: మూడు లోకాలు దీని
కంటికొనచూపుసాలులోఁ గట్టువడును. 46

కలికికాదిది రతనాల మొలఁక; యలఁతి
పొలఁతి కాదిది పుత్తడిబొమ్మ; భువిని
బుట్టలేదిది, స్వర్లోక పుణ్యరాశి;
వచ్చె నాకయ్యె నేయిటు వసుధపైకి. 47

అళులు పరికావు కురులకుఁ; నందమైన
చందురుఁడు మోముచందమ్మునందలేఁడు;
గండుమీలకుఁ బైచేయి కన్నుదోయి;
మరునివింటికి వంపులుగఱపు బొమలు; 48

చక్కిలమ్ములు సెవులకు వెక్కరింత;
ముక్కునకుఁ దగ్గు సంపెగ; ముత్యములను
బాటిసేయవు తెల్లని పండ్లవరుస;
అపహసించుమ బగడాల యరుణిమలను 49

నధరపుటములు; సంకును నల్పమగును
గళమునకుఁబోల్పఁ; జక్రవాకములు చన్నుఁ
గవకుఁజాలని యుపమలు; కౌనుకంటి
కందరానట్టి శిల్పము; హస్తయుగము 50

బద్మకాండమ్ములను జాల పలుచఁజేయుఁ;
తొడ లనంటులఁ బడఁద్రోయుఁ; బుడమినంటఁ
గందుపదములు చిగురులకన్న మృదువు;
తరమె వర్ణింప దీని విధాతకైన. 51

చిత్తమురియాడుచున్నదీ చెలువనాదు
చేఁతఁబడకున్నఁ జిత్తానఁ జిచ్చు రేఁగుఁ,
జిన్నపుచ్చక మన్నించి చిత్తమిచ్చి
సాయపడవలెనీవె యీ సమయమందు. 52

గర్భమునఁ దాల్చి దీనినిగన్న యట్టి
కాంతయే భాగ్యవతియౌనా ? కలికి దీనిఁ
గాంచి పోషించి పెంచిన ఘనుడెవండొ?
కన్యయోకాక, యన్యుని కరములందుఁ 53

బెట్టఁబడినట్టి కాంతయో ? యిట్టులిందు
వచ్చి నీచెంతనుండఁ గావలసినట్టి
కారణంబేమొ ? తెలిపి సంకటముమాపి
సౌఖ్యమునఁదేల్పఁ దమ్ముని జాలిఁగనుము. 54

అనెడు సోదరు పల్కుల నాలకించి
యదరి విరటునిసతి చాల బెదరి వాని
మనసు నెటులైన సరిదిద్ది మందలించి
పంపు యత్నాలలోఁబడి పలికెనిట్లు--- 55

నవ్వనా! యేడ్వనా ! కాక నొవ్వనాడి
పంపనా నిన్నుఁ దమ్ముఁడా! పరువుమాయఁ
బల్కుచుంటివి యెన్నఁడుఁ బడుచులఁగని
యెఱుఁగనట్టుల, మతిసెడి యిట్టిపగిది. 56

మాన్యుఁడౌ మత్స్యభూపాలు మఱఁది, సింహ
బలుఁడు గీచకుఁడొక దాసిపైని మనసు
పారవిడిచెనటన్న, విశ్వమ్ములోని
వారు మఱియింతురానిన్ను దూఱకుండ. 57

మాటఁబంపినవత్తురు, సాటిలేని
సుందరులు వీరు గనుసన్నలంది వలఁచి
నట్టి సుఖమిచ్చి తనుప హేయమ్ము నీచ
కులజపొందునుగోర సద్గుణుల కెందు. 58

మగలుగంధర్వులేవ్వరు మగువనంటి
కానఁబడకుండనెప్పుఁడు గాఁచుచుందు
రంట! కన్నియకాదు, నీవంటఁదగని
పత్ని యియ్యది; తెలిపి పాపానఁబడకు. 59

మాటమంతిని విడనాడి మాఁటుమణఁగి,
పరులకంటను బడరాని పట్టుఁజొచ్చి,
మగలు గనుగొన్న మానంబు మంటగలియు
ననెడి భయమున బెదరెదు నతివపొందుఁ 60

బడసి నీవంటిరసికుఁడు వడయఁగల్గు
సౌఖ్యమది యెద్దియును లేదు: సాహసించి
పాడువడకుము - మేలెంచి పలుకునన్ను
నాదరింపుము, పొమ్ము మర్యాదపెడక 61

బధిరునకు శంఖమూదినసగిఁది నామె
మంచిమాటలు ప్రబల కామానఁబడిన
వాని చెవికెక్కకుండిన వాఁడు మరల
మందుఁడై పల్కెనిట్టుల మానమువిడి. 62

ఐదుగురుకారు, నాపైకి నైదుకోట్లు
గలిసివచ్చినఁ జెండాడఁగలను, నాదు
బలము బాగుగనెఱిఁగియుఁ బలుచచేసి
పలుకుచుంటివి సుంతయుఁ దెలివిలేక. 63

మగలు గంధర్వులేయైన మగువయిద్ది
హీనకులజాతయౌనెట్లు; లేనిపోని
వంకలనుదిద్ది యుత్తమవంశురాలి
పరువుఁజెఱపకు, నా తెల్విపాయలేదు. 64

పాదములనంటివేఁడెదఁ, బ్రాణములను
బాపికొందును దీనిని బడయ లేని
పక్షమందున; పాల్గొన్నిపడియు వెనుక
మడిసిపోయిన తమ్ముని బడయలేవు. 65

దినము గడువిచ్చి వెడలెద; మనసుఁ జక్కఁ
బఱచికొని దీని నెటులైన వశ్యపఱచి
పంపవలె నాదుకడ, విషపాత్రనంది
కాచియుందునటంచును గరుణకురియఁ 66

బలుకు నాతని దైన్యభావమ్ముఁ గాంచి
గుండెనీరయి, తీర్తు నీకోర్కెనెట్లొ
పొమ్మటంచును నోదార్చి తమ్ముఁబంపె
నక్క, వెలిఁబడు మార్గ మన్యంబుఁగనక. 67

అందుకొనలేని ఫలమును నందినట్టు
లగ్రజకు మ్రొక్కి యమిత మోదాత్ముఁడగుచు
నరిగి, నిజమందిరమ్ము ననంగు కేళి
కనువుగాఁ దిద్దితీరిచి, యందమైనఁ 68

బసిడి మంచంబుపైఁ బట్టుపాన్పు పఱచి,
విరుల వెదచల్లి, జలతారు తెరలఁగట్టి,
యద్దములనిల్పి యందందు ముద్దులొలుకు
వర్ణచిత్రాలతోఁ గెంపుపానకముల 69

నింపి చషకమ్ములను, బోవఁబంపి యచటి
వారిఁ బనులను గల్పించి, ద్వారమొకటి
తప్పఁ దక్కిన తలుపులఁ దన్నిమూసి,
రత్నదీపాలు వెలిగించి, రాత్రియట్లు 70

మార్చి పగటిని, సొంబగునుగూర్చు వస్త్ర
ములను నగలను ధరియించి, ముదముపొంగి
మధురభావాలు చిగురింప మనసులోన,
వాకిలినిఁగాచె నాతస్విరాకకయ్యు. 71

ఇట, సుదేష్ణయుఁ దమ్మునికిచ్చినట్టి
తనదు పల్కును నిలుప మాలినినిఁ బిల్చి,
దప్పినటియించి, మదిరపాత్రమ్మునిచ్చి,
యనుజు మందిరమునకేగి యతని నడిఁగి 72

మంచి మధువును గొని చక్కమఅలుమంచుఁ
జనవుతోఁ బల్కెః నెత్తిపైఁ జదలుచీలి
పడినయట్టుల, వదనగహ్వరమునిచ్చి
మన్ను లోఁగొనినట్టులఁ దన్నుఁ, గనులు 73

దిరిగి మైకముఁబైఁగొన, దిక్కుతోఁప
కుండ, గుండియ లదరంగఁ గ్రుంగికుమిలి
గద్గదికతోఁప, నాసాధ్వి కనులనీరు
క్రమ్మ, నొందులఁ బంపుమోయమ్మ! కల్లుఁ 74

దెచ్చుపనికిని నేఁజెల్ల; తెలిపినాను
కాద తొలుదొల్తనే నీచకార్యములకుఁ
దగను నేనంచు ననిచెప్పి తప్పుకొనఁగ
యత్న మొనరించె విరటు నిల్లాలు, నాకు 75

జాల ప్రియుమైనదాని నాసవముఁదెచ్చు
పనికిఁ బరిచారికలఁబంపు మనసులేక
నీకుఁజెప్పితి, నరయుక నీచకార్య
మద్దియంచును బలుక నోరాడెనెట్లు. 76

పొల్లుమాటయునన నిన్నుఁ, బూలలోనఁ
బెట్టి పోషించుచుంటిని, బెద్దఁజేసి
పలికెదను నీదు గుణములఁ బదుగురకును
పొడియా నీకు నన్నిట్లు పరిభవింప, 77

వనుచు మదిదాఁకునటువల్కెఁ నప్పటికినిఁ
కాదు పొమ్మనవేరక, కదలిపోయె
విధిని దూఱుచు మాలిని, వెడలుచున్న
విధము నెఱుఁగక, మరఁద్రిప్పి విడిచినట్టు. 78

తన్నుఁదాఁకగ నెవ్వాని తరమటంచు,
ధైర్యమునుగొని, దైవముఁదలఁచి, మ్రొక్కి
తరణికిని సాయపడఁ, బులిదాఁగియున్న
పొదరుఁజొచ్చెడు లేడినిబోలె, ఖలుని 79

సదనమునుజొచ్చి, యప్ప యాసవముఁదేరఁ
బంపెనన్నంచుఁబల్కినఁ, బాపి యతఁడు
గలశమును నందుకొనురీతిఁ గరముఁబట్టి
యీడ్చె, నట్టులె నా తృష్ణ నింతతీర్చి 80

మఱలుదువుకానియంచు; నమ్మగువయలిఁగి
మఱచిసర్వస్వమును, మహామారియనఁగ
మారి మంటలుగ్రక్కి దుర్మార్గుచేఁతి
పట్టువిదిలించుకొని, మానభంగమునకు 81

వెఱచి, చాటునమాఁటును విడిచి, గుట్టు
బయలుపడునంచునెంచక, పతులముందుఁ
బడుటయేయట్టిపట్టున భావ్యమంచుఁ
దెగిఁచి విరటుఁడు గొల్వున్నదిక్కుఁజూచి 82

పరుగుఁవెట్టినఁ జరచర, వాఁడువిడక
తఱిమి యామెను వెన్నంటితాఁకి కొప్పుఁ
బట్టి; భానుఁడుపంపిన బంటువానిఁ
బట్టి భువిపైనఁద్రోసెఁ గన్పడనియట్లు. 83

సభమనున్నట్టి పెద్దలాసంఘటనను
జకితులైచూడ, నృపునియాసనముగదల,
వలలుఁడలిఁగిన వదిచూచి వ్యంగ్యముగను
పలికి కంకుఁడువారింపఁ, బరిభవింపఁ 84

బడినమాలిని, కపిఁగొన్నపాముపోలె
వొడలఁగ్రమ్మినదుమ్ముతో, మబ్బునరము
వేడివిట్టూర్పు గాడ్పులువెడల, ఫాల
మందుఁజెదరిన యలకలల్లాడ, శోక 85

బాష్పములురాలఁ గన్నులఁ బట్టుతప్పి,
పడెను సభలోన నందునొక్కఁడును మగువఁ
బట్టియాడ్చిన పాపినిబట్టి తగిన
పగిది శిక్షింపకుండినఁ బరుషముగను. 86

ధర్మమూర్తులు, ధన్యులు, దర్పవంతు
లమరియున్నట్టి పేరోలగమున, వాఁడు
దాని మానమ్ము రక్షింపఁదగిన నీతి
పరుఁడు లేకుంటచిత్రము, పరువుచేఁటు. 87

విందుగద్దియపైని గూర్చుండినప్పుఁడు
కమలపందుగగాఁ బరకాంత యగదు
పాటఁగదలక కనుచున్నఁ బరులయాండ్రు
పరిభవమ్మునునందక బ్రతుకుటెట్లు ? 88

అంచు నందఱుఁదెగనాడి, యబలకెందు
వెంతవడియును సభలోన నంతతడవు
నిలిచి నాట్యంబుఁజూపెడు వెలఁతవలెను
బరుషవాక్యమ్ములను బల్కఁబాడికాద 89

టన్నకంకునిఁ,'బలియెట్లో వల్లెపలియు;
పటకుఁడాతఁడు విక్కము, నాట్యకత్తె
వొదువేసట్లు; జూదరియాలికెట్లు
గరువతనమబ్బునంచును' దిరుఁగఁద్రిప్పి, 90

మనసులో మందుమంటలఁ గనులనుండి
కొంత, వదనమ్ము వెడలించికొంత బయటఁ
గ్రక్కి, యొకకొంత కోల్కొనఁగల్గి, నిజని
వాసమునఁజేరె నాపెనిపనులఁజూడ. 91

పరిభవించినవాఁడింక బ్రతికియుండఁ
బాన్పుపైఁబండి నిద్రింపవలనుగాక,
వానిఁదెగటార్చుటెట్లని లోనవెంచి
పగను బెంచుచునుండె నాపడతివిడక. 92

ధర్మజుండెందులకుఁగాఁడు; ధన్వియర్జు
నుఁడును దొందరగావశ్యపడఁడు; కవలు
సింహబలునికిఁజాలరు, చేఁతికందు
వాఁడు భీముండె తగునట్టిపనుల కెల్ల. 93

చల్లఁగా స్నానమొనరించి, నల్లనైన
చీరమెయిఁగట్టి కురులను జిక్కుఁదీసి
దువ్విముడివెట్టి, విరులనుదుఱిమి, తిద్ది
తిలకమునుజక్కఁ, భీముమందిరముఁజొచ్చి 94

యర్ధరాత్రమ్ముగాఁజూచి, యతనిలేఁపి--
పాపినన్నంటియింకను వసుధపైనఁ
జెక్కుజెదరక మనియుండఁ, జింతవిడిచి
భీమసేనుఁడు నిదురించు విధముచాల 95

చిత్రమనిపించు, నీయన్న చిత్తవృత్తి
తెలిచెనానిన్ను ! వంటింటగరిటఁబట్టి
కరము గదనందమఱచెనా? కాక నేనె
కాకపోయితినానీకు ? కర్మయేమొ! 96

అర్జునుఁడు గార్ముకముమఁజేనంది మత్స్య
యంత్రమునునేసి దనతోఁడనైదుగురకు
నన్నుఁ బత్నినిగాఁజేయు నాటినుండి
క్షణము సుఖపడియెఱుఁగను; కష్టములకె 97

కలిగినానేమొభువిని; నగ్రజుఁడుజూద
మాడియోడిన, నొకపాపి యకట! వలువ
లూఁడ్చె సభకీడ్చి క్రూరుఁడై, యోర్వలేక
నడచియడవుల నిడుమలఁబడితిఁబదియు 98

రెండువత్సరములపాటు; మొండిబ్రతుకు
బ్రతుకుచుంటిని చాఁకిరిపనులు సేయు
దాసినై నేఁడు; చేయిగంధమ్ము నూఱి
కాయగాచెనుజూడు! దుష్కాలచేష్ట 99

అంచు సహియించియుంటి, నన్యాయముగను
మానమంగడిలోఁబడ, మనఁగరోసి
వచ్చితిని జెప్పిపోవఁగ, నొచ్చుకొనకు
నిద్రఁజెడిపితినని; యింకనేనరిగెద. 100

గోయియో, నూయియో చూచుకొందునంచుఁ
గరుణఁగురియించి, పాంచాలి కదలనుండ---
వాయుసూనుఁడు వారించి, వానినపుడె
పదుగురునుజూడ సభలోనఁ బట్టిచీల్చి 101

యుందు, నన్నయ్యవలదనె ముందుముందు
దానఁగలిఁగెడు ముప్పునుదలఁచి, యయ్యు
నీదుప్రాణమ్ములనుమించి యేదిలేదు
నాకునిద్దరఁ, దెగియింపఁబోకు, నిన్ను 102

పరిభవించినపాపి నీపాదములను
వెచెదను ముద్దగాఁజేసి, వసుధనున్న,
నాకముననున్న, నరకాననక్కియున్న
వనధిలోనున్న, పాతాళముననున్న--- 103

వలఁపునటియించి లోఁగొని వానిఁబంప
వలయు రేపటిరాఁతిరి, తెలియజెప్పి
కాలమును నాట్యశాలకుఁ జాలు, వాని
పనిముగింతును సన్న లేర్పడనియట్లు, 104

శాంతిఁగొనుమంచు నోదార్చి సాఁగనంప
నామెయునుజని, యెప్పటియట్లఁబండి,
తెల్లవాఱఁగమేల్కాంచి, యెల్లపనులు
ముగియఁగాఁజూచి, నాటకమునకునాందిఁ 105

బలుకఁదగువేళగుర్తించి, పరులకంటఁ
బడక కీచకుసంధించి, వలచినట్లు
పలికియొప్పించి, సంధింపవలయుపట్టు,
సమయమునుదెల్పి, మఱలెస్వస్థానమునకు. 106

నాఁటిరాఁతిరిగడచెను, నాట్యశాల
నడుమఁ దల కాళ్లుచేతులు గడుపులోన
దుష్టగతి దూర్చఁబడియున్న ధూర్తుమాంస
రూపమొక పెద్దముద్దగాఁ జూపరులకు 107

భయముఁగొల్పుచు బడియుండెఁ; బ్రజలు గూడి
పలుకఁదొడఁగిరి గంధర్వులలిఁగియట్లు
చిత్రవధచేసినారని సింహబలుని
పడతిఁదాఁకినపాపమ్ము పండెననఁగ. 108

పాండవులజాడఁ గనుఁగొనఁ బంపఁబడిన
గూఢచారులచెవుల నాఘోరవార్త
పడిన, దుర్యోధనాదుల పంచకరిగి
వినినవిధములనెల్ల విన్పించివారు. 109

పరులుకనరానియటుల నాప్రబలుఁడైన
సింహబలునొక్కరాత్రిలోఁ జిత్రమనఁగఁ
జంపెనొకఁడన్న లోఁలోనశంకలొదవి,
వాఁడు భీముఁడెయ్యైయుండవలయునంచుఁ 110

దలఁచి, విరటునిగొల్వున దాఁగియుండు
పాండవులఁబట్టి యజ్ఞాతవాసవ్రతముఁ
జెఱపి, యడవులకంపగామరలఁ, గర్ణ
శకుని దుర్యోధనులుగూడి, సభనుజేర్చి 111

చర్చలోఁబడియున్నట్టి సమయమున త్రి
గర్త దేశాధిపతి బూర్వకలహమొందు
కలిగి విరటునితోఁ జేయఁగలుపవచ్చె,
వహ్నికిని సాయఁపడవచ్చు వాయువనఁగ. 112

ప్రతిఘటింపఁగఁ గీచకాగ్రజుఁడులేఁడు,
పగతువిరటునిఁబైఁబడవచ్చు, గుర్తు
పట్టి పాండుతనూజుల వనికినంప
వచ్చు, నొకదెబ్బతో రెండుఫలములంద 113

వచ్చునంచును, నిశ్చితభావమంది
బలసమన్వితులై మత్స్యపాలుఁబసుల
దక్షిణోత్తరదిశలను దాఁకి యేక
కాలమునఁబట్ట పమకట్టి కదలినారు. 114

కడఁగి నిష్కారణముగఁ, ద్రిగర్తపతి సు
శర్మ దక్షిణమునఁ బశుసంచయమును
బట్టినాఁడనువార్త యున్నట్టులుండి
చిత్తమాగఁగ విరటుని చెవులఁబడెను. 115

మాద్రితనయులు, భీమధర్మజులుఁ గదన
మునకు మేమును జాలుదుమనుచుఁదెలిపి
బయలుదేఱగఁ సాయుధపాణులగుచు,
వల్లెయనిచెప్పి సంగ్రామవార్తచాటి 116

పట్టణమ్మున, సైనికబలముఁగూర్చి,
కవచములఁ గత్తులను గార్ముకములనిచ్చి,
యశ్వములు భద్రగజములు వరదములును
గదల శంఖారవాలతో, క్షాత్రతేజుఁ 117

డగుచు విరటుఁడు, రథమెక్కి యరిగి, యుద్ధ
రంగమునఁబడి, యరులను భంగపఱచి
తఱుమఁ దఱుముచు శరపరంపరలవడిగఁ
బోరఁదొడఁగెను వీరముప్పొంగిపార. 118

పశుగణమ్ములరక్షింపఁ బాండుసుతులు
పరులఁదెగ వేయుచునె పైనిఁబడుచునుండఁ
గని, సుశర్మయుఁ దరుణంబుఁగాంచి విరటు
తేరిపైదూకి పట్టి బంధించినాఁడు. 119

భీముఁడాదృశ్యమునుగాంచి, భీష్ముఁడగుచుఁ
జని సుశర్మను సిగఁబట్టి స్యందనమ్ము
నుండి యీడిచిపడఁద్రోయ, గుండెలదరి
వాఁడు మూర్ఛిల్లె; నంతట, వానిపైని 120

కులును జెదరిరి పశుగణములనువదలి;
బంధముక్తుఁడుగా మత్స్యపాలకుండు
భీము కృపచేత, వైరులవెడలఁద్రోలి
విజయముననంది, పసుల గోవిందులకడ 121

వదలి భద్రమ్మటంచును, బహుమతులను
బంచి పెలవంది, జయజయధ్వానమెసఁగ,
సైన్యకోలాహలముమించ, సంతసమున
రాజధానికిమరలె విరాగుఁడగుచు. 122

రాజు దక్షిణసంగ్రామరంగమందు
నుండఁ గౌరవవాహిని యుత్తరమునఁ
బశుగణంబులఁబట్టినవార్త జేఁదు
లేనినగరాన వినఁబడె మానినులకు. 123

చాలపసివాఁడు, విరటుని చనవుపట్టి
యుత్తరుఁడు, నొక్క పేఁడియు నువిదలు నట
నుండిరప్పుడు, పోరఁగానోపు వీరుఁ
డొక్కఁడును లేమి వీడనిజిక్కుతగిలె. 124

నాకుఁదగినట్టు లరదమునడుపువాఁడు
గలిగెనేనియు, నేఁబోయి కౌరవులను
పాఱఁద్రోలుదుననిఁ పసివాఁడెయయ్యు
ముందువడె నుత్తరుఁడు, వింటినందుకొనుచు. 125

మనబృహన్నల సారథ్యమునకుఁదగున
టంచు మాలిని తోనున్న యబలలకును
విన్నవించెను, దమ్మాదుకొన్ననృపుని
మానమునుగావ వాఁడూరలేనియపుడు. 126

నాకుసారథి పేఁడియా! నవ్విపోరె
ప్రజలునన్నుఁజూచి, కౌరవబలముగాంచి
పరిహసింపదె! హాస్యమ్ము వలదటంచు
రాజపుత్త్రుఁడుపలికె నైరాశ్యముగను. 127

పేఁడియో, గీడియో వాదులాడుచున్న
మత్స్యసామ్రాజ్య మహిమయే మంటఁగలియుఁ;
గానఁ ద్వరపడుమంచును గొంతలెల్లఁ
దఱుమ నబ్బాలకుఁడు నరదమ్ము నెక్కె. 128

పొరలు పొరలుగఁ దరగలు నురువుఁగ్రక్కి
దరిని నొఱయుచుఁ జెలలాడి యఱచుచుండ,
నతి భయంకర విలయకాలాబ్ధి యనఁగఁ
గౌరవానీకమది ముందుఁ గానుపింపఁ, 129

గాంచి, నిలువెల్లఁజల్లఁగఁ, గరముల్రదువఁ,
గార్ముకముజాఱ, గుండియ కరఁగిపార,
చెమ్మటలుగ్రమ్మఁ జిత్తముఁ జెదర, దూఁకి
రథముపైనుండి క్రిందికి రయముమీర 130

పరుగులిడు నుత్తరునినంటి పట్టితెచ్చి
యరదముననిల్పి, పగ్గాలనందియిచ్చి,
యర్జునుఁడు దానటన్న సత్యమునుదెల్పి
యభయమునుగొల్పి సారథ్యమందఁ జెప్పి, 131

అతిరయమ్మున రథమును నర్జునుండు
పరువులెత్తించి, శస్త్రాలఁబదిలపఱచి
నట్టియెడ నిల్పి, గాండీవమంది, ముందు
వడెను గౌరవులున్నట్టి పట్టుజేరి 132

క్షాత్రముప్పొంగ చేతి శంఖమ్ము నూది,
యాశలల్లాడ, ద్రోణభీష్మాది ఘనుల
గౌరవింపఁగఁదగు విశిఖముల వదలి
వారిపాదాలనంట, శాపమ్ము తొలఁగ 133

నర్జునుండయి, తొలిరూపునంది, గాండి
వమునుఁ జేఁబట్టి, తూఁపులఁ బట్టిపట్టి
తఱిమి, పగతుల శిరములఁ దఱుగఁ దొడఁగె
నర్జునుఁడు వీరమూర్తియై యతిశయించి. 134

గడువు ముగియని యజ్ఞాతకాలమందుఁ
గంటఁబడె నర్జునుఁడుగానఁ, గానకరుగ
వలయు మరల నటంచును దెలివిలేక
యఱచెఁ దుర్యోధనుఁడు జయమందినట్లు. 135

పోరఁగలవేని బోరుము పొల్లుమాట
పలికి తప్పించుకొనఁజూడవలదు, వత్స
రమ్ము నిన్నటితో నిండెఁ బొమ్మటంచు
వాని ఖండించి భీష్ముఁడు పలికె, నంత 136

పోరు దప్పనిదై సాఁగె, బొందిపైనిఁ
బొందిపడుచుండె, గాండీవిముందు నాఁడు
ప్రబల వీరుల సామర్థ్యభావమెల్లఁ
బలుచఁబడిపోవుచుండె నిష్ఫలములౌచు. 137

ఓడె కర్ణుఁడు, కృపుఁడుననోడె, ఘనుఁడు
ద్రోణుఁడును గాయపడిపోయె, వానికొడుకు
పోరి వెనుఁబడె, భీష్ముని పొంకముడిఁగెఁ
బుందువడిపాఱె దుర్యోధనుండు; బెదరి 138

దండనాయకులే యట్లు భండనమ్ముఁ
జేయనేరక వెనుదీయు, చెదరిపరుఁగుఁ
దీసె గౌరవసైన్యము, దిక్కుదోఁచ
నట్లు, పట్టిన పశువుల నందెవిడిచి. 139

అంతటికి మున్నె విజయమ్మునంది రాజ
ధానిఁజేరిన విరటుఁ, డుత్తరుఁడు యుద్ధ
రంగమునకేగెనన విని బెంగఁగొనెను
బ్రాణములతోడఁ దనుఁజూడ రాఁడటంచు. 140

పరుఁగు పరుఁగున గోపాలురరుగుదెంచి,
పాఱి కౌరవవాహిని పశుగణమ్ముఁ
దక్కొనమువార్తఁ దెల్పిరి, ధరణికాంతు
వగలఁబోకార్చి, మోదభావమ్ముఁగూర్చి. 141

పేఁడి సారథిగాఁ, బసివాఁడు వెడలి
ప్రబల కురుసైన్యబలమును బారఁద్రోలి
పసులఁగాఁపాడెనఁట, గంకభట్టు నాదు
భాగ్యమేభాగ్యమందు నీ భావమేమొ?, 142

యనుచు విరటుఁడు ధర్మజు నడుగుచుండఁ,
బరమ సంతోషభరితుఁ డుత్తరుఁడు వచ్చి
తండ్రికినిజెప్పి సమర వృత్తాంతమెల్ల
నర్జునునిఁజూపె వీఁడె బృహన్నలయని; 143

పొంగు పల్లారఁ, దన్నంత ప్రొద్దు తమదు
పత్నితోఁ గొల్చుచుండినవారు పంచ
పాండవులెయను సత్యమ్ము బయలుపడిన
మత్స్యపతి ధర్మజునికి నమస్కరించె. 144

అంతలోపలశ్రీకృష్ణుఁ డరుగుదెంచె
నటకు నభిమన్యుఁదోడ్కొని, యూసఁజేసి
ధర్మజుని, వాని తమ్ముల ధర్మపత్ని
ద్రౌపదినిజూచి కుశలవార్తలను నరయు. 145

అర్జునుని పట్టి యభిమన్యు నందముఁగని
మరులలోఁబడె నుత్తర, విరటునిసుత;
పాండవులతోడి మైత్రిని బదిలపఱచ
వారి పెండిలి చాల తోడ్పడునటంచు 146

మత్స్యవిభుఁడును ధర్మజు మనసునడిగి
చూచి శుభలగ్న వేళను సుతనుఁకూర్మి
నిచ్చె నర్జునపట్టికి, మెచ్చి యెల్ల
వారు దీవింప, సంతోషభరితులగుచు. 147

బ్రాహ్మణులు, నాప్తమిత్రులు, బంధువులును,
ప్రభువులును బౌరులునుగూడఁ, బ్రజ్వరిల్లెఁ
బరిణయోత్సాహ దివ్యశోభలనుబడసి
స్వర్గమట్టుల విరటుని పట్టణమ్ము 148

పట్టుపడకుండ నజ్ఞాతవాసమునటు
గడుపసాంతముగా సాయఁపడిన పుడమి
పతికి మఱవక తమకృతజ్ఞతను దెలిపి
భావి నూహింపఁ దొడఁగిరి పాండుసుతులు. 149

సమాప్తము

# ఉద్యోగపర్వము

అంత, నభిమన్యు పెండిలికయ్యు విరటు
పట్టణమ్మున కరుదెంచినట్టి యాప్త
బంధుమిత్రులు సభఁజేసి పాండవులకు
న్యాయమొనరింపనెంచి ప్రయత్నిపడిరి. 1

సభను, బలరామకృష్ణులు, సాత్యకియును
మత్స్య పాంచాల పతులును మతులు గలిపి
చర్చఁజేయదొడంగిరి చక్కఁబఱుప
మందమతులను ధృతరాష్ట్ర నందనులను. 2

పలుకు పలుకును నములుచు, భావమెల్ల
వ్యక్తపడునట్లు వివరించి స్పష్టముగను
బలికె నిట్టుల వసుదేవుపట్టి వీర
పూరుషులజూచి ప్రజ్ఞాపపూర్ణుఁడగుచు. 3

ధర్మనందను మాయజూదమున దించి,
రాజ్యమునుఁదోఁచి కీటకారణ్యములకు
ధార్తరాష్ట్రులు పంపినవార్త యిచటి
వారికెల్లను దెలియని వార్తకాదు. 4

కట్టుపడి నోటిమాటకుఁ గాంతతోడఁ
బంచపాండవులును వనవాసమందు
మనిరి కష్టాలనోరిచి మనసుఁగట్టి
పదియురెండేండ్లకాలము పట్టుపెడక. 5

అవల నజ్ఞాతవాసమ్ము నరుగఁబుచ్చి
నారు విరటుని కొల్వునఁ గోరినట్లు
కొలిచి తలవంచి పరులకుఁ దెలియఁబడని
భంగి జూదాన నోడిన పాపమునకు. 6

ఒప్పిచెప్పిన పల్కును దప్పనట్లు
అమలుపఱచిరి; యిటపైట నర్థులౌదు
రన్నివిధములఁ బైతృకమైన రాజ్య
భాగమునుబొంద వాదాడ వలనుకాదు. 7

రాజ్యమిప్పింపఁదగిన మార్గములు రెండు
గలవు - సంధియు సమరమ్ముఁ; దలఁచి తేల్చ
వలయు నొకదాని మనము సత్వరమె, కాల
యాపనముఁజేయఁ జెడును కార్యమ్ము లెల్ల. 8

ధార్తరాష్ట్రుఁడు మూర్ఖుఁడు; మూర్తిఁగొన్న
స్వార్థరూపుఁడు; సంధికి సమ్మతించి
రాఁడు; ధర్మజుఁడును సమరమ్ముఁజేయ
మనసుఁజూపఁడు - క్లిష్టసమస్యయిద్ది. 9

మండిపడుచుండె భీమసేనుండు; విజయు
డుండె గాండీవయుక్తుఁడై; రెండు సెవుల
విచ్చి వినుచుండ్రి కవలలు; వేగిరపడి
వియ్యమో, కయ్యమో, తేల్చి విడువవలయు. 10

దూతనొక్కనిబంపి యా ధూర్తులకడ
న్యాయముగ నీయవలయు రాజ్యమ్ము నీయ
వలయు నందము; వారలొప్పని విధాన
కలదు మనశక్తి యుద్ధరంగమ్ము కలదు. 11

అనుజుఁడటువల్క వినిన హలాయుధుండు
సంధిసూచనలకుఁ జాల సంతసించి
నట్లు; చక్కని యోచన! యర్హునొకని
వారికడఁబంపుటెంతయు భావ్యమిపుడు. 12

కన, జయాపజయమ్ములు గలుగుచుండుఁ
గదనమున; నేది యెవ్వరి కొదవునంచు
నిర్ణయించుట కష్టము - నిఖిల రాజ్య
భాగ్యమును నోడవచ్చు; గెల్వంగవచ్చు. 13

అంతయో యింతయో చేఁతికందఁగలదు
సమరసంబున సంధి యోచనలు సేసి
సమరమునుమాన్పఁ; బరుల నిష్కారణముగఁ
దిట్టి సాధించునదిలేదు; తెగువ తగదు. 14

పాచికలనాడఁ బిలిచినఁ బాండుసుతుఁడు
సమ్మతించెను; సభయెల్ల సాక్షికాగ
శకుని విజయమ్ము నందెను; సంశయింపఁ
దగిన పనియేమి? దీన నధర్మ మేమి? 15

అరయ ధర్మతనూజుని దగును దప్పు;
తడవ పనిలేదు దానిని విడువు, డింక
నైనఁ దెలివంది సంధి కార్యమును జెడక
నిర్వహింపుఁడు నీతితో నేర్పుమీర. 16

నేటి దుర్యోధనుఁడు కాడు నాఁటివాఁడు
గద్దెపైఁ జక్కనెలకొని కదలనట్లు
వాటుకొనియున్న రారాజు; పాటిసేయ
వలయు నాపల్కు దూతను బంపుముందు. 17

ధర్మముల నెత్తిచూపఁగఁ దగదు; తెగడి
పలుకనేరాదు; చనువుతోఁ బక్వముగను
వాని దారికిఁదేవలె, లేనిపోని
తగవులను ద్రవ్విపోసిన, వగలె మిగులు. 18

పరమ శాంతస్వరూపుని, బ్రాజ్ఞు, తెలిపి
పలుకఁగలవాని, నిష్పక్షపాతు, వినయ
శీలు, నావేశరహితు, విశాలు నొకనిఁ
దీర్చిపంపిన సంధి సిద్ధించుననెను. 19

అన్న బలరాముఁడటు వల్క నమ్ములొకటఁ
దన్ను గ్రుచ్చినయట్లు సంతాపపడుచు
సైచఁగాలేని సాత్యకి శాంతిఁదప్పి
పలికెనిట్టుల పాండవపక్షమూని. 20

ఒక్క వంశానఁబుట్టియు నొకరి నొకరు
మేము పోలము, కన బలరామునట్లు
బాండవులఁ దిట్టి పలికెడు పాపబుద్ధి
పట్టువడలేదు నాకింతవఱకు వినుఁడు. 21

ధార్తరాష్ట్రులు పుణ్యు లుదారులంట!
పాండుపుత్రులదేయఁట పాపమెల్ల!
నలుగుఱును నవ్విపోదురు; పలికినంతఁ
బలుకవలె నర్థవంతమై, పదరరాదు. 22

స్వస్థపడికొంత, యిందురప్రస్థమందు
ప్రజల సౌఖ్యమె తనకు సర్వస్వమంచు
భావనముచేసి పాలించు వానిఁబిలిచి
మంటఁగలిపిరి మూర్ఖు లమానుషులయి. 23

వలదు, తగదన్న నిర్బంధపఱచి, యెత్తి
పొడిచి పలుమార్లు పట్టును విడువకుండ
పాఁచికల నాడరమ్మని పదుగురువిన
పాటి రాజన్యుఁడొక్కఁడు సభనుండి 24

పిలువఁగా రాజమర్యాద తెలిసినట్టి
వాఁడు కాదనఁగలఁడెట్లు? ప్రాణములకు
పైని మానమ్ము విడువగారాని సొమ్ము
ధరణిపతులకునన్న సత్యమ్ము మఱచి. 25

కావనే, ధర్మజుండును గడఁగినాఁడు
కాని జూదమ్మునకును, మార్గమ్ము వేఱు
కనక విడివడ, లోఁలోనఁ గష్టపడుచుఁ
దైవమునునమ్మి విధివ్రాఁత తప్పదంచు. 26

ఎందు నెవ్వరు, నింతకుముందు కనియు
విని యెఱుంగని క్రొంగ్రొత్త విధముఁజూపి
సాఁగె నా వింతజూదము; శకునిచేఁతి
పాఁచికలు గన్నులమగప్పి పాఱుచుండ. 27

వస్తువుల నంచవచ్చును, వాహనముల
పణమముగాఁ గొనవచ్చు, సంపదలనెల్ల
బందెమిడవచ్చు, నాడెడువాని, వాని
దమ్ములను, బత్ని నొడ్డ నే ధర్మమొప్పు? 28

వంచకులగూడి, ద్రోహమూహించి, మాయ
మర్మమును సుంతకనని యమాయకుని గు
ణమ్ముఁ జక్కఁగ గుర్తించి నాశనమ్ము
నర్పఁబన్నిన మంచి పన్నాగమద్ది 29

యన్న సూక్ష్మమ్ముఁ దెలిసి మాయన్న పలికి
యున్న సంతోషపడియుందు; నున్న తెఱఁగు
మఱుఁగఁ బల్కిన కతననే మాఱుపలుక
వలసె నాకిట్లు నగ్రజుఁ బలుచఁజేసి. 30

ధర్మమునువీడి, న్యాయమ్ము ధారపోసి,
దైన్యమునుగొని, తగుతులాదండమందుఁ
బల్కులనుదూఁచి, నచ్చఁగఁబల్కి, రెండు
కరములను సాఁచి యడిగి భిక్షమ్ము బఁరుల 31

పంచఁగొనునట్టి దుష్ట దౌర్భాగ్యదశకుఁ
బాండవులు జాఱిపడలేదు; పౌరుషమ్ము
పండి నిలువెల్లనిండిన వారిచేఁతి
కార్ముకమ్ములె కొనఁగల్గు క్ష్మాతలమును. 32

ఇయ్యఁదగినట్టి రాజ్యమ్మునీయ నిప్వ
డీయఁగొనిరేని శుభమగు: నీయకున్న
నీయఁజూతుము గయ్యాన నెదిరి వారి
కాయములఁగ్రుచ్చి వేధించి కష్టపెట్టి. 33

సంధి సరసులకేచెల్లు; నంధరాజ
నందనులకడఁ బొల్లగుఁ! బొందుగుదర
దెందు వీరికి వారికి, సందియమ్ము
నంద పనిలేదు మీర లావంతయైన. 34

పాండవులకయ్యు బొందిలోఁ బ్రాణమున్న
వఱకు బోరాడ వెనుకాడఁ; బాతకులను
బట్టి చీలిచి సమరానఁ బరిభవించు
దనుక నేఁగన్నుమూయ నెందాఁకనైన. 35

సాత్యకిని లోనమెచ్చి పాంచాల నృపతి
ఘనుఁడు ద్రుపదుఁడు, నిశ్చితకంఠుఁడగుచు -
సత్యమునుబల్కె సాత్యకి, చాలదవ్వు
సంధికిని ధార్తరాష్ట్రుని స్వార్థమునకు; 36

దానిఁ గొనసాఁగనియ్యరు వాని విడక
దండ నెప్పుడు బోధించుచుండు, కర్ణ
శకుని దుశ్శాసనులు - వారు సంకుచితులు;
మంచి చెడుఁగులఁ గనని యున్మాదులరయ. 37

యత్నమొనరించి చూతమటంచు రాయ
బారి నొక్కనిఁ బంపిన, వారు పోర
వలనుకాకుండ యాచింపవచ్చిరంచు
పరిహసింతురు నీచస్వభావులగుట. 38

ఎన్నివిధముల మనము యోచించి మంచి
నెంచినను గూడఁ బోరు సిద్ధించుననుట
రూఢి; లోకులు మనల దూఱుదురు సంధి
యత్నములముందు దిగిన కయ్యమ్మునకును. 39

అగుట దుష్టగణమ్ముల యర్థహీన
భావనలఁ బాటిసేయక ప్రాజ్ఞునొకనిఁ
బంపిచూతము; దాన విశ్వమ్ము మోద
మందు; నావల యుద్ధకార్యమ్ముఁ దొడఁగు 40

వనియెఁ; నటు చేయఁదగునని యందఱునట
సమ్మతినిదెల్పి యరిగిరి; సమరమెటును
దప్పదనినమ్మి విరటుఁడు దగు ప్రయత్న
ములకుఁ బూనెను నిజ బలములనుజేర్చి. 41

యుద్ధమొనరింప సర్వసన్నద్ధులగుచు
యోధులను గూర్చి తీర్చి సాయుధులఁజేసి
తక్షణమె రాజధానికిఁ దరలిరండ
టంచు సామంతనృపులఁ బిల్పించెనతఁడు. 42

పాండవుల పక్షమున, నుపప్లావ్యపుర వి
శాల భూములఁ దగు గుడారాలనెత్తి
విడిసెఁ జతురంగబలములు వివిధదేశ
దళపతులు దెచ్చి నిలుప సదర్పులగుచు. 43

మాగధుల, సాత్వతుల, చేది మత్స్యపాండ్య
ప్రబలవాహిని, పాంచాల రాజ్య సైన్య
బలముతోఁగూడి నేత్రోత్సవమ్ముఁజేసె
శస్త్రసాధనలందు నుత్సాహగరిమ. 44

ఇచటి సన్నాహములసడి యచట కరిపు
రమున నున్నట్టి ఖలు ధార్తరాష్ట్ర చెవులఁ
బడినయట్టులఁ, దగుమైన పట్టుఁచూచి
తన బలమ్ములఁ గూర్చె నాతండుకూడ. 45

భోజ భూరిశ్రవులును, గాంభోజకేక
యులును, యవనులు, నంధయోధులు, మహిష్మ
తులును, సైంధవులు నవంతికులును వాని
పంపు మన్నించివచ్చి కూర్పందినారు. 46

ప్రబల సేనాబలమ్ము నేర్పఱచి వెంట
నడుపుకొనివచ్చె శల్యుఁడు; పుడమి యద్రువ
దండు నొకదానిగొని భగదత్తుఁడటకు
వచ్చెఁ దన్నోసఁగలుఁగు నెవ్వాఁడనంగ. 47

పాండవులలోని యేడ్గుర ప్రతిగ నిచటఁ
బదియునొక్కరు ప్రోవైరి: బలము నెంచి
చూడఁ బైచేయి వీరిదే ! చూడవలయు
కాఁచి, జయలక్ష్మి కెవ్వరు నోచినారొ! 48

ద్వారకానాథుఁగూడను బక్షముగను
బలికి తన పంచకీడ్చిన బాగటంచుఁ
దలఁచి దుర్యోధనుఁడు, వాని దండకేగె
నొక్కఁడే మంచి సమయమ్ము నొకటిఁజూచి. 49

శయనమున నున్నవాని మస్తకమువైపు
తగిన యాసనమంది యాతండు గూరు
చుండె; నప్పుడె యటకుఁ బార్థుండుకూడ
వచ్చి పాదాలకడనిల్చె వందనమిడి. 50

కన్నువిచ్చినయంత ముందున్నవానిఁ
బార్థుఁగనె వాసుదేవుఁడు, పనిపెడునని
తన్ను నెఱిగించుకొనుదాఁక, ధార్తరాష్ట్ర
మనికి నెఱుగంగలేదు పావనుఁడు వాఁడు. 51

కయ్యమే కల్గుచో నాదుకడనెయుండ
వలయు నీవని ప్రార్థింపవచ్చినాఁడఁ
బార్థునికిముందు: నీవు నావాఁడవంచుఁ
బలికె ధృతరాష్ట్రకొడుకు నేర్పరియునంగ. 52

ముందువచ్చితివీవు; నే ముందుఁజూచి
వారు విజయుని: నీకును వాని కేను
సముఁడనైతిని; కాన నిష్పక్షపాత
మతిని జూపింతు నన్ను నమ్మంగఁదగును. 53

దండనుండెదఁగాని నే భండనమునఁ
బోర నొల్లను; గోరి నన్నొందవచ్చు;
కలరు యాదవ యోధులు, వలతువేని
వారిఁ గొనవగు - నెవరు కావలయు నీకు? 54

నంచు నాతని మనసు గుర్తించినట్లు
భావికివి జేటుగల్గనిభంగి నంద
నందనుఁడు వాని నడిగెను మందహాస
మధురిమలుపూయఁ బెదవులఁ మనసు మఱుఁగ.. 55

పంచఁగూర్చుండి యొక శిలాప్రతిమ యనఁగ
బలముఁ జూపని నిన్నంద వలతునేమి ?
పడయ వాంఛింతు యోధులఁ, బంపుమంచు
మఱలె నాతఁడు హస్తినాపురముఁజేర. 56

అల్పమది సైన్యబలమె సత్యంబటంచు
పెన్నిధిని నిన్ను వలదని వెడలినాఁడు!
అట్టి దుర్బుద్ధి వానికిఁ బుట్టె నన్ను
ధన్యునొనరింపనేయని తలఁతు నేను. 57

మాధవా! నిన్ను బొందిన మనుజునకును
మర్త్యలోకమెకాదు బ్రహ్మాండభాండ
మెల్ల వశమగుఁ, బోరుట కొల్లనేని
పరసనుండుము నా రథసారథివయి 58

చాలునంచును, గృష్ణు పాదాలనంటి
పులకరింతలు నిలువెల్లఁ బూయఁమోద
బాష్పములురాల, లేచి, పోఁబంపవేడి,
యనుమతినిగొని వెడలె నర్జునుఁడుకూడ. 59

ద్రుపదు పౌరోహితుండంత దూఁతకాగ
చని మహీపతి కౌరవసార్వభౌము
సభను దగఁజొచ్చి, ధృతరాష్ట్రు చాయఁజూచి
పలికె ధర్మజుఁ డాడినపగిఁది నిట్లు. 60

వందనము తండ్రి; మేము నీ పంపునంది
వనుల వసియించి నిర్ణయించిన విధానఁ
బట్టుపడనట్టు లజ్ఞాతవాసమందు
వత్సరముఁబుచ్చి విడివడి వచ్చినాము. 61

నాడు జూదమ్మునందు మే మోడినట్టి
యర్ధరాజ్యమ్ము నియ్యఁగ ననుమతింతు
వన్న నమ్మికతో విప్రు నిన్నుజూచి
మఱల బంపితి, కరుణించి మమ్ముఁగనుము. 62

సమర మొనరింపఁదగు శక్తి చాలకుంట
సంధిఁగోరెద ననెదు సంశయము వలదు
బంధుహింసకు వెఱచు దౌర్బల్యభావ
బంధమే నన్ను నీడ్చు నీపనికిఁబూన. 63

పత్నియును సోదరులు నాప్తవరులుఁగూడి
ప్రోత్సహించుచునుండియు పోరసిద్ధ
పడుమటంచును నే నిష్టపడక నదిమి
పట్టి యుంచుచునుంటి నిర్బంధపఱచి. 64

అన్నదమ్ములలోన సఖ్యమ్ము పెఱుఁగ
వలయునంచును నేను లోనెంచువాఁడ;
మాఱుపలుకక మన్నించి మాదు కోరి
కలను నీ దూతమూలానఁ దెలియఁబఱుపు. 65

'మానసమ్ముల మథియించి, మధుర మృదుల
భావరసపూర్ణమై తేనె వాగువలెను
గర్ణపుటములఁ గాలువగట్టిపాఱు
ధర్మజుని వాణి, తనిపె నుత్తముల బుధుల.' 66

ధార్తరాష్ట్రులుకూడ నత్తఱిని బట్టు
పడలి సంధికి నొడఁబడ, సమరమందుఁ
జంపుఁదును బార్థు ననెడు నిశ్చయము చెదరు
నంచుఁ గర్ణుఁడు బెదరి శంకించిలేచి, 67

యర్ధరాజ్యము కాదొక్క యదుగు నేల
నందజేయము; పోర వెన్కాడనట్టి
వాఁడు కదుదీనుఁడై నిన్ను బంపి బేర
మాడుచున్నట్టి కారణ మరయలేను. 68

అల్పవస్తువుకాదు రాజ్యమ్మునడిగి
పొంద దానమ్ముగను వీరభోజ్యమద్ది;
పోర వైరుల నిర్జించి పొందదగిన
భూరి భాగ్యము, శూరుల పుణ్యఫలము. 69

భయద గాండీవహస్తునిఁ బార్థు, దర్ప
వంతు గదఁ జేతఁబట్టినవాని భీముఁ
బంచనిడుకొని చతురంగ బలముతోడ
వచ్చి కొనుమను బొమ్ము బాఁపండ యనెను. 70

మత్స్యమును గొట్టనేరక మఱలె; గయ్యొ
మందు గంధర్వుచేఁబడి యుగుడువడెడు
వాని దుర్యోధనుని జిత్రసేనునకును
నప్పగించెను వీని శౌర్యంబదెంత? 71

పాండవులమధ్యఁ గలఁడు పార్థుండటన్న
భావమును విస్మరించి యుబ్బంగి నితఁడు
వదరుచున్నాఁడు; దూఁతకు బదులు సెప్పి
పంపు పెత్తన మితని కెవ్వాఁడొసంగె? 72

రాజనందనుఁడా? కాక రాజబంధు
వర్గసంబంధియా? సూతవంశజుండు
పరమ పాతకుఁడితఁడు దుర్భాషలాడు
చుండఁ గూర్చుండలేను ఖండింపకుండ. 73

అండఁజేర్చెను దుర్యోధనుండు వీని
దండధరునింటి కరుగు తోడొండు వెదకి-
భండనమ్మున నామాట పండువఱకు
నంబికానందనా! సత్య మరయలేవు! 74

తప్పులన్నియు మన్నించి ధర్మజుండు
దారుఁడై నీదు తనయుల దారుణముగ
సమరమునఁ జంపనొల్లక సంధిఁగోరి
నందులకు చాల సంతసమందవలయు. 75

ఒప్పుకొను మిప్పుడే ముప్పుదప్పి పుత్ర
శతము వర్ధిల్లవలెనన్న జాగుసేయ
కుండ; వంశమ్ము మాయు పేరుండనట్లు
వలనుకాదన్న; వగఁజెంద ఫలితముండ 76

దవల నీ యిష్టమని భీష్ముఁడాడ, బెదరి
యదరి ధృతరాష్ట్రుఁ డనిపె బ్రాహ్మణుని, నేను
సత్వరమె పంపఁగలను సంజయుని ధర్మ
తనయు కడకంచుఁ దెలిపి సాదరముగాఁగ. 77

అంత సంజయుఁ బిలిచి రహస్యముగను
వంతుఁదేల్పని పల్కుల నతికి యతక
నట్టి విధముగఁ బలికి కయ్యమ్ము మాని
యాత్మజులఁగావఁగానగునన్న యర్థ 78
మిచ్చి వానిని జేఁడు వోఁబుచ్చె; నతఁడుఁ
బయనమైపోయి, మత్స్యభూపాలు రాజ
ధానిలోనున్న ధర్మజు దండఁజేరి
చెప్పె చెప్పంగలేనట్టి చిత్తమొప్ప. 79
ఆతఁడునుపల్క వినిన ధర్మాత్మజుండు
బదులుచెప్పఁగ నుంకింపఁ బార్థుడాఁపి,
యన్న! నేఁ జెప్పిపంపెద మిన్నకుండు
మంచుఁ బ్రార్థించి యోచించి పల్కెనిట్లు. 80
సంజయా! జాలిపుట్టు మా జనకుఁడిట్లు
సదమదంపడ; శతపుత్ర సహితుఁడయ్యు
సౌఖ్యపడకుండె వారిని జక్కఁబెట్టఁ
గలుగు ధైర్యమ్ము లేని దౌర్భాగ్యుఁడగుట. 81
మాదుకోర్కెల మన్నించి మమ్ముఁదనుపు
మంచి మనసుండియును సమ్మతింపనన్న
దుష్టులకులోఁగి యిటులె యస్పష్టముగను
బాలువోవక పలికి నిన్పంపియుండు. 82
కానిచోఁగయ్యమునుమాని కన్నసుతులఁ
గావుఁడని మమ్ముఁగోరుచుఁ గడకునొక్క
పలుకునైనను మాకియ్యవలయు రాజ్య
భాగమునుగూర్చి పలుకఁడా ప్రాయికముగ.? 83
వారు మేమును, వదలక సంపుచుండ
వచ్చు నిటకును నటకును వలసినన్ని
రాయబారులఁగాని యేర్పడదుసంధి
సమరమే నిత్యమగును నిస్సంశయమిది. 84

పైతృకంబైన మా రాజ్యభాగమును గ్ర
హింపకుండఁగ నింక సహించియుండ
లేము! పలుపాట్లుపడి కుందినాము నేఁటి
వఱకు హింసకుఁ బాల్పడఁ బాపమంచు, 85

సవినయమ్ముగ మాయన్న సంధిఁగోరి
బ్రాహ్మణుని బంపగా సార్వభౌముకడకుఁ
బాటిసేయక, సూతునిబట్టి పౌరు
షమును వెలిఁగ్రక్కెనఁట! బుద్ధిచాలకుండ. 86

షండులముగాము మేమెల్ల; సమరమునకు
సిద్ధపడియుంటిమని వాని సెవులకెక్కఁ
జెప్పఁబొమ్మిఁక! నాదు నిశితములైన
విశిఖములవేఁడి బూదిగావించువాని. 87

వనుల శోకాల శయ్యపైఁబండి మేము
బాధపడినట్లు దుర్యోధనాదులెల్ల
వాఁడియమ్ముల పడకపైఁబండి మరణ
మందఁదలఁచిన, మేమెట్లు లాఁపఁగలము. 88

కన్నుఁగానక గర్వించి కయ్యమునకుఁ
గాలుద్రవ్వెడు మూర్ఖులె కాతురంచుఁ
గదనమునఁబడి వీఁగి దుఃఖమ్ముపడఁగ
నుండె మాయన్న దుర్యోధనుండు, పడని. 89

అరదములు ముక్కలైపోవ, నశ్వములును
బగ్గములు ద్రెంచుకొని వడి పరుగులెత్త,
భద్రగజములుకూల, కాల్బలము సెదర,
శకునిచావఁగ, కర్ణుఁ డస్తమయమంద, 90

కాళ్ళకడ సోదరుల కాయ ఖండ పిండ
కశ్మలమ్ములు వొరలాడ, గాలిపట్టి
గడఁగి గదనెత్తిమోదఁ; బెన్దొడలు చీలు
దనుక నాపఁడు, తెలిసి మేల్కొనఁగలేఁడు. 91

చల్లఁబడియేగి యంత సంజయుఁడు, నిండు
సభనుదీరిచి కూర్చున్న సార్వభౌము
సన్నిధినిజేరి తెలిపె విజయుఁడు వల్కి
నట్టి భయదోక్తులను రూపునందినట్లు. 92

సంక్షుభితమయ్యె సభయెల్ల; సర్వమెఱిగి
నట్టి విజ్ఞులు గురువృద్ధులంద ఱొకటఁ
గలిపి సంధికి నొడఁబడవలయునంచు
బాగునోఁగుల వివరించి పలికినారు. 93

పార్థుమాటల వింటివా? ప్రాజ్ఞులెల్లఁ
బలుకుభంగిని కంటివా పట్టి! పట్టు
విడిచి లోనున్న చెడుగులఁ దుడిచి బాగు
పడుము నీ సోదరులతోడ బ్రతుకఁగనుము. 94

స్వార్థపరులనునమ్మి యపారబలులు
పాండవులతోడఁ బోరాడి ప్రాణములను
బాసిపోకుము నాయనా! పాసినిన్ను
బ్రతుకలేనొక్క క్షణమైన వసుధపైన. 95

పార్థుతోడను వసుదేవుపట్టియుండఁ
బరుల జయలక్ష్మి వలఁచునా? తరుణముండ
సంధికొడఁబడి శతపుత్ర సహితుఁడవయి
మన్నువిడుదాఁక మననిమ్ము నన్నుఁగొడుక! 96

యంచు దుర్యోధనుని బుజ్జగించిపలుక
రించి, దుర్మరణమ్ముమ్మువారింప చనవుఁ
బెంచి కదుపేఁదయనఁగఁ బ్రార్థించి, విసిఁగి
విడిచె ధృతరాష్ట్రుఁడును విధి విడువదంచు. 97

సంధియత్నమ్ములవి కురుసభను భంగ
పడినవార్తలు సెవిలోనుఁబడిన ధర్మ
నందనుఁడు డెందమునఁగుంది, నందనంద
నుండె దిక్కని యాతని దండకేఁగి, 98

కంటివే సంధియత్నాలు మంటఁగలిసె!
కష్టపడుచుంటి లోన నెక్కరిణినైనఁ
గయ్యమునుమాన్పి రక్షింపఁగలుగుతోడు
వాసుదేవుఁడ ! నీవె; నావలనుకాదు, 99

కత్తులొఱయఁగఁ జిచ్చులు గ్రక్కుసాయ
కములు పఱుఁగిడఁ, దెగిమస్తకములు దొరల,
రక్తసిక్తమ్ముగా రణరంగమెల్ల
జొంపిబడఁజూడ మేనకంపమ్ముపుట్టె. 100

అంతయునువిడి, నేను సన్యాసి నగుచు
నడవులకునేగి నివసించి నభిలషింతు;
ననుజులును బత్నియును నన్ను నంటియున్న
కతన వెనుకాడుచుంటి నిక్కమ్ము సుమ్ము. 101

ధార్తరాష్ట్రుల, ధూర్తులు దండఁజేరి
దారిఁదప్పించి నడుపుచున్నారు; వారి
తండ్రి తలఁపడి దిద్దంగ దలఁచునేని
చక్కఁబడుదురు, పొమ్మిఁక జాగుసేయ 102

వలదటంచునువేఁడగా వ్యర్థమైన
చర్యలకు నన్నెకాదిక చచ్చినట్టి
పాండురాజునె బ్రతికించి పంపనైన
ఫలితముండదు; నీ కిట్టి భ్రాంతియేల? 103

కారణములేక మిమ్మెల్ల వారణావ
తమున కంపెను; మాయజూదమునకీడ్చ
మఱఁదినిను ముంచుచుండఁగా మౌనియగుచుఁ
గూరుచుండెను; ద్రౌపది కొప్పుఁబట్టి 104

నిండుసభకీడ్చి దుశ్శాసనుండు మేని
చీరలూడ్చుచునుండియు మాఱుపలుక
కుండె; నడవులఁబడి పోవుచుండఁ గడకు
వద్దుఁజెప్పక పంపించె, నంధరాజ 105

తండు, ధర్మమ్ము నెఱిఁగి, యధర్మపరులు
తనయులంచును దెలిపి, ఖండింపకుండ
విడిచి యిన్నాళ్లు చనవుతోఁ బెంచి, నేఁడు
మందలించిన విందురా, యెందునైన. 106

పిచ్చికోర్కెలు నీవి; యేవిధము విధిని
ధానమట్టులెయగు; దాని నేను నీవుఁ
గలిపి మార్పంగలేము; దుష్టులు గతింప
వలయుఁ గదవాన - వలయు భూభారముడుఁగ. 107

పరిభవాగ్నిని కడుపులోఁపలనె చక్క
దాఁచియుంచిన పాంచాలి గాచియుండెఁ,
బాపులను మీరు కయ్యానఁబట్టి చంపఁ
గాయములపైన వెలిగ్రక్కి కాల్చివేఁయ. 108

ఉరము చీలిచి, పీల్చినెత్తురుల దుస్స
పేనుబలిగొందు; నూరులఁజీలగొట్టి
గ్రుద్ది దుర్యోధనాధముఁ గూల్తునంచుఁ
బ్రతినఁగొనియుండె మును వాయునందనుండు. 109

అగ్నిగుండానఁ బ్రబల దివ్యాస్త్రసహితుఁ
డై జనించిన, ద్రుపదుని యనుఁగుపట్టి,
తండ్రి వనమతుఁజేసినధన్వి ద్రోణుఁ
జంపఁ దఱిఁగాచియుండెను సమరమునకు. 110

కాలకంఠుని కృపను శిఖండియగుచు
నంబ యుదయించి భీష్ము పోరాడనట్లు
గయ్యమున నిల్చి వాని ముంగలను బార్థుఁ
జేతఁ గూల్పింపఁదలఁచి వేచినది నేఁడు. 111

శిష్టపాలనకును దుష్టశిక్షణకును
జన్మమందిన నేనును సమయమబ్బు
నెప్పుడాయని యుంటి - నీ వెంచినట్టు
కదనమే కల్గకున్నఁ బై కార్యములెటుఁ 112

పాంతమైతీఋం? బోరు నిశ్చయముతప్ప
దారియేలేదు; నీదు చిత్తమును కష్ట
పెట్ట నాశింపఁ గావ నే వెడలివత్తు
వంచుఁగృష్ణుఁడు పెలవంది, యరదమెక్కి 113

సాత్యకినితోడుఁగాఁగొని, సాఁగిపోయి
కరిపురమ్మునజేరెను, గౌరవులును
బౌరజనులును నెదురేగి వందనమిడి
స్వాగతంబీయ సంతోషభరితులగుచు. 114

అట విదురునింట మంచి విందారగించి
విషయములనెల్లఁ జర్చించి, వెడలి రాజ
మందిరముఁజొచ్చి, పలికి దుర్మతుల మనసు
మార్ప యత్నించెఁ బూని ధర్మజునికయ్యి. 115

కాని, దుర్యోధనాదులు వానిపలుకుఁ
బాటిచేయక, దుష్టులై బంధితునిగఁ
జేయఁజూచిరివానిని బామరులయి,
సర్వసామాన్యుఁడనియెంచి సాహసించి, 116

నిఖిలలోకమ్ములును లోన నిండియున్న
పంచభూతమ్ములును, మహాపర్వతములు,
వారినిధులును వృక్షాలు, వస్తువితతి,
ప్రాణికోటియు సర్వముఁ దానెయైన 117

రూపమునుగొని, మూర్ఖులనాఁపి, కృష్ణు
డంత పాండవపక్షమ్మునందు ఘనునిఁ
గర్ణుఁజేర్పఁగ నాశించి, కడకుఁబిల్చి
పంపెఁ గుంతిని బోధించి వానికడకు. 118

అట్టులేయని యామెయు నతనిపంచ
కరిగి జన్మరహస్యమ్ము నరయఁజెప్పి
పిల్వ, నాతఁడు - కనినంత విడిచినావు
నన్ను గంగాజలమ్ముల ముస్ను, గరుణ 119

యున్నదెఱుఁగని తల్లివై! యండఁజేర్చి
యన్నమిడి హీనకులజుఁడనన్న మచ్చ
మాయ నన్నును ఘనుఁజేసి మకుటమిచ్చి
యంగరాజును నొనరించి యాదరించు 120

చుండె, దుర్యోధనుం, డిటులుండ, వాని
వదలి నీతోడవచ్చు బెన్పాపమునకుఁ
బాలుపడలేను! నన్నింక వదలిపొమ్ము
తల్లి! మన్నించి యంచు నుత్తరమొసంగె. 121

మఱలి శ్రీకృష్ణుడంత ధర్మజుని కడకు
నరిగి యుద్ధమ్ము తప్పనిసరియటన్న
పలుకు వివరించి తెలిపెను వానిమనసు
మాఱకుండియు విధిలేని కారణమున. 122

సర్వసేనానిగా, కార్యనిర్వహణకుఁ
జాలు దక్షుని నియమింపఁజర్చచేయఁ
దొడఁగిరంతట; నెవరికిఁ దోఁచినట్లు
వారు సూచించినారొక వీరవర్యు. 123

అర్హుఁడౌ మత్స్యభూపతి యట్టిపనికి
ననిరి కొందఱు; పాంచాలుఁ డర్హుఁడంచు
ననిరి కొందఱు; వారిని వినినయంత
ద్వారకాపతి కృష్ణుఁ డందఱినిజూచి, 124

ప్రాయమునయున్న వానిని, పౌరుషమ్ము
పొంగి పైఁబ్రాకువీరుని, బ్రోత్సహించి
పంపుటెంతయు హితము ప్రప్రథముఁగాగఁ
బట్టమునుగట్టి; ద్రుపదునిపట్టి యట్టి 125

వాఁడు - నిప్పునఁబుట్టిన వరబలుండు
గాన, వానిని సర్వసేనానిఁగను నొ
నర్తు మిప్పుడు; నిపుణులున్నారు పెత్త
నమ్మునందెదరావల నమ్ము కార 126

టంచు వార్రుచ్చె; వానిఁ గాదంచుఁబలుకు
ప్రాజ్ఞులటలేమి, పాంచాలపతి సుతుండె
దండనాయకుఁడై తొలి దండునడుప
సిద్ధపడె, ధర్మతనయు నాశీస్సులంది. 127

కాయముల నుక్కు చొక్కాలఁగప్పి, మస్త
కముల మకుటాలుతొడిఁగి, హస్తములఁబట్టి
ఖడ్గముల కార్ముకమ్ముల గదల పదును
వడిన యీఁటెల బాకుల, వరభటాళి, 128

భయద గంభీర కల్లోల భరితములగు
శరధు లొకమారె, యఱచిన కరణి దిశలు
పగిలి మార్మ్రోగ, గడగడ పుడమి వడఁకఁ,
గలిసి భేరులు మ్రోఁగ, శంఖమ్ము మొఱయఁ, 129

జయజయధ్వానములతోడ, బయలుదేరె,
సమరయుక్తమ్ములౌ రథసంచయములు,
భద్రగజములు, నశ్వాలు పైఁబడిచని
కౌరవులఁదాఁక యుద్ధరంగమ్ముఁజేర. 130

శస్త్ర కవచమ్ములును, రథచక్రములును,
మరలు, మేకులు, మ్రాఁకులు, విఱిగి తఱిఁగి
నట్టివానిని గొని చక్కఁబెట్టఁగల్గు
పరికరమ్ములు, గాయమ్ము వడినవారి 131

కాయములఁ దేర్చుమందులు, గావలసిన
యంత భోజనసామగ్రి, యలఁతపాయఁ
పండి కూర్చుండననువైన పట్టుపాన్పు,
లాసనమ్ములు, వస్త్రాలు నాభరణము 132

లన్నియును బెద్దబండ్లలోనమరి, వీర
వాహకులు కాఁచి కనిపెట్టి బాటనంటి
నడుప సాఁగినయవి ముందు వెడలుచున్న
సైన్యబలమును వెన్నంటి చరచరమని. 133

పరిణయోత్సవ కార్యనిర్వహణమునకుఁ
బయనమైపోవు చందమేర్పడఁగ సంత
సమునఁ బాండవవాహిని చనివిడిసెను
వరకురుక్షేత్రమున, నీడపట్టుఁజూచి. 134

ధార్తరాష్ట్రులుకూడ నత్తఱిని, దండ
నాథులకుఁజెప్పి తమదు సైన్యమ్ము నెల్లఁ
గలిపి యొకచోట నిలిపి, సంగ్రామకార్య
మునకు సంసిద్ధులై పనిఁగొనిరి పూని. 135

భటులు మూడు తెఱంగుల వరుసదీరి
నారు; సమరానుభవమున్నవారు ప్రథము
లైరి; యువకులు రెండవవారు; వృద్ధ
వీరవరులెల్ల మూడవవరుసవారు. 136

విశ్వసంగ్రామచరితలో విననియట్టి
విధముఁజూపెను భీకర విలయకాల
జలధివా నేలయీనిన చందమొప్పఁ
బ్రబల కౌరవవాహినీబలము గలిసి. 137

అరదములఁగాదు; గజములయందుఁగాదు;
యశ్వములఁ గాదు; విపుల సైన్యములఁగాదు,
వసతులనుగాదు, వస్తుసంపదలఁగాదు,
యన్నిటను గౌరవులె మిన్నయైరిచూడ. 138

ఒక్క యక్షౌహిణికి నాథుఁడొక్కఁడౌచుఁ
బదియునొక్కరు ప్రముఖులు, పట్టుతోడ
దండులను ముందునడుప నినుండ్రుకుంకు
నప్పటికిఁ జేరినవి సమరాంగణమును. 139

రాత్రి గడచెడువఱకు ధర్మజుని మనసు
మాఱకయెయుండు ననెడు నమ్మకము లేని
వాఁడు దుర్యోధనుఁడు పూని వాని రెచ్చఁ
గొట్టి మరలఁగఁ గొందఱిఁ గూర్చిపంపె. 140

రాగరహితుఁడు పాండవాగ్రజుఁడుకూడఁ
బట్టుపెడిపోవ, వాని దుర్భాషణముల
సైచఁగాలేక, నీచుఁడా! వేచియుండి
ప్రొద్దుపొడిచెడుదనుక, నీపొంకమెల్లఁ 141

జూపుదువుకాని కయ్యానరేఁపు; వదర
వలదు సాలించు; చీకటిపడెడువేళ
పండి నిద్రించుటొప్పగు, వగలమాని
కరములను గుండెపైవైచి కనులుమూసి, 142

యంచు వారినిఁజెప్పి పోఁబంపుచుండ,
'మఱఁగె పడమటికొండల చరియలందు
తమసములుపర్వి ధారుణీతలమునెల్లఁ
గప్పె భానుఁడు, నెత్తురుఁగ్రక్కి స్రుక్కి.' 143

సమాప్తము

# యుద్ధపంచకము - స్త్రీ

వరకురుక్షేత్ర మధ్యభూభాగమందుఁ
బశుబలమ్ములుపడ ధర్మపక్షముపయి
సమరసన్నాహములుమీఱె, సరసిజాప్తుఁ
డరుణకిరణమ్ములన్ఁబ్రాకఁ బఱచిపొడువ. 1

పగ్గములనంది గుఱ్ఱాలఁబట్టివిడిచి,
పక్వముగఁ బార్థురధమునుబట్టినడుప
వాసుదేవుఁడు, ప్రతిపక్షబలమునడుమ
బందుగుల, దేశికుల, వృద్ధవరులఁజూచి, 2

వారి వధియింపఁదగని భావమ్ము మతిని
మార్చిమధియింప, గాండీవి మ్రానువడుచు
మందుఁడై కార్ముకమ్మును గ్రిందఁబెట్టి
కయ్యమునుజేయఁ గాదన్నకరణిఁదెలిపె. 3

జననమరణమ్ములవి సహజమ్ములౌట,
ప్రాజ్ఞులెవ్వరు సుఖదుఃఖభావములకుఁ
జంకఁబోరెన్నఁడును; నీవు చంపవెఱచు
వారు సంపినఁజావరు, భ్రమయవలదు. 4

జననమందినవారలు చనకమనరు;
చనినవారలు చనినట్లెచనరుమరల
జననమునునందనట్లులఁ; జావుపుట్టు
కలకులోనౌచునుండు నిక్కాయమొండె. 5

చంపఁదలకొని చంపవధింపఁబడెడు
వస్తువదిబొందియేకాని, పట్టువడక
లోనఁజరియించుచుండెడు ప్రాణశక్తి
చావుఁగననట్లు మనుచుండు శాశ్వతముగ. 6

బందుగులపైనిఁ బాశము, ఫలముఁబడయ
వలయుననుకోరికలును, బాపములఁబెంచి,
పతితునొనరించి మానవుఁబరముఁజేర
వలనుపడకుండ వసుధపైఁ బట్టియుంచు. 7

కర్మమునుదప్పరాదను ధర్మమెంచి
కర్మకునుబూనఁదగునెందుఁ; కర్మవలనఁ
గలుగుఫలమేమి యనెడు తర్కమునఁబడిన
కర్మ, ప్రారబ్ధకర్మయే! కాదువేఱు. 8

'కర్మబద్ధులు నరులు; నిష్కామకర్మ
ఘనతగాంచెడుసత్కర్మ; కనఁగ శత్రు
సంహరణధర్మకర్మ సుక్షత్రియులకుఁ
గడఁగిచేయంగదగుకర్మ; విడువఁదగదు.' 9

కారకుఁడనేను; నాకయ్యెఁగార్యమునకుఁ
గడఁగువాఁడవు నీ; వట్టి కార్యఫలము
పుణ్యమో, పాపమో నన్నుఁబొందుఁగాని
నిన్నుఁబొందదు; మాటమన్నించివినుమ 10

టంచు, వానినిబట్టివేధించు మాయ
వర్మములఁజీల్చిచక్కఁ గర్మకునుద్రిప్ప
వాసుదేవుఁడు పెఱిఁగి విశ్వస్వరూపుఁ
డగుచు దర్శనమిడె, నభయంకరుడయి. 11

ఇలలు, మలలును, జలధులు, జలచరములు,
వనులు, వన్యమృగమ్ములు జనులుఁ గ్రిములుఁ
గీటకమ్ములుఁ బక్షులకూటమియును
బ్రతిఫలింపఁగ, బ్రహ్మాండభాండమెల్ల 12

వానిలోఁగని పార్థుఁడు, భ్రమలుమాయ
వందనంబిడివినతుఁడై, బంధువితతి
పైనిగల పాశములఁద్రుంచి, పట్టి విల్లు,
పగతులనుద్రుంచ సంసిద్ధపడెను వలచి. 13

అంతధర్మాత్మజుఁడును నిరాయుధుఁడయి
యరదమునుదిగి యవనిపై నడుగులనిడి
యరిగి, భీష్మాదులకుమ్రొక్కి యనుమతిఁగొని
మఱలె నని పేయ మనసులోమనసులేక. 14

సందడించెనురణభేరి; సమరశంఖ
వాదములుమ్రోఁగె; నుభయసైన్యములుదాఁక
దద్దరిల్లెనుధరణి; దిక్తటములదరె;
శరధిఘూర్ణిల్లె, గిర్గిరఁదిరిగె గిరులు! 15

ఖట్టుఖట్టనె ఖడ్గాలు; గదలు కదలె;
కాయములఁజొచ్చె బాకులు ఖసికుమంచు;
సఱ్ఱుసఱ్ఱుననీఁటెలు సంచరించె;
పాఱెనిటునటు శరపరంపరలువడిగ. 16

అరదములు ముక్కలైనవి; యశ్వవితతి
ధరణిపైదుల్లె; గిరులన దొరలెఁగరులు;
ఖండతుండంబులైకూలెఁ గాల్బలములు
గుప్పలుగ నెత్తురునుజిమ్మి కుతలముపయి. 17

స్యందనములెక్కిపోరాడు సాహసికులు,
వారువములెక్కి యనిసేయు శూరవరులు,
సామజమ్ముల సాధించి చక్కనడిపి
సమరమొనరించుచున్న యసాధ్యబలులు, 18

ధరణిపైనిల్చి కరములఁ గరముఁగలిపి
పోరిపోరలెదు మల్లులు - పుడమి యీని
నట్లు వేలుగఁ గోట్లుగ నగఁపడిరటఁ
గదనరంగానఁ, గన్నులు సెదరునట్లు. 19

అట్లు ప్రారంభమైన పోరాటమద్ది,
ప్రాభవమునంది భీష్ముని ప్రాపకమునఁ
బ్రబ్బుకౌరవవాహిని, పదిపగళుల
పాటుసాఁగెను శౌర్యజీవమ్ముపొంగ. 20

అనికిఁదలఁపడి యభిమన్యుఁ డద్భుతముగ
పోరి, శల్యునిఁ గృతవర్మఁబుండుపఱచె;
దర్పమొప్పార శల్యునుత్తరుఁడుఁగూడఁ
దాఁకెనేకాని విలువక ధరణిఁగూలె. 21

వాని యగ్రజుఁడొకఁడు దుర్వారబలుఁడు
శ్వేతకేతుఁడు శల్యునిజెనఁకిపోరు
చుండ వానినిదరిపి భీష్ముండుగూల్చె
గుండియమజీల్చి చక్కని కోలనేసి. 22

పాండవుల సర్వసేనాని, దండిమగని,
భండనమ్మునఁ దను జంపనుండువాని,
ద్రుపదనందనుబైఁబడి ద్రోణుఁడతిశ
యించిపోరెను శక్తిదీపించివెలుఁగ. 23

మత్స్యపాంచాల సైన్యసమన్వితుఁడయి
మండిపడి ముందునడచు నుద్దండు భీమ
సేనుని గళింగు లెదిరింపఁ, జెలఁగివాఁడు
చిత్రవధఁజేసె వారిని జితుకఁగొట్టి. 24

గట్టుకనరాని కడలినా గానుపించు
కౌరవానీకమును, సిద్ధవీరుఁడైన
ద్రోణుఁడును, ధార్తరాష్ట్రులుఁదోడనుండ,
అనివిభీష్ముఁడు రథముపైనమరిపోర - 25

వన్నలును దమ్ములును ఘనమైన స్వీయ
బలములును దాను బార్థుఁడు, వాసుదేవుఁ
డశ్వములఁబట్టి యరదమ్ము నరుగనడుపు
చుండఁ, బ్రతిచర్యకును బూనుచుండ, నాటి 26

కదనరంగము, విలయసాగరము కలఁగి
గట్టులనుదన్ని పొంగి రక్తమ్ముపారలఁ
గర్ణములుఁజీల్చు నతిభయంకర వికార
గర్జనల వాయివిచ్చిన కరణినుండె. 27

తటివిఁగదిపెట్టి వాయునందనువిదాఁకఁ
గాచియుండిన కౌరవాగ్రజుఁడు వాని
పైనిబడి పట్టనుంకించి, వాఁడితూఁపు
పొడువ మూర్ఛిల్లిపడిలేచెఁ బోరమరల. 28

వాయుకుఁడు మూర్ఛనంద వెన్బడినయట్టి
కురుబలమ్ములు వాఁడట్టు కుదురుగొనఁగ,
ధైర్యమునుగొని వాయునందనునిదాఁకి
సమరమొనరింపఁదలపడ సాహసించి, 29

యర్జునుఁడు కార్ముకం బందియాగ్రహించి
కోలలను గుప్పలుగఁ గూర్చికూర్చి విడిచి
చెదరఁగొట్టెను, తనువులఁ జిల్లులువడ
చిందిరక్తము వఱదలై ముందుపార. 30

కండఁకరుగని దుర్యోధనుండు, పడిన
భంగపాటునఁగ్రుంగి, తోడ్పడఁగఁదనకు
మత్తగజముల దండుతో మగధపతియు,
నశ్వదళపతులును ధైర్యమంది గదల, 31

పేర్మి పెంపొందినట్టుల విఱ్ఱవీగి,
విషముఁ గ్రక్కుచుఁ దొడిగిన విశిఖములను
వెడల పరసర విసరుచుఁ బడెను మరల
మారుతీ నందనుని బైని ఘోరముగను. 32

కరుల మర్దించి, యశ్వాల నురలఁదన్ని,
కాల్బలమ్ములఁ గూలిచి గదనుమోది,
కదనరంగాన భీభత్సగతిఁ జరించు
భీమసేనునిఁగని, గుఱిపెట్టి యొక్క 33

వాఁడియమ్మును వదలనప్పాపి, యద్ది
తాఁకిమూర్ఛిలఁ జేసెనాతనిని, గాని
క్షణములో మూర్ఛఁదేరి మేల్కానియతండు
పట్టికొట్టినవాని గర్వమ్మడంగఁ, 34

గాలరుద్రుని భంగి చిక్కంగఁబట్టి
చేవనంతయుఁ, జిమ్ములు సిమ్మి, శత్రు
సైన్యముల మోదఁదలఁపడి, చావగొట్టి,
ధార్తరాష్ట్రులఁ బల్వుర ధరణిఁగూల్చె. 35

స్థిరముగా నొక్కపక్షమ్ము చేతఁబడక
చిత్రముగ నోటమియుగెల్పుఁ జెలఁగియాడు
చుండ, నంతంతకును గసి నిండుకొనఁగ,
భండనము తీవ్రగతి నందుచుండెనపుడు. 36

అందునిందును నెందును నర్జునుండె
సందువిడనట్లు గాండీవమంది పోరఁ
దొడఁగ, కౌరవబలములు హడలి చెదరి
పలుచఁబడుచుండె పోరుశక్తులును చాల. 37

"ధర్మజుడు శల్యుపైఁబడె; తాకె ద్రుపద
రాజుద్రోణుని; తాకె విరాటుడంత
రాజరాజును ఎదిరి పరాక్రమించె
దుష్టముగఁబట్టె భీముడు దుస్సపేను" 38

ప్రబలి పాండవ బలములు పగతులపయి
పట్టువిడువక విడుమరపాటులేక,
పడుచుఁ బోరాడుచుండియు, ప్రముఖునొకని
బట్టలేకుండ సంకటఁ బడుచునుండ, 39

సిద్ధహస్తుని వృద్ధుఁ బ్రసిద్ధయోధ
వరుని వరబలయుక్తుని, పరము భీష్మ
ప్రాపుమాపిననేగాని వారు పట్టు
పడుట దుర్లభమను సూక్ష్మభావ మెఱిఁగి, 40

వాసుదేవుఁడు, పార్థుని వాని జంప
వలయు యత్నమ్ములను జేయవలయునంచుఁ
బ్రోత్సహించెను: వాఁడును బూనియట్టి
పనికిఁ, బరపక్షమును జొచ్చి భటులఁ ద్రుంచి, 41

పైకిఁజని, భీష్మ దరిసియుఁ, బట్టిచంప
మనసురాకుండ మఱల, కంపమ్ము వుట్టి
వాసుదేవుఁడు గోపించి వసుధపైకి,
మఱికి యరదమువిడి, తానె నఱుక వెడలె. 42

పాడికాదు; వలదునిలు; పల్కి తప్ప
తగదు పోరను నేనని; తప్పకుండ
నేడుకాకున్న రేఁపైన నేనెవానిఁ
జంపివత్తును నమ్ముము సత్యమనుచుఁ 43

బలికి మఱలించెఁ బార్థుఁడు వాని; నంత
పశ్చిమాశను భానుబింబమ్ము మఱుఁగఁ
గయ్యమాపుచు, యుభయపక్షములవారు
విడుదులకు విశ్రమింపఁగ వెడలినారు. 44

కదల తొమ్మిది దినముల కయ్యమట్లు,
గడవ నారాత్రి, భానుండు పొడిచె మరల;
దేవకీసుతుఁ డనుప గాండీవి యరద
మందు నెలఁకొని భీష్మునేయంగఁ గదలె. 45

ఆర్యుఁడనియును, బూజ్యుఁడాచార్యుఁడనియు,
నతని జంపఁగ నెంచు టన్యాయమనియు
నాలసింపక, సుంత యాయాసపడక,
సాయకమ్ముల నతఁడు గాంగేయుఁదాక 46

విడువఁ బాల్పడె; భీష్ముఁడు భీకరుఁడయి
వానినెల్లను దునుమాడి వాడియమ్ము
లను విసరె వానిపైఁబడఁ; దనువునంటి
కడిగి యవిపార్థుభాధింపఁ దొడగెగ్రుచ్చి. 47

చచ్చి మిగిలిన తమ్ముల, సఖ్యమంది
సాయపడుచున్న యోధుల, స్వీయసైన్య
దళములను గూర్చికొని భీష్ము దండనుండి
కడఁగెఁ బోరఁగ దుర్యోధనుఁడును జెలఁగి. 48

మార్చి రథముల, గతులను మార్చి, విండ్లు
మార్చి, విశిఖమ్ములను మార్చి, మార్చి విడుచు
మార్గముల, ముఖభావాల మార్చి, యనుప
మానవీరులు వారు భీష్మార్జునులటు 49

చర్యకును నొక తగు ప్రతిచర్య సలిపి
సంగరముఁ జేయుచుండ నసాధ్యులగుచుఁ
జకితులై విఱ్ఱి చూచి రాశ్చర్యపడుచుఁ
గడను నున్నట్టి యోధాగ్రగణ్యులెల్ల. 50

గంగకొడుకును చంప శిఖండి యగుచు
నంబ తపమంది జన్మించి యవనిలోన,
నట్టితఱి కపిపసలార యర్జునునికి
ముందు నిలఁబడె నొక ధనువంది చేఁత. 51

ఆఁడుదైపుట్టి, మరి మగవాఁడుకాఁగ
రూపునందిన నీచుని జూపుముందుఁ
జూచి, భీష్ముఁడు వెగటనఁ దోచి, రోసి,
యనికి నొల్లక యస్త్రసన్యాసమందఁ, 52

గాంచి కృష్ణుఁడు, వాని జంపించెఁ పార్థు
కార్ముక విముక్త వరశరగతులచేఁత
గనికరము మాని; నాటికి కయ్యమాగె
వృద్ధవీరు నతని గౌరవించుటకును. 53

తనువు నంటిన శరములే తల్పమగుచు
ధరణి నంటక నిలుప నుత్తముని వాని
బొందియను, నుత్తరాయణ పుణ్యకాల
మునకు వేచెను వాఁడు, విముక్తినంద. 54

కౌరవులు పాండుసూనులు గలిసి, కనులఁ
గ్రమ్మఁ గన్నీళ్లు, వగచి శస్త్రముల వదలి,
కాళ్ళకడఁజేరి వానికిఁ గరము మోడ్చిఁ
కదలిపోయిరి శోక వికారులగుచు. 55

పదునొకండవ దినము నేర్పడినయంత
ప్రబల కార్ముక విద్యాప్రభాసితుండు
బ్రాహ్మణుఁడు ద్రోణుఁ డర్థింపఁబడఁగ, దండ
నాథుఁడై కురుబలముల నడుపఁబూనె. 56

ఐదు దినముల విడని పోరాట మతని
యాజ్ఞలోఁబడి నద్వితీయముగ నడువ,
నంతరించెనుగా భీష్ముఁడన్న వంత
యంతరింపఁగ భటులు పోరాడినారు. 57

పార్థునకు, వాని గారాబు పట్టియైన
వాని కభిమన్యునకుఁగాని పరులు చొఱఁగ
రాని వ్యూహమ్ముఁబన్ని, సక్రమముగాగ
భటుల నమరించి, పార్థుని బంచనుండ 58

కుండ దవ్వుల కనిపి, వేఱొండు దిశకుఁ
బంతముల పోరుఁ గల్పించి, పాండవాగ్ర
జన్మ బంధింపఁ దలపడె సమర ధర్మ
శాస్త్ర నిపుణుఁడు ద్రోణుఁ డుత్సాహి యగుచు. 59

అట్టి నిర్భేద్యమైన వ్యూహమ్ము జొచ్చి,
యరుల బలిఁగొని మఱలు బ్రయత్నములను
పాండవుల మహాబలశక్తి భంగపడుచు
నుండుపాటులఁగని ధర్మజుండు, వలయు 60

చేవఁగల సైన్యదళముల సిద్ధపఱచి
చెంతనిడుకొని, యభిమన్యుఁ జీల్చి చొఱఁగఁ
జెప్పి వెనువెంటఁ దానును నొప్పిదముగ
చనెను తోడ్పడ నిశిత శస్త్రములనంది. 61

యౌవనోద్రేకమున భయమన్న దెఱుఁగ
నట్టి పాండవ బాలసింహమ్ము వెంట
వచ్చు స్వీయబలమ్ముల వదలివడిగ
వ్యూహగర్భమ్ములోజొచ్చి పోరఁదొడఁగె. 62

తాఁకి దుర్యోధనాధముఁదన్ని, దుస్స
హేనునొప్పించి, కర్ణుని జిన్నపుచ్చి,
చెదరఁగొట్టుచు భటులను, జేఁతలప్పి
చాలదంచును పైపైకిఁ జనఁదొడంగె. 63

ధర్మజుని, తోడుపడవచ్చు దండులవిడి,
బాలుఁడొక్కఁడె ముందేగు భంగిని గని,
నిండు బలములతో సైంధవుండువాని
పట్టి బంధింపఁ గ్రూరుఁడై చుట్టిముట్టె. 64

అయ్యుఁ బదరక యదరక యర్భకుండు
నందఱకు నొక్కఁడే చాలునన్నభంగి
నమ్ములను నాల్గుదిక్కుల కరుగవిడిచి,
యందుబడకుండ నిలిచె పోరాడె; కాని 65

తఱుఁగుచునె వైరిబలములు పెఱుగుచుండ
తట్టుకొనలేక, ముక్కలై ధనువు విఱుగ,
రథము శిథిలమ్ముకాగ, చక్రములు దొలఁగ,
ధరణికిని దూఁకి, కత్తిని కరమునందుఁ 66

బట్టి యద్భుతముగఁ ద్రిప్పి కొట్టి కొట్టి
తలలుద్రుంచుచు భటులను దరియనీక
తన్ను రక్షించుకొనుచుండ, తలనుమోదె
పాపియొక్కఁడు వెనుకటి ప్రక్కనుండి. 67

పుట్టెపగులఁగనంత నా కుఱ్ఱవాఁడు
పుడమిపైఁబడె! కార్యము చెడినవెనుక
నటకువచ్చిరి యా ఘోరహత్యగనఁగ
ధర్మజాదులు విధియట్లు తమ్మునడుప. 68

పార్థుఁడును నంతలోవచ్చి, ప్రాణమూడి
పడినపట్టిని గుండియ పగులఁగాంచి,
ఏమిచేసితి వన్నయ్య! యెట్టిఘోర
మయ్యె! నేమంచు విలపించి, యలుకఁబెంచి 69

బాలునొక్కని నసహాయుఁ బాపమనక,
ప్రబలబలయుక్తుఁడై చుట్టుముట్టిచంపి
నట్టిసైంధవు రేపు సూర్యాస్తమయము
సమయమునఁ జంపఁగలనని చాటిచనెను. 70

చంపఁబడినట్టి పట్టియుఁ, జంపినట్టి
సైంధవుండును కన్నులఁజక్కనమరి
స్థానమందగ, నొకటి బాష్పములురాల్చ,
నొకటి నిప్పులు చెఱఁగుచునుండ, రాత్రి 71

కనులుమూయక, యర్జునుఁడినుఁడు పొడువ,
గాండివమునంది, వడిఁగొని కదలిపోయి
కదనరంగమ్ములోఁబడి కౌరవబల
రక్షితుండైనవాని దుర్మార్గు సింధు 72

పతినిబట్టంగ, ద్రోణుని భంగపఱచి,
వ్యూహమునజొచ్చి, పైఁబడుయోధవరుల
పట్టుసడలించి తొలఁగించి పైకినరిగి,
ప్రముఖులకుమధ్య నెక్కడో పట్టుకంద 73

రానిపట్టున దాఁగిన వానిబట్టి,
దారుణమ్ముగ శిరమునుదఱిఁగివిసరె,
రక్తమునుగ్రక్కి స్రుక్కి మార్తండమూర్తి
యరుగుచుండఁగ పడమటిగిరులమఱుగ. 74

అస్తమయమయ్యె నాటికయ్యమ్ము ముగియ
నట్లు పొడుగగుచుండె, న్యాయమ్మునరపి
మెలఁగు నోపిక యిరుపక్షములను దఱిగి
పోవ, మత్సరభావ ముప్పొంగుచుండ. 75

చిమ్మచీఁకటులెల్లెడఁ గ్రమ్ముకొనఁగ;
చీకులై సైనికులు గొంతుచీలనఱచి,
తమ్ముఁబెరలను నరయువిధమ్ము దోఁచ
కుండ, దివ్వెటి యొకచేతనుండ, నిశిత 76

ఖడ్గమొకచేతమెఱయ, నక్కజముగాగ
కంఠములఁద్రుంచి విసరుచు, కదనరంగ
మున చరించుచునుండ భీముండు నదియె
తగినయదనని వెదకి పంతమ్ముపట్టి 77

ధార్తరాష్ట్రులఁ బల్వురఁదాఁకి చితుక
కొట్టి చంపెను గదనందికొనుచుమోది;
పగలుపొడువఁగఁదోచిన భానుమూర్తి
క్రమముగా మింటిపై కేగి ప్రజ్వరిల్లు 78

చున్నయట్టుల సుంతయు సన్నపడక
భయదమైయొప్పి తీవ్రభావమ్మునంది
పొఁగఁదొడఁగెను సమరమ్ము పొంద్రముగను
చలమె రూపంది నడిపెడు చందమమర. 79

ద్రోణుడెల్లెడఁ దానెయై లోచుచుండి
బలుతెఱంగుల నమ్ములఁ బట్టివిడిచి
పగతురమజీల్బు పనికిఁ బాల్పడెను, గనులఁ
జింతనిప్పులు చెఱఁగుచుఁ జెలఁగి యులిఁగి. 80

మస్తకముద్రుంచి క్షణములోమత్స్యపతినిఁ
జంపి మృత్యుగృహంబున కంపినాఁడు;
జల్లెడనువలెఁ గాయము చిల్లులువడఁ
జిత్రవధపేపి ద్రుపదుని చీల్చినాఁడు. 81

తండ్రివటు గూల్చినట్టి హంతకుని పోర
దాఁకి చంపని తనయుడు తనయుడనఁగఁ
దగఁడటంచును ద్రుపదనందనుఁడు కినిసి
ప్రబల బలయుక్తుడై వానిపైనిబడఁగ, 82

బరిహసించుచు ద్రోణుఁడు పకపకనగి
వాని మత్సరముడుఁగఁ జాపములఁగ్రుచ్చి
బాధపెట్టెను, నన్నింటిపట్ట వలను
గాదు పొమ్మన్న కరణిగఁ గానుపించి. 83

ఘనుని ద్రోణుని జంపుమార్గంబువేఱు
కానఁబడకుండ ధర్మజు కంటిముందు
ద్రోణహతుపేరఁ బరఁగెడుదాని నొక్క
కరిని జంపించి, యా పేరవరలు వేన్గు 84

చచ్చెనని వాని గట్టిగ నుచ్చరింపఁ
జేసె వసుదేవుపట్టి; యా చెడ్డమాట
చెవులఁ బడినంత తన బహిర్జీవమైన
సుతుఁడు మరణించెననుకొని మతికలంగ 85

ధనువుఁ బడవైచె ద్రోణుఁడు; దానిఁ గాంచి
తడవుసేయక ద్రుపదనందనుఁడు వాని
పైకి లంఘించి ఖడ్గముఁబట్టి కొట్టి
కంఠమును ద్రెంచి విసరె నాకాశమునకు. 86

దండనాథుని మృతితోడ దండులన్ని
భండనముమాని మఱలుచునుండ, ద్రోణ
నందనుండెటనుండియో తొందరపడి
యటకుఁ జనుదెంచి, విని ద్రోణు నస్తమయ వి 87

కారవార్తను, క్రోధించి, కటకటఁపడి,
దెబ్బకునుదెబ్బఁ దీయక తీరనంచు
దిటవుగాఁ జాటి తీవ్రప్రతిజ్ఞనుగొని
మఱలె కన్నీళ్లు గనుల గ్రమ్మంగఁ దుడిచి. 88

ఏఁగె భీష్ముఁడు, ద్రోణుండు నేఁగె, ధార్త
రాష్ట్రులను బెక్కురను రణరంగమందు
బలిఁగొనెను భీమసేనుడు; భటుల బలము
సచ్చి సగమయ్యె! కాంచ నా సంగరమ్ము 89

భయదమగుచును బదునైదు వాసరములు
పట్టుతో సాఁగియును గడముట్టనట్లు
సాగుచుండెను; జయము చేఁబడదటన్న
జడుపు పైఁగొన దుర్యోధనుఁడు విచార 90

పడుచు, నారాత్రి చావకబ్రతికియున్న
ప్రముఖులను ముందునిడికొని భావిగతులఁ
బలువిధమ్ములఁ జర్చించి, ప్రబలుఁ గర్ణుఁ
దండనాయకు నొనరించి, భండనమును 91

జయము చేకూర నడుప నిశ్చయమొనర్చి,
శల్యు సారథిగా నుండి సైన్యపతి ర
థమ్ము నడుపఁగఁ బ్రార్థించి సమ్మతింపఁ
జేయ; సూర్యోదయంబయ్యె మాయ నిరులు. 92

శంఖ భేరీ నినాదాలు చదలుముట్ట
సైన్య కోలాహలము మించి సందడింప,
పిడుగులురలఁగఁ, దలపైఁనఁ, బడఁగనొక్క
శల్యఖండము చక్క దుశ్శకున మనఁగ, 93

పరశురాముని ఘోరశాపమ్ము నిండి
పండనుండఁగ, శల్యుఁడు పట్టినడుప
నరదమును, బాండవులదాఁకి తఱిగి మఱల,
బయలుదేరెను గర్ణుఁడు భయదుఁడగుచు. 94

సమర మొనరించుచుండ సంశప్తకులను
తాఁకి గాండీవి, యంతలో ధర్మసుతుని
పట్టఁదగునని రథమును వానివలకుఁ
ద్రిప్ప శల్యునికినిజెప్పి, త్రిప్పనతఁడు, 95

అడ్డుపడవచ్చు వీరుల నడఁగఁ ద్రొక్కి
యవలికినిఁద్రోలి, దరిసి ధర్మాత్మజునెటొ,
పట్టి వధియించ నుంకించి వదలె, నాడు
తల్లికిచ్చిన మాటను దప్పవెఱచి. 96

విజయ గర్వాన నుప్పొంగి విఱ్ఱవీగు
కర్ణుఁ, గౌరవబలముల గాలిపట్టి
గదను జేఁబట్టి త్రిప్పి యుగ్రస్వరూపుఁ
డగుచు నెదిరించి పోరు నయ్యవసరమున, 97

అన్న దుర్యోధనునితోడఁ గన్నుఁగప్పి
చుండగ మదము దుస్ససేనుండు వాని
పైనిబడె, నారఁబోవు దీపమ్ము ప్రబలి
భగ్గుమని మండఁదొడఁగెడు భంగి, పొంగి. 98

సాధ్వి బాండవపత్ని బాంచాలినట్లు
కొప్పుఁగొని విందు సభకీడ్చి కోకలూడ్చి
నట్టి యధముఁడు తానౌచు నట్టు చేతఁ
బడఁగ, విడిచిన మరల చేఁబడఁడటంచు, 99

వాయుసూనుఁడు వానిని బ్రతిఘటించి
పట్టి, తనువును దనువుతోఁజుట్టి పెనఁచి,
పొరలిపోరాడి, సంధులవిఱిచి, పొడిచి
వసుధపైఁబడఁద్రోసి లేవంగరాని 100

కరణిమోకాలిఁదిరముగ నురముపైని
మోపి కూర్చుండి, యొక కరమునను జక్క
కంఠమును నొక్కిపట్టుచు, గదనునంది
యొక్కకరమునఁ బైకెత్తి, యురముఁబగుల 101

గొట్టి, నెత్తురు దోసిటఁబట్టి త్రాగి,
దుష్టుఁడయి కడుపున బాకుదూసి, చేయి
దోఁపి ప్రేగుల వెలికీడ్చి కోపముడుఁగ
మెడను దగిలించుకొని, వానివిడిచిపుచ్చె. 102

అట్టి భీభత్స చర్యకు హడలి, వీఁడు
మానవుఁడుకాఁడు రాక్షసుఁడౌనటంచు
పలికి, కౌరవసైన్యము పట్టు కంద
రాని వడిఁగొని పరుగిడఁబూన, వారి 103

కష్టముననాపి కర్ణుఁడు, గలిపియొకట,
కయ్యమునకును బురికొల్పి, కదల నడుపు
మరదమును బార్థుఁదరియఁగ నంచు శల్యు
నకును వినఁబడఁజెప్పి, చెంతకును నరిగి, 104

చాపమునఁ జక్క నెక్కిడి సాయకముల
వానిపైఁ బాఱవిడిచె కుప్పలుగ; నతఁడు
భ్రమపి పొల్పోక యొక కొంతవడి, యిదేటి
భంగియని చేతలుడిఁగి కంపమ్మునందె. 105

వాడు కర్ణుని నెదిరి పోరాడఁ నెంత
వానికిని కానిపనియున్న పగిఁది కాను
పట్టె నేకాని మౌనిశాపమ్ము వాని
పరిభవింపఁగఁ దొడఁగెను బలువిధముల. 106

ఒక్కసారియెవిడువఁగనొప్పి యింద్రు
కడనుగొనినట్టి శక్తిని ఘనునిభీమ
సుతుఘటోత్కచు విగతజీవితునిచేసి
చంపివినియోగపఱచె; నసాధ్యమైన 107

పాపతూపును గుఱిపెట్టి పార్థు కంఠ
భాగమును దాఁక విడువఁగఁ వాసుదేవు
డరదమును గ్రిందికిని ద్రొక్కి యాశుగమును
వానిఁ దాఁకనియట్లు కాపాడ, నదియు 108

వ్యర్థమైపోయె; నయ్యునేమయ్యెనంచు
వాఁడు బదరక పోరాడ, వానిరథము
పూడుపడిపోయె నడుసులో వీడదీయ
వీలుకానట్లు; విధిలేక నేలకుదిగి 109

యరదమునువిడి యాతఁడు బురదనుండి,
చక్రములఁ బైకినెత్త శస్త్రములవదలి
యత్నమొనరించుచుండ, సాయకమువిసరి
పార్థుఁడాతనిఁ జంపెను బాపమనక. 110

వలదు, పరుగిడఁదగదు; పోర్వుడయవచ్చి
వెన్నుఁజూపెడు పందలవిడువరెవరు
ముక్కలుగఁ జీల్చకుండగఁ, జక్కనిలిచి
పోరిచచ్చినఁ బేరైన బొందవచ్చు, 111

నంచు దుర్యోధనుండు ధైర్యమ్ముసడలి
పరుగులెత్తెడు భటులను బట్టినిలుపఁ
బలుకుచుండియు వారెల్లఁ, వారిఁజంపఁ
బార్థుఁడరుదెంచుచున్నట్లె భ్రమసి, రుధిర 112

పంకమునఁబడి లేచుచు, వడకుచుండ
నొడలుఁ గడగడ, ధైర్యమ్ము పడలఁ ద్రొక్కి
పీనుఁగుల కుప్పలను మాంసపిండములను
శల్యఖండమ్ములను, నిల్పఁజాలనట్లు 113

పరుఁగుఁ దీయుచు నుండఁగఁ వారిపైకి
బాకులను వీఁటెలను తీవ్రబాణములను
బట్టి విసరుచు విడువక, పాండవ భట
చయము తఱిమెను నూతనోత్సాహమబ్బ. 114

పరుగులెత్తఁగ మిగిలిన భటులఁగలిపి,
పాలిపోయిన శక్తులఁబట్టి నిలిపి,
పరువునిల్పఁగ శల్యుఁడు దఱిగినట్టి
కురుబలమ్ములకును నాయకునిగనొప్పి, 115

పదియు నెన్మిదియవనాటి కదనమునకుఁ
గడఁగి, కడకును బోరాడి బడలిపడలి
పాండవాగ్రజుఁ జేఁజిక్కి, భటులతోడఁ
బ్రాణములువీడ పుడమిపైఁబడెను గడకు. 116

ఒక్క దుర్యోధనువిదప్పఁ, దక్కినట్టి
ధార్తరాష్ట్రుల నందఱ ధూర్తుఁడగుచుఁ
జంపభీముఁడు, శకునియుఁ జంపఁబడెను
గయ్యమున సహదేవుని కత్తిచేత. 117

ద్రోణసుతుఁడును గృపుఁడును దాను, తోడ
వరలు గృతవర్మయును మిత్తి వాతబడక
ప్రాణములతోడ మిగులఁజేఁబట్టినట్టి
పుణ్యమేమని, చింతించి బుద్ధి చెదరి, 118

పందయై ధార్తరాష్ట్రుఁడు సందుగొందు
లందు నక్కుచు, దవ్వుల కరిగి యొక్క
మడుగులోఁపల మునిఁగి మర్మమ్ముకాగ
దాఁగెఁ దనవారికైన నందంగరాక.

తమకుఁగూడను చెప్పక తప్పుకొనిన
ధార్తరాష్ట్రుని కానక, తప్పుకొనిరి
మిగిలియున్నట్టి ముగ్గురుఁ దగిలికొనక
యరులచేతుల నరదాల నరుగఁదఱిమి. 120

జడిసి దుర్యోధనుం డట్లు మడుగులోన
నడఁగి తలదాఁచుకొనిన రహస్యవార్త
విన్న పాండుతనూజులు వెడకివానిఁ
బట్టి బయటికి నీడ్చి పోర్పడయు మనిరి. 121

సైన్యమేలేదు; చేత శస్త్రములులేవు;
అరదమును లేదు, తోడొక్కఁడైన లేఁడు;
కలదు గదయొండె, కాననొక్కండె గదను
నంది పోరాడ రావలె ననఁగవాఁడు, 122

కానియంచును, గదనంది గాలిపట్టి
కాయమును గొండవలెఁబెంచి, కన్నుగవను
బర్వత బిలములనవిచ్చి' వహ్నిఁగ్రక్కి,
కడఁగి ఢీకొని గదనుముక్కలుగఁ గొట్టి 123

పిడుగు పిడికిళ్ళఁజఱచి కుప్పించి పొడిచి,
నడుముఁబడఁదన్ని, వాని పెన్దొడలవిఱచి,
తడిపి కరముల నెత్తుటఁ దనిసిశాంతి
నంది, తోడ్తోనట్టి యానందవార్త 124

నందుకొన గర్ణములకును విందుగాగఁ
గాచియున్నట్టి పాంచాలి కడకునేఁగి
సంభవమ్ములఁ వివరించి చక్కఁజెప్ప
నన్నదమ్ములఁ దోడ్కొని యరిగినాడు. 125

చెంతనేయుండి పొదరుల పొంతదాఁగి
యంతయును గాంచుచున్న ద్రోణాత్మజుండు,
వంచితునిజేపి జనకుఁ జంపించినట్టి
పాండవుల వంశమును మాపి పగనుదీర్పఁ, 126

జేఁత కరవాలమునుబట్టి శిబిరములను
జిమ్మచీఁకటిలోఁ జొచ్చి చిక్కువడక,
చేఁతిదీపమ్ము వెలుగులో శిశువులైన
చిన్ని యుపపాండవులఁజూచి, కన్నుగీటు 127

పాటులో కంఠముల్ద్రుంచి పరుఁగుఁదీయు
చుండ, మేల్కొన ద్రుపదాత్మజుండు, వాని
గొంతుకనుబట్టి మెత్తగఁ గోసిచంపి,
కానుపించనియట్టులఁ గదలిపోయె. 128

తమసమునుజీల్చి మబ్బుల దరిమిమాపి,
ధవళమొనరించి యాకాశతలమునెల్ల
ధరణిపై వెల్గులనుజల్లి ధర్మచక్ర
మనగ గిరగిరఁదిరుగుచు, నినుఁడుపొడువ, 129

పత్ని గాంధారితోడను పతులబాసి
వగచు కోడండ్రతోడను, వంశగురువు
ధౌమ్యుతోడను, కుంతితో, ధర్మమూర్తి
విదురుతోడను, కురుకులవిభుఁడు, సమర 130

మందు మడిసిన యాప్తుల, నాత్మజులను
గాంచి, యంత్యక్రియలసల్పి యంచితముగ
మఱల వాంఛించి, కదలి సంగరతలమ్ముఁ
జేరఁ బయనించెఁ, జేసినదెల్లఁజేసి. 131

ద్రౌపదియు, తమ్ములందరు దండనుండ,
వందనందనుతో ధర్మనందనుండు
తండ్రిదవ్వులఁగనిఁపించఁ దరియనరిగి
తప్పుమన్నించుమాయని దండమిడెను. 132

వారు శతపుత్ర నాశకకారులన్న
క్రౌర్యభావమ్ము నెట్టులో కప్పియుంచి
మంచినెంచినవిధము నటించి వాఁడు
వాయునందను గౌగిటఁ బట్టదలచె. 133

కాయమూడని యా గర్వకాలమందు
వాయునందనువలె శిలాప్రతిమ నొకటి
శిల్పులకుఁజెప్పి చెక్కించి విల్పిముందు
చెనఁకి పోరాడు దుర్యోధనుని విధమ్ము 134

బాగనెఱిఁగిన కృష్ణుఁడా ప్రతిమనెటులొ
గూఢచారులబంపించి గుట్టుబయలు
పడనియట్టుల దెప్పించి, వానిముందుఁ
బట్టినిలిపెను, వీఁడె చేపట్టుమంచు. 135

శతశతమ్ముల మత్తేభశక్తినంది,
యప్పుడాతఁడు దాని నత్యాగ్రహమున
నదుము బిగికౌఁగిఁటనుబట్ట నదియు జీర్ణ
మయ్యె నొక పిండిబొమ్మయోయనఁగ నడిగ. 136

అట్టి దారుణకృత్యమ్ము నాచరించి
యాగ్రహము సల్లబడినంత యంధరాజు,
అయ్యొ! నేనేమిచేసితినంచు నేడ్వ
వాని నోదార్చె కృష్ణుఁడప్పుడిఁదెల్పి. 137

అవల రాబందులును, గ్రద్ద లల్పములగు
పక్షులును నక్కలును పడి పైని, గోళ్ళ
ముక్కులనుజీల్చి పీన్గుల మెక్కుచున్న
పట్టులకుఁజని గాంధారి, పట్టుసడలి 138

కన్నకొడుకుల శవముల కౌగిలించి
బావురనియేడ్చె; కోడండ్రు వక్షములను
బాదుకొనుచును పుస్తెలఁబట్టిత్రెంచి
పుడమిపైఁబడి పొర్లి వాపోయినారు. 139

విధివిధానముఁ దప్పింప వీలుకాని
విధము వివరించి విదురుఁడు వేదనపడు
వారి నోదార్చినంతట, పాండవాగ్ర
జుండు, ధౌమ్యుని పంచనునుండి దహన 140

కార్యములఁదీర్పవేఁడెను; కాష్టశయ్య
లను వమర్చిరి పల్వురు ఘనులుకూడి;
యంత మృతకాయముల వానిపై వమర్చి
చిచ్చుముట్టించ నవియును చెలఁగిమండె. 141

బాహువుల మోడ్చి యందఱు వానిచుట్టి
వచ్చి ముమ్మారు, విడిచి యప్పట్టు, కదలి
జాహ్నవీతీరమునుజేరి జలములందు
మునిఁగి, నిర్మలమగు వస్త్రముల ధరించి, 142

తర్పణమ్ములువిడిచి శాస్త్రము విధించి
నట్లు, దేవులకును మ్రొక్కి, యవనిసురులఁ
దన్పి తాంబూలదక్షిణదానములను,
దరలిపోయిరి తమతమ తావులకును. 143

సమాప్తము

# శాంతిసప్తకము

ధర్మనందనుఁ డట్టు లధర్మపరుల
ధార్తరాష్ట్రుల ధర్మయుద్ధమ్మునందు
తాఁకి వధియించి, విజయపతాఁక నెత్తి
తరలివచ్చుచునున్న సద్వార్తను విని, 1

పొంకమొప్పార పురము నలంకరించి
పొంగుముదమీద్వ నెదురేఁగిపోయి, హృదయ
పూర్ణ కుంభమ్ములను నెత్తి పూలుసల్లి
ప్రజలు స్వాగతమిడిరి శుభమ్మునెంచి. 2

మగువ పాంచాలి వదనపద్మమ్ము విచ్చె;
మారుతీనందనుని కంటి మంటలారె;
మహిమఁజిలికెను పాండవమధ్యముందు
మందహాసము బెదవులఁ జిందులాడ. 3

ధర్మజుండొక్కఁడే తాపతప్తుఁడగుచు,
దారుణమ్ముగ బంధురక్తమ్ములోన
తడిపి తన చేతఁబడిన భూతలమునొల్లఁ
దగని ధర్మమ్మునెంచెఁ, జిత్తమ్ము పెదర. 4

ప్రాజ్ఞులెందఱొ శోకభావమ్మునార్పి
వాని రాజన్యు నొనరింపఁ బలుదెఱఁగులఁ
బల్కిచూచిరి: కాని, నిష్ఫలమనస్కు
లైరి, యొప్పింపఁగల యుపాయమ్ముఁగనక. 5

ఉత్తరాయణ పుణ్యకాలోదయమగు
టను నెఱింగిన దేవకీతనయుఁ డట్టి
తరుణమున వాని, దివికిని నరుగనున్న
భీష్ముకడఁజేర్చెఁ జెప్పియొప్పించునంచు. 6

భక్తవత్సలుఁ డాశ్రిత బాంధవుండు
వాసుదేవుండు ముక్తిచూపంగ నట్లు
వ్యాజమును గొనివచ్చిన భంగి కలరి
వందనంబిడి భీష్ముఁడు, పాండవాగ్ర 7

జన్ము, సంచలితాత్ముని, శాంతిసుధలఁ
జల్లి తిలకించి, మానస జలజ మృదుల
దళము లల్లన విప్పారి పలుకుఁదేని
యలనుగార్చఁగ, పరమదయాళువగుచుఁ, 8

బంచకును బిల్చి, ధర్మతత్త్వములఁబట్టు
వడగ వివరించిచెప్పి, భూపాలనమ్ము
నందఁదగునని శాసించి బొందివిడిచి
ధరణిపై, నేఁగె పరమపథమ్ముఁజేర. 9

ద్వారకాపతి యభయహస్తమ్ము లెత్తి
యతని దీవింప, ధృతరాష్ట్రుఁ డంగలార్ప,
ననిలతనయుఁడు చలియింప, నర్జునుండు
హతవిధీ! యన, కవలకాయము వడంక, 10

ద్రౌపది కలంగ, చెదర గాంధారి, కుంతి
వంతలను జిక్కి వాపోవ, గొంతుఁజీల్చి
బయటఁ బడనున్న యెలుఁగు నాపంగలేక
యాపికొని ధర్మజుండు శాత్యాది కర్మ 11

కాండకునుబూని సాంతమ్ముఁగా ముగించి,
ధరణి సురులనుదన్పి, పేదలను దృప్తి
పఱచి వస్త్రాన్నములనిడి, మఱలె తాత
తనకుఁ జెప్పినమాటలఁ దలనుదాల్చి. 12

మకుట మందఁగవచ్చుధర్మజుని ప్రజలు
పరమ సంతోషభరితులైపట్టు గొడుఁగుఁ
బట్టి చామరములవీచి చుట్టుమూఁగి
నడపి గద్దియపై నిల్పినారు దనిపి. 13

గాలిపట్టిని యువరాజుగా విధించి,
మంచినెంచఁగ విదురు నమాత్యుఁజేసి,
సంజయుని కప్పగించి కోశమును, దండ
నాయకునిజేసి పార్థుని, సాయపడుచు 14

వతిథి సత్కార ధర్మకార్యములఁజూడఁ
గవల నియమించి, కష్టసుఖమ్ములరసి
ప్రజలఁ బాలింపగలుగు మార్గమ్ము నెఱిఁగి,
యరుల భయమును, చోరభయమ్ము, కఱవు 15

గాటకమ్ములు గలిఁగెడు కారణములఁ
గలుగనీయక యరికట్టి, యిలను వానిఁ
బోలు రాజన్యులే పుట్టఁబోరటన్న
మాడ్కి పాలింపఁదొడఁగె ధర్మాత్మజుండు. 16

వంత విడిపోవ పాండవ పంచకమటు
ప్రజల మన్ననకెక్కుచుఁ బ్రబలుచుండ
వ్యాసుఁడరుదెంచి, కన్నులపండువుగను
గాంచి ముదమంది, పాండవాగ్రజుని జూచి, 17

బంధుహింసకుఁ బూనిన పాపములను
పరిహరింపఁగదగు మహాధ్వరము, నశ్వ
మేధమును సల్పనగునని బోధచేసి,
వందనములందుకొని సెలవంది వెడలె. 18

అంతలో ద్రోణనందనుఁ డల్లనాడు
బ్రహ్మశిరమను నొక్క యస్త్రమును వదలి
కడుపులోననె చంపిన బుడుత నొకనిఁ
గన్న దుత్తర కడకు దుఃఖమ్ము పఱవ. 19

వంశమునునిల్ప మిగిలిన బాలుఁడతఁడు
ప్రాణములవీడి యట్టులఁ బ్రభవమంద,
పాండవులు వాసుదేవుని పాదములను
బట్టివేడిరి వానిఁ గాపాడుమంచు. 20

ఆతడుఁను నంత కరముల నందిపట్టి
పాపనొకసారి ముద్దాడఁ, బ్రాణమంది
పసిఁడినవ్వుల పూలఁ దాపమ్ములారఁ
జల్లె నెల్లెడ వద్ది, యాశ్చర్యమనఁగ. 21

చక్రి కృష్ణునిదయ పునర్జన్మఁ గొన్న
బాలకుండటు, వంతలువాయ, వ్యాసుఁ
డాచరింపగఁదగునన్న యశ్వమేధ
యాగమును జేయ ధర్మజుఁ డాత్రపడెను. 22

అర్జునుండును దిగ్విజయమ్ముఁజేసి
మఱల సిరిసంపదలతోడఁ బురమువిడిచి
వెడలె భద్రాశ్వమునువెక్కి, విల్లు చేఁత
బట్టి, వీడ్కోల్ప కరిపురవాసులెల్ల. 23

స్వాగతంబిడి, తలవంచి, సత్కరించి
సాఁగనంపిన రాజులొసంగినట్టి
స్వర్ణ బహుమానములనంది, సాహసించి
యుద్ధపడినట్టి మూర్ఖుల నణఁగద్రొక్కి, 24

వస్తువాహనములఁగొని, వాఁడు తిరిగి
వచ్చుచుండగ, పరుగు నశ్వమునుబట్టి
పైకిఁ జననీక నిలిపి, యర్భకుఁడు బభ్రు
వాహనుఁడు, వాఁడె తనుగన్నవాఁడటన్న 25

మర్మమరయక పోరాడి మన్నుదాఁకఁ
దన్ని మూర్ఛితుఁజేసి మాతకునుజెప్ప,
నామెయును వచ్చి చూచి యా యాగడమును
వగచి, సంజీవనీ మంత్రబలముచేఁత 26

మగని బ్రతికించి, తనయుని తగని పనిని
మఱచి మన్నింపవేడి, నమస్కరించి
పంపె సెలవిచ్చి; వాఁడు నబ్బాల వీర
వరుని గొండాడిచని, కరిపురముఁజేరె. 27

వ్యాసు నాధ్వర్యమున నంత వైభవముగ
నశ్వమేధమ్ము శాస్త్రోక్తమైన విధుల
సాంతమయ్యెను మోదిత స్వాంతులగుచుఁ
బ్రజలు ధర్మజుఁ గొనియాడఁ బలుదెఱగుల. 28

పుత్రశతమును బొలియించి బూదిలోన
బూదిగాఁగల్పి ఘనతను బొందుచున్న
పాండుపుత్రులఁజూచి యోర్వంగలేని
తనము, కాకున్న, తన్నుఁ బాతకుని, వారు 29

గష్టపెట్టక కడచిన కథను మఱచి
కాళ్ళకడనుండి దైవమ్ముగాఁగ గౌర
వించి పూజించుచుండ భరించరాని
తనము, ధృతరాష్ట్రుఁడటనుండఁ దరముగాని 30

యగడులోఁబడి, క్రుంగి యాయాసపడుచు,
నవని నొల్లక, లోకుల కందువడని
యడవిపట్టులలోనికి నరిగి తపము
నంది జీవిత శేషమ్ము నందెపుచ్చఁ 31

దలఁచి, ధర్మతనూజుని దండఁబిలిచి,
పలుకు తడఁబడ, కనుల బాష్పములుగ్రమ్మ,
తెప్పలల్లాడఁలోని నిర్వేదమెల్ల
బయలుపడఁ గ్రుమ్మరించి చెప్పంగఁదొడఁగి, 32

బాల్యముననుండి మీపగవారుకాగఁ
బాపకార్యమ్ములకుఁబూని పట్టువిడక,
చంప లాక్షాగృహమ్మునకంపి, జూద
మాడఁబిలిపించి వంచించి యోఁడ జేసి, 33

సర్వమునుగొని సభకీడ్చి సాధ్వి ద్రుపద
నందనను భంగపఱచి కానలకుఁద్రోలి,
కష్టములనంది మఱలి సఖ్యమ్ముగోఁర
ఖండితమ్ముగఁ గాదని, కయ్యమునకుఁ 34

గాలుద్రవ్విన ఖలులను గన్నవాని
నన్ను మన్నించి, వలచి యున్నతునిఁజేసి
సన్నుతించుచు, కొని దైవసమునికాగ
ననుదినమ్మును బూజించి, మనసుకెక్కి 35

నట్లు వర్తించి, చింత యావంత తగుల
నట్టు లలరుల పొన్పులయందు నుంచి
మనుచుచుంటివి - దాని కాదనగలేను
కాని, యూరటcగనక యున్నాను, వినుము. 36

స్వర్గమున నుంచినను సుంత సౌఖ్యపడని
జాతకుcడనేను; మతిలేని పాతకుcడను;
స్వార్థపరుcడను; కొడుకులపైని పక్ష
పాతమునc బోరుcబెంచిన ఘాతకుcడను. 37

బుద్ధి దిద్దంగ నెంచిన పుణ్యు భీష్ముc
బుందుపఱచితి; విదురుని పొడిచి పలికి
పొమ్మటంటిని; జగదేక పూజ్యుc గృష్ణు
పొల్లుమాటలనన వింటిc బుత్రశతము. 38

ప్రాణమునుమించి ప్రాణమై పంచనుండి
పాలనముcజేయదగిన తోడ్పాటునిచ్చి
ప్రాపుగానున్న తమ్ముcడు పాండవు నను
నమ్మి మిమ్మెల్ల విడిచి దివమ్ముcజేర- 39

కన్నకొడుకులకన్నను మిన్నయంచు
నెంచి, బాగోcగులరసి రక్షించకుండ
పాపపాశమ్ములోc బట్టుపడి వధింపc
బాలువడితిని గఠినుcడై జాలిమాలి. 40

దైవమిక యూరకుందునా? తగినభంగి
నన్ను శిక్షించి విడిచెను; గన్నుమూపి
నారు నూర్గురు కొడుకులు; నాకునింక
నరకలోకనివాసమే పరమపథము! 41

కడుపులోc గాఱుచిచ్చులు కలయcబర్వి
కాయమెల్లనుగాల్చ నెక్కరణి నేను
గలcతలమ గప్పియుంచి నీకడనుమనుదు
గడుపువింపుట యే ఘనకార్యమంచు. 42

నీకు ద్రోహమ్మునెంచిన నీచు నన్ను
నీవు మెప్పించుకొలఁదియు నిక్కువముగ
నిప్పుముట్టించినటులుండె; నొప్పిపడకు-
వీడుసేవలనందఁగ నేను తగను. 43

అగుట నా మాటమన్నించి యడ్డుసెప్ప
వట్లు సెలవిచ్చిపంపి సాహాయ్యపడుము
చాలు నీమేలుమఱవ, నాయాలితోడ
పాపములుమాయ కానలోఁబడితరింతు, 44

వంచువలికిన, ధర్మజుఁ డాకులఁపడి-
వత్తునేనును మీతోడ వనికి, బంధు
వధకు పాల్పడినట్టి పాపమ్ముసమయు
వట్లు తపమంది మోక్షమ్మునందననియె. 45

పడపి కర్ణుని గంగలోఁ బారవైచి,
పరులయిండ్లను బెరిగెడు పగిదినెఱిఁగి,
కయ్యమునఁ గూలుదనుకను గన్నసుతుల
కైనఁ దెలుపక దాఁచిన యఘము మాయ 46

తానుగూడ పౌశీల్య గాంధారితోడ
తరలిపోవుట తగునని తలఁచి కుంతి
సిద్ధపడె గానలకునేఁగఁ; జెంతనున్న
విదురుఁడును గోరె వారిని వెంబడింప. 47

అట్టి తరుణమ్ములో వ్యాసుఁడటకువచ్చి-
వారిఁబోనిమ్ము, క్షత్రియ వంశవృద్ధు
లైనవారలు సమరరంగాన మరణ
మందఁదగు న్యాయముగఁబోరి; యట్లుకాని 48

పగిది గాఢసమాధిలో వనులయందు
మృతులుకావలె; రోగపీడితులరగుచు
స్వస్థలమ్ములలోనుండి చావరాని
ధర్మమున్నది; నీవేఁగఁదగదు ప్రజల 49

వదలి యవదలుగాఁ; గొన్ని వత్సరముల
పాటు పాలించి, యుత్తర పడపినట్టి
వాని నభిమన్యుసుతుని భూపాలుచేసి
యరుగవచ్చును వార్ధకమ్మందుకొన్న 50

నంచు ధర్మజువారించె; నంతవనికిఁ
బయనమైనవారు వృద్ధులు బట్టణమును
వదలి, కరిపురవాసులు వగవుదోఁపఁ
గంటనీరిడి వీడ్కొల్పఁ గరముమోడ్చి. 51

కౌరవాధీశ్వరుఁడును గాంధార రాజ
నందనయుఁ గుంతియును గాననమ్ముఁజొచ్చి
యాశ్రయంబిడ శతయూపు, డందునిలిచి
తపముఁజేయదొడంగి రుత్తముఁదలంచి. 52

వారిచెంగటనుండ, కెవ్వారికంట
పడక విదురుఁడు, విపినగర్భమునవీత
వస్త్రుఁడైచరియించె బువ్వకునుమాఱు
పవనమునుగొని పస్తులువడఁగ నేర్చి. 53

తమ్మువిడనాడి వృద్ధులు దపమునంద
నడవులకుఁజని బహుకాలమైన, వారి
దరిసి దర్శింప ధర్మనందనుఁడు పుష్ప
ఫలసమంచితహస్తుఁడై వచ్చెనటకు. 54

వంచి శిరమును మ్రొక్కి పూజించి జనకు
ప్రణతులిడి మాతలకును దీవనలనంది,
యందు విదురునిఁగానకయెందు నతఁడు
పఱచిచూడ్కులఁజూడఁ గన్పడె నతండు. 55

కావఁబడినట్టివాడందు క్షణముగూడ
కాలు నిలుపక పవనవేగమ్ముఁబట్టి
మఱలి పరుగిడఁదొడఁగె ధర్మజుఁడు వెంట
బడుచునుండఁగ నేమియుఁ బాలుపోక. 56

కావనాంతర గర్భభాగమునకరిగి
కాఁటుకలు గార్చుచున్న వృక్షమ్ము కడను
గడకు పరుగుమనాపి యక్కజముగాఁగ
ధర్మజునిఁజూచెనతఁడు నేత్రములవిచ్చి. 57

కలయఁబర్విన కాఱుచీకట్లఁజీల్చి
కనులకొనలనువిడి దివ్యకాంతియొకటి
ధర్మజునిలోనఁగలియఁగఁ, దనువుదొరలి
ధరణిపైఁబడెఁ బూలుదేవతలు చల్ల. 58

పాండవాగ్రజుఁడంత దివ్యప్రభాస
భాసితుండయి, యట్లు దివమ్ముఁజేరి
నట్టి విదురుని తనువును జుట్టివచ్చి
వందనంబిడి, కనులబాష్పములురాల్చి, 59

యదుగుతడఁబడ శతయూపునాశ్రమమున
కరిగి వృద్ధులకావార్తనందఁజెప్పి,
మఱల ననుమతిఁగొని హస్తిపురముఁజేరఁ
దరలిపోయెను జెదరు చిత్తమ్మునడఁచి. 60

'అస్తమయు నాటకమ్మునకదియెనాంది'
యనఁగ విదురుని నిర్యాణమునకు వెనుక
వరుసగొని యొక్కరొక్కరె యరుగఁదొడఁగి
వారు మృత్యుముఖమ్మునుజేర వడిగ. 61

కనలిమందుచుఁ గార్చిచ్చు కలయఁబర్వి
కానలో వృక్షములనెల్లఁగాల్చి, తృప్తి
పడక దగ్ధమ్ము సేసె పైఁబ్రాకి తాఁకి
పత్నితోఁ గుంతితోఁ గురుపతినిఁగూడ. 62

వాసుదేవుని దర్శింప వచ్చినట్టి
బ్రహ్మఋషులను యాదవార్భకులు మార్గ
మధ్యమునవిల్చి మగవాని మగువకాఁగ
మార్చి కడుపును నుబ్బంగఁదీర్చి, యిద్ది 63

పూర్ణగర్భిణి, దీనికిఁ బుట్టఁబోవు
పాప యాఁడుదియో, మగవాఁడొ తెలుపు
డంచు గేలికినదుగ, కోపించివారు,
గుడిచి కూర్చుండ వొల్లక మిడిసిపడుచు 64

పరులజోలికిఁబోని తాపసులమమ్ముఁ
బరిహసించిన పాపమ్ము పండునటుల
మిమ్ముఁబడసినయట్టి వంశమునుఁ జెఱుప
ననువుగాఁబుట్టు ముసలమ్మటంచుఁజనిరి. 65

ముసలమును బుట్టెనట్టులే మూఢులైన
వారి యాదవు లద్దాని బోరు తప్ప
నంచుఁ, జక్కఁగఁ బిండిగొట్టించి తనిసి
కడలి నీరములందునఁగలిపినారు. 66

మునుల శాపమ్ము దప్పునా! ముసలమట్లు
పుట్టినప్పటినుండి యప్పురములోనఁ
బాపములు ప్రోవుఁగనుచుండెఁ, బగలు పెరిగి
తగవులెల్లెడ, దలపడఁదెగనిపగిఁది. 67

బాలకులు వృద్ధులను భంగపఱచినారు,
తల్లిదండ్రులఁ బుత్రులు దన్నినారు;
పతుల నెదిరింపఁ దొడఁగిరి సతులు, శిష్యు
లవమతించిరి గురువుల నలఁతిచేసి. 68

జనులు నిర్వ్యాజముగను శస్త్రమ్ములంది
తలలఁదెగఁ గోసికొనుచు భూతలముపైని
గుప్పలుగఁ గూలుచుండిరి, చెప్పవలను
కాని బీభత్స చర్యకుఁ గడఁగి విడక. 69

పైనిఁబడి క్రూరముగఁ గృతవర్మయన్న
వానివధియించె సాత్యకి; వానిపైని
పడుచు భోజాంధకులు పోరివిడువకుండఁ
బట్టి చంపిరి దుష్టులై కొట్టి కొట్టి. 70

చెలఁగి యుప్పొంగి జలనిధి జలమయంబొ
నర్చు ద్వారావతినటంచు నభమునుండి
పలుక నశరీరవాణి విస్పష్టముగను
వాసుదేవుఁడు విని, తన పంచమున్న 71

స్త్రీ జనమ్ముల వసుదేవుచెంత భద్ర
పఱచి, కాననమందుఁ దపమ్ము నందఁ
జనిన బలరాముఁజేరఁగఁజనెను, బుడమి
పైని బుట్టుకనందిన పనులు ముగియ. 72

తమ్ముఁడటు తన్నుజేరఁగదరియుచున్న
పగిదిఁగని యోగమార్గమ్ముఁబట్టి వసుధ
పైన దిగజార్చి తనువును బరమపథము
నందుకొనె నందుపడక హలాయుధుండు. 73

మాయలోఁబడి యటనున్న బోయఁడొకఁడు
భ్రమసి కృష్ణుని లేడిరూపమునఁజూచి
కార్ముకమ్మును గొని యరికాలిఁదాఁక
విడిచె విశిఖమ్ము నొకదానిఁ దొడిగి చక్క. 74

బోయ తూపున నవతార పూరుషుండు
బుడమిపైఁ బడఁగాయమ్ము విడిచి, నిజని
వాసమునుజేరనట హస్తిపట్టణమున
దుర్నిమిత్తము లగఁపడఁదొడఁగె విడక. 75

అంతరంగముఁ చలియింప నర్జునుండు
ఆత్మసముఁడైన కృష్ణుఁడేమయ్యెనేమొ
యంచుఁ, ద్వరపడి, చెప్పియన్నయ్య పెలవు
నంది పయనించి, ద్వారక కరిగి, యచటి 76

వార్తలను విని వసుదేవువలన, నొడలు
వడఁక దడదడ, తడఁబడ నడుగులిడుచు
వనిని జొరఁబడి యాదవాన్వయుని గృష్ణుఁ
బ్రాణమిత్రుని మృతకళేబరముగాంచి, 77

కనులు గిఱ్ఱునఁ దిరుగ, మైకమ్ము దగిలి
క్ష్మాతలమ్మునఁబడి స్మృతిమాయ, కొంత
కాల మరిగిన యంత మేల్కాంచి, క్రింగి
కలఁతలను గష్టమున, చనెఁగాళ్ళునీడ్చి. 78

తిరిగిపోయెదు నంతలోఁ దిరముకాని
తిత్తియౌ దేహమును విడిదివమ్ముఁజేరె
దేవకీపతి, నాథుని త్రోవఁబట్టి
నదువపతులును సహగమనమ్ముఁజేసి. 79

చావునొక చావుముట్టఁగ, శవములనటు
చల్లగా విధిపేర్చ భూస్థలిని జూచి,
శాశ్వతమ్ముగ భువి మనఁజాల రెవర
టంచుఁ బార్థుఁడు సుంతశాంతించి, మరణ 80

మందకుండఁగ మిగిలిన మగువలఁ దన
వెంటఁగొనిపోయి యెటులైన నింటఁజేర్ప
వలచి, బహుజాగరూకుఁడై వనులఁజొచ్చి
యరుగఁ దొడఁగెను గాండీవ మందిచేత. 81

పసిడినగలను మెయిఁదాల్చి భామినులటు
వనతలమ్ములఁ జనుచుండ, వారినిగని,
పట్టిదోచఁగ వాశించి బాట కడ్డు
పడిరి వనచరులొకటఁ గుప్పలుగఁగూడి. 82

యదుకులార్కుని యస్తమయమ్ముఁతోడ
నతనిలోనున్న శక్తులు నంతరించి
నట్లు, వారిని వారింప నలవికాక
ఫల్గునుఁడు పట్టుబడి నట్టివారి వదలి, 83

వాసుదేవుని సతుల చేద్పడనియట్లు
బహుప్రయాసకు లోనయి పంచనుండి
కాఁచి కాఁపాడి యెట్టులో కరిపురమును
జేరుకొనఁగల్గె చిత్తమ్ము చిన్నపోవ. 84

అంత బలరామకృష్ణుల యస్తమయ వి
షాదవార్తను వాఁడు విచారపడుచు
వారి పత్నులకును జెప్ప వహ్నిలోనఁ
బడి తరించిరివారును బుడమివిడిచి. 85

తల్లిదండ్రులు పనిరి, యుత్తమ పథమ్ము
నందె విదురుఁడుఁ, జెప్పక యదుకులమణి
యస్తమించెను, విడువక యవని నంటఁ
గట్టుకొనియున్న మనమెట్టి కారణమ్ము 86

నెంచి మనవలె? సద్గతినెంచి సన్య
సించి కాననమందు వసించి ముక్తి
నందఁదగునని తమ్ములముందు పలికి,
మకుట మందించి తగనభిమన్యుసుతుని 87

హస్తినాపురరాజ్య సింహాసనమున
నిలిపి, దీవించి, పాలించవలయువిధుల
వ్యక్తమొనరించి, విడలేక వగచుచున్న
ప్రజల నోదార్చి నిలిపి, ధర్మాత్మజుండు, 88

ద్రౌపదియు తమ్ములందరు దండనుండి
దారిఁ జూపఁగ కాషాయ ధారియగుచుఁ
బయనమై పట్టణమువిడి వనినిజేర
నరిగె చరచర సంతోషభరితుఁడగుచు. 89

వింతయన నొక్క శునకమ్ము వెంటఁదగిలి
విడక పయనింప వారితో వెడలి వెడలి
వారు భాగీరధిని దాటి మేరుపర్వ
తమును జేరిరి, మేనిసత్త్వమ్ము సడల. 90

పర్వతమ్మును గమియించి పైకి నడచు
బలము సాలక ద్రౌపది బడలి వెక్క
సమ్ము తోపఁగ చెమటలుగ్రమ్మ, నొడలు
వడక, శోషిల్లి ప్రాణమ్ములుడుఁగఁబడెను. 91

పాటిసేయక యామె నప్పట్టునందె
వదలి శునకమ్ముతోఁ బాండు బంచకమ్ము
పయనమాపక కుధరమ్ము పైకినెక్కి
పోవుచుండిరి పట్టుతో త్రోవఁబట్టి. 92

బండలను ద్రొక్కి ముండ్లకంపలను దూరి,
పదము మోపఁగ నింతయు వలనుకాని
పట్టులను బాములై ప్రాకి, వారు బడలి
సడలి ముందేఁగుచుండ, నశక్తులగుచు, 93

కవలు నిట్టూర్చి స్రుక్కి రక్తమ్ముఁగ్రక్కి,
కనుల బూజులుగప్పె మైకమ్ము తగిలి,
క్ష్మాతలమ్మునఁ గూలి రగ్రజులు వెనుక
తిరిగిచూడని పగిదిఁ బైకరుగుచుండ. 94

పార్థునంతటివాఁడును బట్టులూడి
పడెను మరికొంతదూరమ్ము నడచి, యంత
పవన నందనుఁడును బడెఁ బర్వతమ్ము
పైనిఁ బడుచున్న వేఱొందు బర్వతమన. 95

శునకమొక్కటె తోడుగాఁ దనదువెంట
నుండి నడచుచునుండఁగ నూడిపడక,
పాండవాగ్రజుఁ డాఁగక పర్వత శిఖ
రాగ్రమునుజేరె ధర్మధైర్యమ్ము వెలుఁగ. 96

అవలిదారినిఁ గనక శూన్యమునె యెందుఁ
జూచి, యాతఁడు మఱి యేమితోచకుండఁ
గలయఁ బరికించుచుండ నాకమ్మునుండి
వచ్చి పుష్పకమున సురపతి యటకును, 97

ధర్మజా! యింక దేవరథమ్ము నెక్కి
రమ్ము నాతోడ నమరలోకమ్ముఁజేరి
సంకటమ్ములు సమయ శాశ్వత సుఖమ్ము
నందఁగలవని పిలిచెఁ జేయంది యిచ్చి. 98

తమ్ములను ధర్మపత్నిని దారి నడుమ
దయను బోనాడి విడిచి భూతలముపైన,
తానుమాత్రము స్వర్గపథమ్ముఁజేర
తగని ధర్మమ్మునెంచి యుత్తముఁడతండు 99

వల్లకామిని దెలుప, వారెల్ల నచటఁ
బదిలపడి సౌఖ్యమున నున్నవారటంచుఁ
బలికి సురపతి వాని నొప్పంగఁజెప్పి
పయన మగుమని ప్రార్థింప వాఁడు, దన్ను 100

బాయకుండిన కుక్కను వదల మనసు
రాక, దానిని గూడను నాకమునకుఁ
దనదు వెంటనె గొనిపోవు తలపులున్నఁ
దన్నుఁ గొనిపోవఁదగునని యన్న, నవ్వి 101

యమరనాథుఁడు, మతిసెడె నయ్యా నీకు!
అల్పజంతువు దీనినేమంచు దివికిఁ
బుష్పకమ్మున నిడికొనిపోదు; సురలు
పరిహసింపరె ననువెట్టివానిఁజేసి! 102

వలనుగానట్టి పనియది, పట్టువిడిచి
వదలి దీనిని నిందె నా పలుకులువిని
పయనమ్మైరమ్ము; నినుజూడవలచి యచట
బాటఁగనిపెట్టి యున్నారు బందుగులనఁ, 103

గంటికందంగరాక నన్నొంటిగాని
కాగ నొవరించి విడనాడి యేఁగినారు
వారు; శునకమ్మెయయ్యు నన్వదలలేని
పాశమునఁజిక్కి యిది నను బాయకుండ 104

నంటియున్నది; వినుము నా యభిమతమున
నధిక మనిపించు నిది వారికన్న; నన్ను
నమ్మియున్నట్టిదీని నన్యాయముగను
వదలిరాలేను; యిటనె తపమ్మునందు 105

చుందు విన్నెంచి, మోక్షము నందఁగలుగు
వఱకు; నిర్బంధపఱచక వదలిపొమ్ము
నన్ను మన్నించి యిక దేవనాథ! యంచు
దండమిడి చక్క బదులిడె ధర్మజుండు. 106

తనయు ధర్మప్రవృత్తినిఁ దఱచిచూడఁ
దనువుగొని కుక్కయై యటు దండనుండి
నట్టి ధర్ముండు, వాఁడట్టులాడ, మారి
దర్శనంబిచ్చి, పుత్రవాత్సల్య పూర్ణ 107

భావముప్పొంగ, కొడుక! నీవంటి ధర్మ
పరుల నెదును నేఁగాంచి యెఱుఁగ; నీకుఁ
దండ్రియై నేను ధన్యుల ధన్యుఁడైతి
నంచు గొప్పగఁ జేసి నుతించి మఱగె. 108

అంత గంధర్వులును, మరుదశ్వినులును,
దేవఋషులును వానిని దేరిపైని
బట్టి యెక్కింప, నతఁడు నభమ్ముపైకి
నరిగి స్వర్గమ్ముజేరెఁ గాయమ్ముతోడ. 109

అతని నలకాపురిని జుట్టి యరుగనడపి,
యచటి వైభవముల నెల్ల నరయఁజూపి,
యవల సురపతి దేవసభాంతరమున
కరిగె వానిని తోఁగొని- యందుఁ బుణ్య 110

ధనులు పవనాత్మజాది సోదరులు కానఁ
బడకయుండఁగ, దుష్టచిత్తుఁడు ఖలుండు
ధార్తరాష్ట్రుఁడె కనిపింప, ధర్మజుండు
దాపతప్తుఁడుగాఁ దన్ను, దమ్ములున్న 111

పట్టునకుఁ దీసికొనిపోయి వదలిపెట్టు
మంచు గోరిన, స్వర్గలోకాధిపతియు
నల్లెయని వాని, దూతను బంచఁబిలిచి
పంపెఁ దోడిచ్చి; వెడలెను వాడుఁ నంత. 112

పలుచఁబడవెల్గు చీఁకట్లు ప్రబ్బుచుండఁ,
బదము మోపఁగనైనను వలనుకాని
పట్టులను మెట్టి, గుండియు కొట్టుకొనుచు
నుండ దడ దడ, కాయమ్ము మండుచుండ, 113

గోఁతులనుబడి, కాటుక కొండలెక్కి,
కంపలనుద్రొక్కి, నెత్తుటిరొంపిలోనఁ
బూదుచున్నట్టి పదముల నూడఁదీసి
కొనుచు, నిప్పనుగ్రక్కు పట్టునను గ్రమించి, 114

బాటపొడుగున్ గనుచు భీభత్సదృశ్య
ములను, వీనులఁజీల్చు నెల్గులను వినుచు,
వాఁడు పయనించుచుండ-పోవలదుమమ్ము
వదలి యిచ్చట, నరకకూపమ్ములోన 115

బాధపడుచున్న మాదు దాపమ్ములారి
నట్టులనిపించె దరిసినీ వరుగుచుండ
మమ్మటంచును ఘోషించు తమ్ముల మొఱ
స్పష్టముగవాని చెవులను బడఁదొడంగె. 116

కాలుకదలకనిలిచిన, పాలుపోక
కాయమెల్లను గంపింపఁ, గరఁగి నీరు
గాగగుండియు, శోకవికారుఁడగుచుఁ
గలఁగి, సోదరులకు శాంతిఁగలుగ నటనె 117

నిలిచియుండఁగ తిరముగ నిశ్చయించి,
మఱలిరానింక నిటనుండి సురపురికిన
టంచుజెప్పుము పొమ్ము దేవాధిపతికి
నంచు దూతను పోఁబంపె నతఁడు క్రుంగి. 118

అష్టదిక్పాలకులతోడ నమరలోక
వాసులుమగూడఁగదలిరా వాసవుండు
వచ్చి యప్పట్టునకు, వాని పంచకరుగ,
తొలఁగి చీఁకట్లు వేయివెల్గులు వెలింగె. 119

నరకయాతనలోఁబడి నలుగుచున్న
వారి తాపమ్ములారె దేవతలకంటి
చలువ మెయిసోకినంతనె, సంతసింప
ధర్మజుండును నట్టివిధమ్ముఁ జూచి. 120

క్షత్రియులు కొన్ని ఘడియల కాలమైన
గడుపకుండఁగ నరకలోకమున పరమ
పథమునందెడు నర్హత బడయరాని
కారణమ్మున నిన్నును గష్టపెట్ట 121

వలపి వచ్చెను దాని నిభ్భంగిఁ జూపి,
భంగపడకుము, కల్పింపఁబడిన నరక
భావనాలోకమునకు నిన్భటుని వెంట
బంపితినటంచు నింద్రుఁడేర్పడఁగఁబల్కె. 122

స్నాన మొనరింప జాహ్నవీ జలములందు
పాండవాగ్రజు, వాఁడు దివ్యత్వమంది
పాసిపోవఁగ నైహిక బంధములవి
స్వర్గమునుఁ జేరఁగలిగెఁ బ్రశాంతుఁడగుచు.

పదములొత్తుచుఁ గృష్ణుని పంచనున్న
వానిఁ బార్థుని, భానుని భంగి వెలుఁగు
ఘనుని కర్ణుని, వాయుదేవునికిఁ బ్రక్కఁ
బదిలముగనున్న భీముని, వానికడనె 124

యశ్వినీదేవతలతోడ నమరియున్న
నకుల సహదేవులను, రతనాలరాశి
పగిఁది వెలుగొందుచున్న ద్రౌపదిని, నామె
చెంత గంధర్వరూపులై చేరియున్న 125

ద్రౌపదేయుల, బాలేందు ప్రభల వెలుఁగు
వాని నభిమన్యు, గంధర్వపాలకుఁడయి
పరువుఁ జిల్కెడు ధృతరాష్ట్రు, వసువులకును
మధ్య భీష్ముఁని, సుర సభామందిరమునఁ 126

గనులపండువుగాఁజూచి, తనిసి వాఁడు
దగిన యాసనమున దేవతలకు నడుమ
నమర, దేవర్షు లందఱు నలరి శుభము
వల్కి దీవించుచుండఁ బుష్పములఁజల్లి, 127

దేవదుందుభిననదించ, దివ్యశంఖ
నాదములుమించ, జంత్రగానమ్ముతోడ
గాత్రములుఁగూడ, గజ్జెలు ఘల్లురనగ
గాళ్ళనొకభంగి విదిలించి, క్ష్మాతలమునఁ 128

బదిలముగనిల్పి పదముల, యెదలనడుమ
పాణిపద్మమ్ములను మోడ్చి, భావమొప్ప
మస్తకమువంచి సభకు నమస్కరించి,
యచ్చరలు నాట్యమాడి రత్యద్భుతముగ..... 129

సంగ్రహించితినిటులు నాశక్తికొలఁది
భారతమ్మును, సుందరభారతమన
పరమసులభాంధ్రమున, గీతపద్యములను
బామరులకును నసువైన బాటఁబట్టి. 130


రసము, శిల్పము, తత్త్వసారమును నిందు
రసికులకు నందకున్న నారాటపడను;
రమ్యమై కుంటువడని ధోరణిననంది
సాగినదియన్నఁ జాలును సంతసింతు. 131

పండితుఁడఁగాను; గురువర్యుపంచఁజేరి
పట్టుతో శిక్షనందినవాఁడఁగాను;
ప్రకృతిసిద్ధమ్ముగా లభ్యపడిన తెలుఁగు
బాసనే ప్రాపుగాఁగొని వ్రాసినాఁడ. 132

తప్పులకు పాలుపడిన యుత్తములుగలరు
గాన, నిందును నందందుఁ గానఁబడిన
తప్పులనుదిద్దఁ బ్రాజ్ఞులు దలఁపడినను
తాపపడనేను నిత్యవిద్యార్థినగుట. 133

ఆంధ్రుఁడొక్కఁడు, దీని చేనంది చదివి,
యంతయో, యింతయో జ్ఞానమందుకొనిన
యట్టిసన్నలు సూపినయంతఁ దృప్తి
పడుదు సంకల్పఫలము రూపందినట్లు. 134

## పర్వము సమాప్తం



# శ్రీ కృష్ణ స్తుతిః

1. కృష్ణం కమలపత్రాక్షం పుణ్యశ్రవణ కీర్తనం ।
వాసుదేవం జగద్యోనిం నౌమి నారాయణం హరిమ్ ।

2. ప్రపన్న పారిజాతాయ తోత్రవేత్రైక పాణయే ।
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః ॥

3. కృష్ణాయ యాదవేన్ద్రాయ జ్ఞానముద్రాయ యోగినే ।
నాథాయ రుక్మిణీశాయ నమో వేదాన్తవేదినే ॥

4. సారథ్యమర్జున స్యాదౌ కుర్వన్ గీతామృతం దదౌ ।
లోకత్రయోపకారాయ తస్మై కృష్ణాత్మనే నమః ॥

5. వాచకరి ప్రణవో యస్య క్రీడావస్త్వఖిలం జగత్ ।
శ్రుతి రాజ్ఞావపుర్జానం తం వన్దే దేవకీ సుతమ్ ॥

6. వసుదేవసుతం దేవం కంసచాణూర మర్దనం ।
దేవకీ పరమానన్దం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥

7. మూకం కరోతి వాచాలం పఙ్గుం లఙ్ఘయతే గిరిం ।
యత్కృపా తమహం వన్దే పరమానన్ద మాధవమ్ ॥

8. ఆతామ్రపాణి కమల ప్రణయ ప్రతోదం
ఆలోలహార మణికుండల హేమసూత్రం ।
ఆ విశ్వరిమామ్బుకణ మమ్బుద నీలమహ్యాత్
ఆద్యం ధనఞ్జయరథా భరణం మహోనః॥

9. వంశీ విభూషిత కరాన్నవనీర దా భాత్
పీతామ్బరాదరుణమ్బుఫలాధరోష్ఠాత్ ।
పూర్ణేన్దు సున్దరముఖాదర విన్దనేత్రాత్
కృష్ణాత్పరం కిమపి తత్త్వ మహం న జానే ॥

* * *

# శ్రీ వ్యాస స్తుతిః

1. నమశ్శ్రుతిశిరః పద్మషణ్డ మార్తాణ్డ మూర్తయే ।
బాదరాయణ సంజ్ఞాయ మునయే శివవేశ్మనే ॥

2. బ్రహ్మసూత్రకృతే తస్మై వేదవ్యాసాయ వేధసే ।
జ్ఞానశక్త్యవతారాయ నమో భగవతే హరేః ॥

3. వ్యాసాయ యతివర్యాయ విద్యావిగ్రహధారిణే ।
నమస్తే పరమానన్దదాయినే పరమాత్మనే ॥

4. వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్ ।
పరాశరాత్మజం వన్దే శుకతాతం తపోనిధిమ్ ॥

5. వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమోవై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

* * *

# భారత స్తుతిః

1. భీష్మద్రోణతటా జయద్రథజలా గాన్ధారనీలోత్పలా
శల్యగ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా ।
అశ్వత్థామ వికర్ణ ఘోరమకరా దుర్యోధనావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాణ్డవై రణనదీ కైవర్తకః కేశవః ॥

2. పారాశర్యవచ స్సరోజమమలం గీతార్థగంధోత్కటం
నానాఖ్యానక కేసరం హరికథా సమ్బోధనా బోధితమ్ ।
లోకే సజ్జనషట్పదైర హరహః పేపీయమానం ముదా
భూయాద్భారత పఙ్కజం కలిమలప్రధ్వంసి నశ్శ్రేయసే ॥

* * *

*T. T. D Religious Publications Series No 457*

*Price Rs: 20—00*

భారతము సకల వేదాంతతత్త్వముల కాణాచి. జిజ్ఞాసువులకు సకలార్థములనిచ్చే కామధేనువు. రాజనీతిమొదలు సామాన్యనీతివరకుగల సకల నీతులనిధి. ధర్మరాజు. భీష్ముడు. కృష్ణుడు. శకుని. కర్ణుడు. దుర్యోధనుడు మొదలైన పాత్రల ధర్మాధర్మస్వరూప ,సంకర్షణా పరిణామాన్ని తెలుపుతూ, తుదకు ధర్మమే జయించుటను కండ్లకు కట్టినట్లు చూపే దృశ్యకావ్యం. ఇది త్రైకాలిక నిత్యసత్య వచనాలకు ఆకరము.

ఈ సుందర భారతాన్ని సంగ్రహంగా, సరళసుందరంగా ఆబాలవృద్ధానికి అర్థమయ్యేటట్లు తేలిక పదాలేవో తేల్చి, తీయ తీయనిమాటల తెలివికెక్కె తేటగీతుల్లో ప్రసన్నకవి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అని తెలుగుతల్లికి మల్లెపూదండలు కూర్చిన శ్రీ శంకరంబాడి సుందరాచారి సర్వాంగ సుందరంగ తీర్చిన సుందర భారతం ఇది. చదవండి .... ....

***Printed and Published by Sri N Ramesh Kumar, I.A.S., Executive Officer, Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at T. T.D. Press, Tirupati. - C. 2,000 dt. 15-4-96.***